www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రెండో విడత రుణ మాఫీ నేడు!

లక్ష-లక్షన్నర మధ్య ఉన్న మొత్తాలు మాఫీ 13

ఏడు లక్షల మంది రైతులకు ప్రయోజనం

వీరి ఖాతాలకు రూ.6,500 కోట్ల నగదు బదిలీ

అసెంబ్లీలో చెక్కులు పంపిణీ చేయనున్న సీఎం

జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ

మధ్యాహ్నం 12 గంటల తర్వాత నిధులు జమ



మంగళవారం | 30-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 122 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా. 4.45 తదుపరి ఏకాదశి; నక్షత్రం: కృత్తిక ఉ. 10.23 తదుపరి రోహిణి; వర్జ్యం: రా.2.16-3.51; దుర్ముహూర్తం: ఉ.8.31-9.22, రా.10.25-11.08; అమృతఘడియలు: ఉ.8.02-9.36; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.45 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



యాదాద్రి ప్లాంట్‌లో 15,000 కోట్ల దోపిడీ!



భద్రాద్రి ప్లాంట్‌లో 2500 కోట్లు మింగింది ఎవరో?

దొరికినందునే కమిషన్‌ను రద్దు చేయాలంటున్నారు

సుప్రీంకోర్టు కమిషన్‌ను కొనసాగించమని చెప్పింది

కమీషన్లకు కక్కుర్తిపడే ఇండియా బుల్‌తో ఒప్పందం

బీహెచ్‌ఈఎల్ నుంచి బినామీలకు సబ్ కాంట్రాక్టులు

బీఆర్ఎస్ అబద్ధాలు ఆపకపోతే నిజాలు చెబుతా

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

తక్కువ సమయంలో చేసేందుకే భెల్‌కు ఇచ్చాం

అదానీకి ఇవ్వాలన్నది కాంగ్రెస్ ఆలోచన: జగదీశ్‌రెడ్డి

అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ అబద్ధాలు: హరీశ్

30వేల మంది టీచర్లతో 2న సీఎం సమావేశం

అమెరికాలోని ఎన్‌ఆర్‌ఐలతో 4న రేవంత్ భేటీ

ప్రముఖ సంస్థకు సినారె పేరు: జయంతి సభలో సీఎం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.15 వేల కోట్ల దోపిడీ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులోనూ మెగావాట్‌కు రూ.రెండున్నర కోట్ల చొప్పున అంచనా పెంచి.. మొత్తంగా రూ.రెండున్నర వేల కోట్లు దిగమింగిందెవరో లెక్క తేలాలన్నారు. దొరికిపోతామని అర్థమైనందునే.. మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లి విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ కోరారని ఆరోపించారు. కానీ, విచారణ అనంతరం సుప్రీంకోర్టు కమిషన్‌ను కొనసాగించాల్సిందిగా స్పష్టం చేసిందని తెలిపారు. సోమవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "మాజీ మంత్రి ఆవేదన చూస్తుంటే ఇప్పటికే చర్లపల్లి జైల్లో ఉన్నట్లుంది. జ్యుడీషియల్ విచారణ మేము అనలేదు. ఇదే సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొన్ని అంశాల్ని ప్రస్తావించినప్పుడు మా నిజాయితీని మేం నిరూపించుకుంటాం.. విచారణకు ఆదేశాలివ్వాలని కోరారు. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఒప్పందం, యాదాద్రి 260 ఇన్‌టూ 4, సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో 1040 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్రాజెక్టు నిర్మాణం, యాదాద్రి 4వేల విద్యుత్ ఒప్పందం బీహెచ్‌ఈఎల్‌కు ఇవ్వడంపై వారు అడిగితేనే ఆమోదించాం. కమిషన్ సమన్లు

మిగతా 13వ పేజీలో...

3 హత్యల్లో నిందితుడు

బంకులో దొంగతనం కేసూ ఉంది 12

జిల్లా నుంచి ఏడాది బహిష్కరించారు

జగదీశ్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

సభకే రానప్పుడు ప్రతిపక్ష నేతగా ఎందుకు? 13

విద్యుత్తు రంగంపై బాధ్యతలేని నిర్ణయాలు

కేసీఆర్‌పై రాజగోపాల్‌రెడ్డి విమర్శలు

మీకు మేమే ఎక్కువ.. 13

నాపై ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా

మంత్రి వెంకట్‌రెడ్డికి జగదీశ్‌రెడ్డి సవాల్

అర్ధరాత్రి దాటినా.. అసెంబ్లీ! 12

15 గంటలకు పైగా బడ్జెట్‌పై చర్చ

వాణిజ్య పన్నుల స్కామ్

సీఐడీ చేతికి..

సీసీఎస్ నుంచి బదలాయించిన ప్రభుత్వం

మరింత లోతుగా దర్యాప్తునకు ఆదేశం.. రూ.వేల కోట్లలో స్కామ్ జరిగిందని నిర్ధారణ

ఇప్పటికి తేలింది రూ.1,400 కోట్లు.. సోమేశ్‌కుమార్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కుంభకోణం కేసును ప్రభుత్వం సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) నుంచి నేర పరిశోధన విభాగం(సీఐడీ)కు బదలాయించింది. ఈ స్కామ్‌లో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని సంస్థల భాగస్వామ్యం ఉండడం, ఏకంగా రూ.1400 కోట్ల కుంభకోణం కావడంతో.. సీఐడీకి అప్పగించింది. ప్రాథమిక విచారణ మేరకు ఈ కేసులో మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) పాత్ర ఉన్నట్లు తేలడంతో.. సీఐడీ దర్యాప్తు పూర్తయితే.. ఆయన చుట్టూ ఉచ్చు బిగుసుకోవడం ఖాయమని తెలుస్తోంది. కుంభకోణం మొత్తం సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే నడిచినట్లు ప్రభుత్వం భావిస్తోంది.

ఆడిట్‌లోనే తేలిన స్కామ్

వస్తువులను భౌతికంగా సరఫరా చేయకపోయినా.. బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించి, పెద్ద ఎత్తున ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గత ఏడాది చివర్లో నిర్వహించిన ఆడిట్‌లో గుర్తించింది. ఆ తర్వాత అంతర్గత విచారణ జరిపి, స్కామ్ నిజమేనని నిర్ధారించుకున్నాక.. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సోమేశ్‌కుమార్‌తో సహా వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఐఐటీ-హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై


మిగతా 14వ పేజీలో...

వయో పరిమితి పెంపు బిల్లుకు మోక్షం

వైద్య విద్యలో విభాగాధిపతి పోస్టులపై వీడిన చిక్కుముడి

61 ఏళ్ల నుంచి 65కు పెంపునకు గవర్నర్ ఆమోదం 3





సాగర్ దిశగా కృష్ణమ్మ

తెరుచుకున్న శ్రీశైలం మూడు గేట్లు

దిగువకు 1.62 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు జలకళ

సాగర్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం

భద్రాచలంలో 43 అడుగుల వద్ద ప్రవాహం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): కృష్ణమ్మ శ్రీశైలాన్నీ దాటేసి నాగార్జున సాగర్ దిశగా పరుగులు పెడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో మూడు గేట్లు ఎత్తి, దిగువకు నీటిని వదిలిపెట్టారు. సాగర్‌లోకి 1.62లక్షల క్యూసెక్కుల నీరు వెళుతోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా కృష్ణా బేసిన్‌లో జలాశయాలన్నీ నిండుగా ఉన్నాయి. శ్రీశైలం నుంచి ఎగువన కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ నిండినట్లే. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో తెలంగాణ జెన్‌కోకు చెందిన 234 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రియదర్శిని జూరాల, 240 మెగావాట్ల సామర్థ్యం కలిగిన

మిగతా 3వ పేజీలో...

నరకప్రాయ జీవితం..

అలాగే పరీక్షలకు సిద్ధమవుతున్నాం.. వర్షాకాలం నీరు నిలిచిపోతోంది

- వాన నీటిలో మురుగు కలుస్తోంది.. మౌలిక సౌకర్యాలు ఉండవు.. ఇది అధికారుల నిర్లక్ష్యమే
- సివిల్స్ అభ్యర్థుల మృతి నేపథ్యంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు ఢిల్లీ విద్యార్థి లేఖ
- విచారణ కమిటీ ఏర్పాటుచేసిన కేంద్రం.. 10 లక్షల పరిహారం.. భవన యజమాని, ఐదుగురి అరెస్ట్
- గ్యాస్ చాంబర్లలా కోచింగ్ సెంటర్లు: ధన్‌ఖడ్.. సివిల్స్ అభ్యర్థుల మృతిపై ఎంపీల ఆందోళన



దారుణానికి బాధ్యులెవరు? అంటూ 'రావూస్' ఎదుట ఆందోళన

న్యూఢిల్లీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రావూస్ సివిల్స్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరద నీరు పోటెత్తి ముగ్గురు అభ్యర్థుల ప్రాణాలను బలి తీసుకున్న నేపథ్యంలో.. ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల లేమిపై అవినాశ్ దూబే అనే విద్యార్థి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాడు. "మేం నరకంలో బతుకుతున్నాం" అంటూ.. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న కష్టాలను తన లేఖలో వివరించాడు. "సర్.. ఏటా రాజేంద్రనగర్, ముఖర్జీనగర్‌లాంటి ప్రాంతాల్లో వర్షాలు పడితే ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మేం ఏటా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాం. మోకాలి లోతు డ్రైనేజీ నీటిలో నడవాల్సి వస్తుంది. వాన నీటిలో మురుగు నీరు కలిసిపోతుంది. ఆ నీరు ఒక్కోసారి ఇళ్లల్లోకి కూడా ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితుల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న మాలాంటి విద్యార్థులందరం నరకప్రాయమైన జీవితం గడుపుతున్నాం. ఇక్కడ విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి

మిగతా 2వ పేజీలో...



ప్రైవేటు స్కూళ్లకే మొగ్గు!

2021-22లో ప్రైవేటుకన్నా ప్రభుత్వ స్కూళ్లలో 2 లక్షల పైగా విద్యార్థులు

2023-24లో సర్కారుకన్నా ప్రైవేటు బడుల్లో 7 లక్షల మంది అదనం

కేటాయింపు కంటే తక్కువగా వ్యయాలు.. పాఠశాల విద్య పద్దులో స్పష్టం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇదే సమయంలో ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగిపోతున్నాయి. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్ల సంఖ్య మరింతగా తగ్గిపోవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. పాఠశాల విద్యకు సంబంధించిన పద్దును ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఇందులోని వివరాలను పరిశీలిస్తే పాఠశాలల్లో ప్రవేశాల తీరు స్పష్టమవుతోంది. పద్దులోని వివరాల ప్రకారం.. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు 30,78,189 ఉండగా.. ప్రైవేట్ బడుల్లో 28,67,895 మంది ఉన్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు ప్రైవేటుకన్నా 2 లక్షలకు పైగా ఉన్నాయి. అయితే 2022-23 విద్యా సంవత్సరం

మిగతా 14వ పేజీలో...

14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్.. షెడ్యూల్ ప్రకటించిన ఎంసీసీ 2



మద్దతు ధరపై కాంగ్రెస్ మొసలి కన్నీరు

కౌలు రైతులకు రూ.15వేల సాయం ఏమైంది

వరికి రూ.500 బోనస్ ఎందుకు ఇవ్వడం లేదు 3

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

లోక్‌సభలో బీజేపీ విప్‌గా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఏపీలో పేదలకు జాక్‌పాట్!

గ్రామాల్లో 3.. పట్టణాల్లో 2 సెంట్ల భూమి

కొత్త లబ్ధిదారులకే.. ఏపీ ప్రభుత్వ కీలక నిర్ణయం

రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలు జారీ

స్కాన్ చేస్తే రైతుల భూముల వివరాలు 14

మోదీ పద్మవ్యూహం..

భయోత్పాతం!

ద్రోణ, కర్ణాదులు అభిమన్యుడి ప్రాణాలు తీశారు

21వ శతాబ్దపు పద్మవ్యూహంలోనూ ఆరుగురే

వారే మోదీ, షా, దోభాల్, భగవత్, అదానీ, అంబానీ

వీరి చేతిలో దేశంలోని అన్ని వర్గాలు ఇబ్బందుల్లో

అన్ని రంగాల్లోనూ భయానక వాతావరణమే

లోటస్‌లానే పద్మవ్యూహం.. మోదీ ఛాతీపైన ఆ గుర్తు

నేటి యువత అర్జునులు.. వ్యూహాన్ని ఛేదిస్తారు

కులగణన ద్వారా పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టేస్తాం

లోక్‌సభలో సుదీర్ఘ ప్రసంగంలో రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ, జూలై 29: ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి 'ఆధునిక పద్మవ్యూహాన్ని' నిర్మించి.. అందులో ప్రజలను బందీలను చేసి, దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించారని విపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీలో ఒకే వ్యక్తికి ప్రధాని కావాలనే

మిగతా 2వ పేజీలో...



నితీశ్ సర్కారుకు సుప్రీంలోనూ నిరాశే

గతంలో రిజర్వేషన్లు 65 శాతానికి పెంపు చెల్లదన్న పట్నా హైకోర్టు

ఆ ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరణ 2

నితీశ్ సర్కారుకు సుప్రీంలోనూ చుక్కెదురు

న్యూఢిల్లీ, జూలై 29: బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పును నిలిపివేయడానికి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం నిరాకరించింది. నితీశ్ సర్కారు బిహార్‌లో దళితులు, ఆదివాసీలు, బీసీల కోటాను 50% నుంచి 65 శాతానికి పెంచుతూ రిజర్వేషన్ చట్టానికి సవరణ తెచ్చింది. దాన్ని పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో నితీశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పాట్నా హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వడానికి తిరస్కరించిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో బిహార్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను మాత్రం విచారణకు స్వీకరించింది. వీటిపై సెప్టెంబరులో విచారణ చేపడతామని తెలిపింది. బిహార్ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. ఛత్తీస్‌గఢ్‌లో రిజర్వేషన్ పెంపును వ్యతిరేకించిన అక్కడి హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసిన విషయం ఆయన గుర్తుచేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ పిటిషన్‌ను విచారణకు తీసుకుంటాం కానీ హైకోర్టు తీర్పును నిలుపుదల చేయలేం అని తేల్చిచెప్పింది.

గడువులోగా ఫ్లాట్ అప్పగించనందుకు వడ్డీతో సహా సొమ్ము మొత్తం చెల్లించండి

న్యూఢిల్లీ, జూలై 29: ఫ్లాట్ నిర్మించి అప్పగించడంలో అసాధారణ జాప్యం చేసినందుకు కొనుగోలుదారుకు మొత్తం సొమ్మును వాపసు చేయాలని ఓ డెవలపర్‌ను సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. వారు చెల్లించిన మొత్తంపై 12% వార్షిక వడ్డీ కూడా ఇవ్వాలని సూచించింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ అనే సంస్థ ఇక్కడి సుభాష్‌నగర్‌లో పార్శ్వనాథ్ పారామౌంట్ పేరుతో 2008లో గ్రూపు హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. 3బీహెచ్‌కే ఫ్లాట్ కోసం కొనుగోలుదార్లు తొలుత రూ.16 లక్షలు చెల్లించారు. అనంతరం డెవలపర్ చెప్పిన విధంగా మిగిలిన మొత్తాన్ని కూడా పూర్తిగా చెల్లించారు. 30 నెలల్లోగా ఫ్లాట్‌ను అప్పగించాల్సి ఉండగా, డెవలపర్ విఫలమయ్యారు. దాంతో కొనుగోలుదార్లు జాతీయ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారణ జరిపిన ఫోరం మొత్తం సొమ్మును రిఫండ్ చేయాలని ఆదేశించడంతో పాటు 9 శాతం వడ్డీ ఇవ్వాలని ఆదేశించింది. వడ్డీ రేటుపై సంతృప్తి చెందని కొనుగోలుదార్లు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం..మొత్తం సొమ్మును రిఫండ్ చేయాలన్న ఫోరం ఆదేశాలతో ఏకీభవిస్తునే 12 శాతం వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. 3నెలల్లో చెల్లింపులను పూర్తి చేయాలని సూచించింది.

హేమంత్ సోరెన్ బెయిల్ రద్దు చేయనక్కర్లేదు

న్యూఢిల్లీ, జూలై 29: భూముల కుంభకోణంలో మనీ లాండరింగ్ కేసులకు సంబంధించి జార్ఖండ్ సీఎం సోరెన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు జూన్ 28న ఇచ్చిన బెయిల్ హేతుబద్ధమైందేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనిని రద్దు చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. సోరేన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. "అత్యంత హేతుబద్ధమైన తీర్పు. ఈ విషయంలో మేం జోక్యం చేసుకునేది లేదు" అని స్పష్టం చేసింది. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు తదుపరి విచారణ, చర్యలపై ఎలాంటి ప్రభావం చూపబోవని వ్యాఖ్యానించింది. "ఈ కేసులో ఇతర విషయాల జోలికి మేం వెళ్లడం లేదు. అలా వెళ్తే మీరే(ఈడీ) ఇబ్బందుల్లో పడతారు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు సీఎం హేమంత్ సోరేన్ అన్నారు. ఈ తీర్పుతో ప్రజాస్వామ్యం నిలబడిందని తెలిపారు.

యూజీసీ-నెట్ రద్దుపై పిల్.. సుప్రీం తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 29: యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ ఏడాది జూన్ 18న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నాయని విద్యామంత్రిత్వశాఖ యూజీసీ- నెట్‌ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే... పరీక్షను అసమంజసంగా రద్దు చేయడం వల్ల విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని, వేల మంది శ్రమ వృధాగా పోయిందని ఉజ్వల్ గౌర్ అనే న్యాయవాది పిల్ దాఖలు చేశారు. దీనిని ధర్మాసనం తప్పుబట్టింది. "మీరెందుకు(న్యాయవాది) వస్తున్నారు? విద్యార్థులనే రానివ్వండ"ని వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

న్యూఢిల్లీ, జూలై 29: పెండింగ్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి ఉద్దేశించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం సోమవారం సుప్రీంకోర్టులో ప్రారంభమయింది. సర్వోన్నత న్యాయస్థానంలోని తొలి ఏడు ధర్మాసనాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. తొలిసారిగా కోర్టు రూముల్లోకి మీడియాను, కెమేరాలను అనుమతించారు. సుప్రీంకోర్టు 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 3వరకు వారం రోజుల పాటు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రకటించారు. న్యాయసమస్యలకు సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తుల వివాదాలు వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

కరోనిల్ వాడకంపై పోస్టులను తొలగించండి

న్యూఢిల్లీ, జూలై 29: 'కరోనిల్' వాడకానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన తప్పుడు పోస్టులను తొలగించాలని పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడు, యోగా గురువు రామ్‌దేవ్‌ను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఎక్స్(ట్విటర్)లో పెట్టిన ఆ పోస్టులను మూడు రోజుల్లో తీసేయాలని లేకపోతే వాటిని ఎక్స్ సంస్థే తొలగిస్తుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి రామ్‌దేవ్‌కు వ్యతిరేకంగా పలు వైద్యుల సంఘాలు చేసిన అభ్యర్థనలపై జస్టిస్ అనుప్ జయరామ్ భంభానీ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు మంగళం ఆర్గానిక్ సంస్థ చేసిన ట్రేడ్ మార్క్ ఉల్లంఘనల ఆరోపణకు సంబంధించి కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు పతంజలిపై బాంబే హైకోర్టు రూ.4 కోట్ల జరిమానా విధించింది.

పరువు నష్టం దావాలో మేధా పాట్కర్‌కు ఊరట

న్యూఢిల్లీ, జూలై 29: పరువు నష్టం దావాలో నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమ నాయకురాలు మేధా పాట్కర్‌కు ఊరట లభించింది. ఆమెకు కింది కోర్టు విధించిన అయిదు నెలల సాధారణ జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు రాఘవ్ శర్మ సోమవారం ఆదేశాలు ఇచ్చారు. రూ.25వేల పూచీకత్తుపై బెయిల్ కూడా మంజూరు చేశారు. సమాధానం చెప్పాలని సక్సేనా తరపు న్యాయవాదికి నోటీసులు పంపిస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు నాలుగో తేదీకి వాయిదా వేశారు. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 23 ఏళ్ల క్రితం ఆమెపై పరువు నష్టం దావా వేశారు. నర్మదా బచావో ఆందోళన్‌కు వ్యతిరేకంగా సక్సేనా పత్రికా ప్రకటనలు ఇవ్వడంతో ఆయనకు వ్యతిరేకంగా 2000లో పాట్కర్ కేసు పెట్టారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య న్యాయపోరాటం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమెపై కూడా సక్సేనా పరువు నష్టం దావా వేశారు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్.. కేజ్రీవాల్‌పై తుది చార్జిషీట్

న్యూఢిల్లీ, జూలై 29: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీబీఐ అధికారులు సీఎం కేజ్రీవాల్, మరో ఐదుగురు వ్యక్తులపై తుది చార్జిషీట్ దాఖలు చేశారు. రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం ఈ మేరకు అభియోగపత్రాలను సమర్పించారు. ఇదివరకే ప్రధాన చార్జిషీట్, నాలుగు అనుబంధ అభియోగపత్రాలను దాఖలు చేయగా.. తాజాగా సమర్పించిన తుది చార్జిషీట్‌లో ఈ కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్రను గురించి వివరించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఢిల్లీలోని తన లిక్కర్ వ్యాపారాలకు అండగా ఉండాలని కోరుతూ 2021 మార్చి 16న సీఎం కేజ్రీవాల్‌ను కలిసినట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా లిక్కర్ పాలసీ ఉండేలా చూడాలని కోరారని, దానికి కేజ్రీవాల్ స్పందిస్తూ.. ఇప్పటికే తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మరికొందరు అదే పనిలో ఉన్నారని, కవితను కలవాలని సూచించినట్లు చార్జిషీట్ స్పష్టం చేసింది. అందుకు ప్రతిఫలంగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కు ఫండ్ ఇవ్వాలని కేజ్రీవాల్ కోరినట్లు వివరించింది. ఈ క్రమంలో మద్యం ఉత్పత్తిదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లు ఓ సిండికేట్‌గా ఏర్పడి.. మధ్యవర్తులు, హవాలా ఆపరేటర్ ద్వారా రూ.90 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆప్‌కు అందజేసినట్లు తెలిపింది. ఆ మొత్తాన్ని నిందితులు తిరిగి 'ప్రాఫిట్ మార్జిన్' రూపంలో వెనక్కి తీసుకున్నట్లు ఆరోపించింది. కాగా.. సీబీఐ అధికారులు తుది చార్జిషీట్‌లో ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్‌పాఠక్, పి.శరత్‌చంద్రారెడ్డి, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్‌మాథుర్‌లను నిందితులుగా పేర్కొంది. ఇదిలా ఉండగా, ఎక్సైజ్ కుంభకోణానికి కేజ్రీవాలే సూత్రధారని సీబీఐ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను సోమవారం వ్యతిరేకించింది. అయితే, ఎక్సయిజ్ విధానం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, దీనిపై లెఫ్టినెంట్ గవర్నర్‌తో సహా 15 మంది సంతకాలు చేశారని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది తెలిపారు.

నరకప్రాయ జీవితం..

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా లేదని నిన్నటి (శనివారంనాటి) ఘటన నిరూపించింది. ఢిల్లీ ప్రభుత్వం, మునిసిపల్ కార్పొరేషన్ మమ్మల్ని పురుగుల్లా బతికేలా చేస్తున్నాయి. సర్.. ఆరోగ్యకరమైన జీవితం గడుపుతూ చదువుకోవడం మా ప్రాథమిక హక్కు" అని దూబే తన లేఖలో పేర్కొన్నాడు. వరద నీటి సమస్య.. కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్న విద్యార్థుల భద్రతకే ముప్పుగా పరిణమించిందని ఆవేదన వెలిబుచ్చాడు. సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఎలాంటి భయమూ లేకుండా చదువుకుని, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయగలుగుతారని అభిప్రాయపడ్డాడు. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ వంటి ప్రాంతాల్లో వర్షాకాలంలో నీరు నిలిచిపోయి ప్రజల జీవితం నరకప్రాయం అవుతున్న నేపథ్యంలో.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా సమర్థమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సీజేఐను దూబే కోరాడు.


ఢిల్లీలోని ఓ కోచింగ్ సెంటర్ దగ్గర సివిల్స్ అభ్యర్థుల నిరసన ప్రదర్శన

విద్యార్థుల మృతిపై విచారణ కమిటీ

రాజధాని ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల ప్రాణాలు జలసమాధి అయిన ఘటనపై విచారణకు కేంద్ర హోం శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 30 రోజుల్లోగా దీనిపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. ఇక, ఈ ఘటనలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించనున్నట్టు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే కోచింగ్ సెంటర్ యజమాని, కో-ఆర్డినేటర్‌ను అరెస్టు చేసిన పోలీసులు సోమవారం.. ఆ భవన బేస్‌మెంట్ యజమాని సహా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక ఎస్‌యూవీ డ్రైవర్ కూడా ఉన్నాడు. ప్రమాదానికి కేంద్రమైన రావూస్ కోచింగ్ సెంటర్ ముందు నుంచి శనివారం సాయంత్రం ఆ ఎస్‌యూవీ వేగంగా వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వాహన వేగం ధాటికి నీరు అలలుగా వెళ్లి గేటును తాకడంతో అది విరిగిపోయిందని పోలీసులు చెబుతున్నారు. అతడు తన వాహనాన్ని చాలా వేగంగా నడిపాడని.. ఆ రోడ్డులోకి వెళ్లొద్దంటూ వీధివ్యాపారి ఒకరు వారించినా వినిపించుకోలేదని వారు వెల్లడించారు. ఆ వాహనం వెళ్లకముందు రావూస్ స్టడీ సర్కిల్ భవనం గేటు బాగానే ఉందని.. వాహన వేగం ధాటికి నీరు ఉధృతంగా చొచ్చుకురావడంతో అది విరిగిపోయిందని వారు వెల్లడించారు. సోమవారం అరెస్టు చేసిన ఐదుగురినీ కోర్టు ఆగస్టు 12 దాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కాగా.. ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్ ప్రాంతంలో ఉన్న అన్ని కోచింగ్ సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించి.. నిబంధనలు ఉల్లంఘించిన 20 శిక్షణ కేంద్రాల బేస్‌మెంట్లకు సీల్ వేశారు. మరోవైపు.. డ్రైనేజీలో పూడిక తీయకుండా, నీళ్ల నిలిచిపోవడానికి కారణమైన జూనియర్ ఇంజనీర్‌ను ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. మరో అసిస్టెంట్ ఇంజనీర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తానియా సోని, శ్రేయ యాదవ్, నెవిన్ డెల్విన్ మృతదేహాలను వారి కుటుంబసభ్యులు స్వస్థలాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. తమకు పరిహారం అక్కర్లేదని.. ఈ విషాదానికి బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని నెవిన్ డెల్విన్ తండ్రి విజ్ఞప్తి చేశారు.


ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ హౌస్‌లో బీజేపీ సభ్యుల నినాదాలు

సభలో ఎంపీల ఆగ్రహం..




ముగ్గురు విద్యార్థుల మరణంపై పార్లమెంటు ఉభయసభల్లోనూ ఎంపీలు ఆందోళన చేశారు. రాజ్యసభలో ఈ అంశంపై స్వల్పకాల వ్యవధి చర్చకు అనుమతించిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్.. దేశంలో సివిల్ సర్వీస్, ఇంజనీరింగ్, వైద్య పరీక్షలకు శిక్షణనిచ్చే కేంద్రాలు లాభాలు దండుకునే పరిశ్రమలుగా.. గ్యాస్‌చాంబర్లుగా మారిపోయాయని విమర్శించారు. ఆయా సంస్థలు ప్రకటనలకు చేసే ఖర్చుపైనా విచారణ జరిపించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై చర్చించేందుకు అన్ని పార్టీల నాయకులనూ కలుసుకుంటానని ధన్‌ఖడ్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రావూస్ స్టడీ సర్కిల్‌లో ముగ్గురు విద్యార్థుల మరణానికి కారణం కేజ్రీవాల్ ప్రభుత్వమేనని ఆమ్ ఆద్మీ పార్టీ తిరుగుబాటు ఎంపీ స్వాతి మలివాల్ ధ్వజమెత్తారు. ఆమె వాదనను ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ తోసిపుచ్చారు. ఢిల్లీలో ఆ కోచింగ్ సెంటర్లు పాతికేళ్లుగా ఉన్నాయని.. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే వాటికి అనుమతినిచ్చిందని గుర్తుచేశారు. ఢిల్లీలో అధికారాలన్నీ లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లో ఉన్నాయని.. అధికారులెవరూ తమ మాట వినట్లేదని సంజయ్‌సింగ్ తెలిపారు. ఇక లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తిన కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్.. కోచింగ్ సెంటర్లు మాఫియాగా మారాయని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనానికి అగ్నిమాపక శాఖ ఈ నెలలోనే నిరభ్యంతర పత్రం ఇచ్చిన నేపథ్యంలో.. ఆ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులను ఈ ఘటనకు బాధ్యులుగా చేయాలని సమాజ్‌వాదీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పించాలని స్పీకర్‌కు లేఖ రాశారు. ఈ విషాదానికి ఎవరు బాధ్యత వహించాలనే అంశంపై బీజేపీ, ఆప్ నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరుగుతోంది. సోమవారం కొందరు బీజేపీ నేతలు ఢిల్లీలోని ఆప్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆప్ నేతలేమో.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు.

లోకం తీరు



ఫిర్యాదు చేసినా..

నిబంధనల ఉల్లంఘనపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని విద్యార్థులు మండిపడుతున్నారు. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌తోపాటు మరికొన్ని కోచింగ్ సెంటర్లలో బేస్‌మెంట్లలో గ్రంథాలయాలు, తరగతిగదులను ఏర్పాటు చేయడంపై జూన్ 26నే తాను అధికారులకు ఫిర్యాదు చేశానని, కానీ ఎవరూ పట్టించుకోలేదని కిశోర్ సింగ్ కుశ్వాహ అనే సివిల్స్ ఆశావహుడు తెలిపారు. ఇక.. ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతికి నిరసనగా సోమవారం వందలాది మంది విద్యార్థులు రావూస్ స్టడీ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. "ఇప్పుడు ఎలాంటి చర్యలూ తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగుతాయి. మరింత మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతారు. మమ్మల్ని మేమే కాపాడుకోలేకపోతే భవిష్యత్తులో దేశానికి ఎలా సేవ చేయగలం? ఇతరుల ప్రాణాలను ఎలా కాపాడగలం" అని రాహుల్ శర్మ అనే విద్యార్థి ఆగ్రహంగా ప్రశ్నించారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. విద్యార్థుల మృతికి బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారికి హామీ ఇచ్చారు. కానీ.. విద్యార్థులు శాంతించలేదు. "మాకు న్యాయం కావాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. "పోలీసు బారికేడ్ల వెనకాల నిలబడడం కాదు.. మీరు కూడా ఇటువైపు వచ్చి మాతో కలిసి నిరసన తెలపండి" అని సక్సేనాను ఆహ్వానించారు.


ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్‌కు సీల్ వేస్తున్న అధికారులు

ముస్లింలు అంటరానివారా?

» 17 కోట్ల మంది జనాభాకు ప్రాధాన్యమేది?

» బడ్జెట్‌పై చర్చలో హైదరాబాద్ ఎంపీ ఒవైసీ

న్యూఢిల్లీ, జూలై 29: కేంద్ర బడ్జెట్‌లో ముస్లింలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలోని 17 కోట్ల మంది ముస్లింలను అంటరానివారుగా చూస్తూ.. వికసిత భారత్ లక్ష్యాలను ఎలా సాధిస్తారంటూ ప్రశ్నించారు. మైనారిటీ వ్యవహారాల శాఖకు కేటాయింపులను రూ.5 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్లకు తగ్గించడాన్ని తప్పుబట్టారు. హజ్ కమిటీలు అవినీతి కేంద్రాలుగా మారాయని.. వాటిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2007-08 నుంచి మైనారిటీ ఉపకార వేతనాలను పెంచకపోవడాన్ని ప్రస్తావించారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఒవైసీ మాట్లాడారు. దేశంలో ముస్లింలు మరీ ముఖ్యంగా ముస్లిం మహిళలు అత్యంత పేదరికంలో ఉన్నారని పేర్కొన్నారు. 15 నుంచి 24 ఏళ్ల వయసున్న ముస్లిం యువతలో 29 శాతం మందికి మాత్రమే చదువుకునే అవకాశం ఉంటోందని చెప్పారు. ఉన్నత విద్య చదువుతున్న ముస్లింలు 5 శాతమేనన్నారు.

జమ్ముకశ్మీర్‌లో పేలుడు.. నలుగురి మృతి

శ్రీనగర్, జూలై 29 : జమ్ముకశ్మీర్‌లోని సోపోర్‌లో సోమవారం జరిగిన ఒక పేలుడు ఘటనలో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్ పట్టణంలో ఒక తుక్కు డీలర్ దుకాణంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. ఒక ట్రక్కు నుంచి కొంతమంది తుక్కును దింపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందని అధికారులు చెప్పారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా.. మరో ఇద్దరు గాయాలతో కొద్దిసేపటికి చనిపోయారు. వారిని నజీర్ అహ్మద్ నద్రూ(40), ఆజిమ్ అశ్రఫ్ మిర్(20), ఆదిల్ రషీద్ భట్(23), మహమ్మద్ అజహర్(25)గా గుర్తించారు.

మోదీ పద్మవ్యూహం.. భయోత్పాతం!


కిరెన్ రిజిజు


రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్ష ఉంటుందని.. ఒకవేళ రక్షణమంత్రి తాను ప్రధాని కావాలని అనుకుంటే అది సాధ్యపడదని, దాని వెనుక కూడా భయమే కారణం అని.. ఈ విధంగా భయోత్పాతం అనేది దేశంలోని ప్రతి రంగానికి వ్యాపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై రాహుల్ గాంధీ 46 నిమిషాల పాటు ప్రసంగించారు. మహాభారత కాలంలో చక్రవ్యూహం (పద్మవ్యూహం) కమలం పువ్వు మాదిరిగానే ఉండేదని, అందులోకి ప్రవేశించిన అభిమన్యుడి చుట్టూ ద్రోణాచార్యుడు, కర్ణుడు, కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని అనే అరుగురు కలిసి ఉచ్చు బిగించి చంపేసినట్లే.. ప్రధాని మోదీ సారథ్యంలో ఆరుగురు కలిసి చక్రవ్యూహానికి రూపకల్పన చేశారని విమర్శించారు. 21వ శతాబ్దపు ఈ పద్మవ్యూహం కూడా కమలం పువ్వు మాదిరిగానే ఉందని, ఆ చిహ్నాన్ని మోదీ తన ఛాతీ మీద పెట్టుకుంటారని పేర్కొన్నారు. అప్పట్లో అభిమన్యుడి పట్ల జరిగిన పరిణామాలే ఇప్పుడు దేశంలోని యువత, రైతులు మహిళలు, శ్రామికులు, చిన్న వ్యాపారుల పట్ల జరుగుతున్నాయని మండిపడ్డారు. నాడు అభిమన్యుడిని ఆరుగురు కలిసి చంపినట్లే.. ఈనాటి చక్రవ్యూహం కేంద్రంగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సంఘ్ చీఫ్ మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, పారిశ్రామికవేత్తలు అంబానీ, అదానీ అనే ఆరుగురు ఉన్నారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో సంపద నియంత్రణ.. ఈడీ, ఐటీ, సీబీఐ.. రాజకీయ కార్యనిర్వాహక వర్గం అనేవి దేశాన్ని గుప్పిట్లో పెట్టుకున్న 'చక్రవ్యూహానికి' గుండెకాయ వంటివని.. ఇవి దేశాన్ని నాశనం చేశాయని వ్యాఖ్యానించారు. అగ్నివీర్ అనే చక్రవ్యూహంలో యువతను లక్ష్యంగా చేసుకున్నారని.. అగ్నివీరులకు పెన్షన్ కోసం బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చిరు వ్యాపారులకు శరాఘాతంగా పరిణమించిన పన్నుల వాత సమస్యను ప్రస్తావించనేలేదని విమర్శించారు. 'చక్రవ్యూహం' శక్తిని బలహీనపరిచేలా యువత, రైతులు, శ్రామికులు, చిరు వ్యాపారులకు దోహదకారిగా ఉంటుందని తాను ఆశించానని, అవేవీ లేకపోగా ఆర్థిక, రాజకీయ శక్తులను మరింత బలోపేతం చేసేలా ఉందని అభివర్ణించారు. ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేపర్ లీక్ అంశాన్నే ప్రస్తావించలేదని పేర్కొన్నారు. కోట్లాదిమందికి నష్టపరిచేందుకు పన్నిన చక్రవ్యూహాన్ని తాము కులగణన చేయడం ద్వారా బద్దలు కొడతామని, భయానక వాతావరణాన్ని పొగొట్టేదాకా తమ పోరాటం కొనసాగుతుందని ఉద్ఘాటించారు. దేశంలోని యువత అర్జున సమానులని, పద్మవ్యూహాన్ని బద్దలు కొడతారని బీజేపీని హెచ్చరించారు. అనంతరం.. రాహుల్ ఎక్స్‌లోనూ ట్వీట్ చేశారు. 'ఆధునిక చక్రవ్యూహం'లో నిరుద్యోగం, పేపర్ లీక్ ద్వారా యువత.. అప్పుల ద్వారా రైతులు, పన్నుల వాత ద్వారా సామాన్య ప్రజలు, అగ్నిపథ్ ద్వారా జవాన్లు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారని.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలు అన్యాయానికి గురయ్యారని ఎక్స్‌లో రాశారు.

ఏ-1, ఏ-2 అంటే ఓకేనా?

సభలో రాహుల్ గాంధీ తన ప్రసంగంలో భాగంగా ఆధునిక చక్రవ్యూహం వెనుక ఆరుగురు ఉన్నారంటూ మోదీ, షా, భగవత్, దోబాల్, అంబానీ, అదానీ పేర్లను పేర్కొన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. జోక్యం చేస్తున్న స్పీకర్ ఓం బిర్లా సభలో లేని వారి పేర్లను ప్రస్తావించడం సరికాదని రాహుల్‌కు సూచించారు. స్పందించిన రాహుల్.. "మీరు కోరుకుంటే దోభాల్, అంబానీ, అదానీ పేర్లను నేను ఉపసంహరించుకుంటాను" అని వ్యాఖ్యానించారు. అయితే గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలను వారి పేర్లతో కాకుండా ఏ-1, ఏ-2గా పేర్కొన్నారు. "దేశ సంపదపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఆ ఇద్దరి పేర్లను నేను సభలో ప్రస్తావించొద్దంటున్నారు. అప్పుడు నేను అదానీ, అంబానీలను ఏ-1, ఏ-2 అని మాత్రమే చెబుతాను. ఇది అమోదయోగ్యమే కదా"? అని రాహుల్ వ్యాఖ్యానించడం గమనార్హం. దీనిపై పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి రిజిజు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా.. రాహుల్, "ఏ-1, ఏ-2లను రిజిజు వెనకేసుకొస్తున్నారు. ఇది ఆయనకు తప్పదు. ఇలా చేయాలని ఆయనకు పెద్దలు నిర్దేశించారు అని ఎద్దేవా చేశారు.

ఆగస్టు 14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), జూలై 29: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) అండర్ గ్రాడ్యుయేట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సోమవారం మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ప్రకటించింది. ఇందులో భాగంగా మొదటి విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ఆగస్టు 14-21 వరకు ఉంటుంది. ఆప్షన్ల ఎంపిక ఆగస్టు 16-20 వరకు ఉంటుంది. ఆగస్టు 23న సీట్లు కేటాయించనున్నారు. ఆగస్టు 24-29 వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండో విడత కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ సెప్టెంబరు 5-10 వరకు ఉండనుంది. సెప్టెంబరు 6-10 వరకు ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. సెప్టెంబరు 13న సీట్ల కేటాయిస్తారు. సెప్టెంబరు 14-20 వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. నాలుగు రౌండ్లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 710 వైద్య కళాశాలల్లో సుమారు 1.10 లక్షల ఎంబీబీఎస్ సీట్లను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఆయుష్, నర్సింగ్ సీట్లతోపాటు 21వేల బీడీఎస్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే సవరించిన నీట్ ర్యాంకులను విడుదల చేశారు. ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదల చేయనున్నారు. తొలుత ఆలిండియా కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, విద్యా సంస్థల్లోని 15% సీట్లకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఆలిండియా కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన వారం తర్వాత మన దగ్గర ఎంబీబీఎస్ అడ్మిషన్లకు కాళోజీ హెల్త్ వర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

అధ్యక్ష ఎన్నికల్లో గూగుల్ జోక్యం

» ఎలాన్‌మస్క్ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, జూలై 29: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై గూగుల్ 'సెర్చ్ బ్యాన్'ను విధించిందని తద్వారా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తలదూరుస్తోందని ఆరోపించారు. అదేగనక నిజమైతే సుందర్ పిచాయ్ సీఈవోగా వ్యవహరిస్తున్న గూగుల్‌కు మున్ముందు కష్టాలు తప్పవని సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అని టైప్ చేయగా... గూగుల్‌లో "ప్రెసిడెంట్ డొనాల్డ్ డక్", "ప్రెసిడెంట్ డొనాల్డ్ రిగన్" అని రావడాన్ని ఆయన స్క్రీన్ షాట్స్ తీసి షేర్ చేశారు. అయితే మస్క్ పోస్టుకు మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు సమర్థిస్తుండగా, "మీరు కూడా 'ఎక్స్'లో చాలా అకౌంట్లపై ఆంక్షలు విధించలేదా" అని కొందరు విమర్శిస్తున్నారు.

శాకాహారంతో శరీరానికి యవ్వనం

న్యూఢిల్లీ, జూలై 29: మాంసాహారం తినేవారితో పోలిస్తే శుద్ధ శాకాహారం తీసుకొనేవారిలో వయసు పెరిగినా శరీరం యవ్వనంగా ఉంటుందని అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ అధ్యయనంలో తేలింది. శాస్త్రవేత్తలు 21 మంది కవల జంటల(42మంది)పై అధ్యయనం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. అధ్యయనంలో భాగంగా వారు కవలల్లో 21 మంది బృందానికి మాంసాహారం ఇచ్చారు. మిగతా 21మందికి శాకాహారం ఇచ్చారు. ఇలా 8వారాల పాటు ఆహారాన్ని ఇచ్చి పరిశీలించారు. మాంసాహారం తిన్నవారితో పోలిస్తే శాకాహారం తిన్నవారిలో గుండె, కాలేయం, జీర్ణక్రియ వ్యవస్థల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు, వారు సగటున 2 కిలోల బరువు తగ్గినట్లు గుర్తించారు.

ఇతర దేశాలపై ఆధిపత్య ధోరణి వద్దు

» చైనాకు క్వాడ్ సదస్సు గట్టి సందేశం



టోక్యో, జూలై 29: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛ, అవకాశాల పట్ల దృఢమైన తన నిబద్ధతను క్వాడ్ సదస్సు పునరుద్ఘాటించింది. ఈ ప్రాంతంలోని ఏ దేశమూ ఇతర దేశాలపై ఆధిపత్యం ప్రదర్శించకూడదని, ప్రతి దేశానికీ అన్ని రకాల నిర్బంధాల నుంచి విముక్తి లభించేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. ఈ మేరకు చైనాకు సోమవారం క్వాడ్ సదస్సు స్పష్టమైన, గట్టి సందేశాన్ని ఇచ్చింది. క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు ఎస్.జైశంకర్(భారత్), ఆంటోనీ బ్లింకెన్(అమెరికా), యోకో కమికవా(జపాన్), పెన్నీ వోంగ్(ఆస్ట్రేలియా) జపాన్ రాజధాని టోక్యోలో సమావేశమయ్యారు. దేశాల ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని, స్వేచ్ఛా సూత్రాలను, మానవ హక్కులను, ప్రజాస్వామిక విలువలను గౌరవించే అంతర్జాతీయ స్వేచ్ఛా నిబంధనలను సదస్సు సమర్థించింది. చైనా పేరును నేరుగా ప్రస్తావించకుండానే.. తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లోని పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బలప్రయోగం, నిర్బంధం ద్వారా యథాతథస్థితిని మార్చే ఏకపక్ష చర్యల పట్ల క్వాడ్ తన వ్యతిరేకతను బలంగా పునరుద్ఘాటించింది. సమావేశం అనంతరం ఈ వివరాలను నలుగురు విదేశాంగమంత్రులు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఐరాస విడుదల చేసిన జాబితాలోని ఉగ్రవాద సంస్థలన్నింటిపైనా సంఘటిత చర్యలు చేపట్టాలనే పిలుపునూ సదస్సు పునరుద్ఘాటించింది. కాగా, చైనాతో భారత్‌కు ఉన్న సరిహద్దు వివాదం పరిష్కారానికి ఇతరుల జోక్యాన్ని జైశంకర్ తోసిపుచ్చారు. ఈ సమస్యపై ఇతర దేశాల జోక్యం కోసం తామేమీ చూడటం లేదని ఆయన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.

వయో పరిమితి పెంపు బిల్లుకు మోక్షం

- వైద్య విద్యలో విభాగాధిపతి పోస్టులపై వీడిన చిక్కుముడి
- 61 ఏళ్ల నుంచి 65కు పెంపునకు గవర్నర్ ఆమోద ముద్ర
- వారంలో రెగ్యులర్ వైద్య విద్య సంచాలకుడి నియామకం?



హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య సంచాలకుడి పరిధిలో విభాగాధిపతి(అడ్మినిస్ట్రేటివ్) పోస్టుల వయో పరిమితి పెంపు బిల్లుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సంబంధిత ఫైల్‌పై ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆదివారం సంతకం చేసినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రాష్ట్రంలో వైద్య విద్య కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులకు విభాగాధిపతుల నియామకం సులభం కానుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులు, వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ) కార్యాలయంలో 69 రెగ్యులర్ పోస్టులున్నాయి. వీటిలో 17 మందే రెగ్యులర్ అదనపు డీఎంఈలున్నారు. మిగిలిన అన్నింటా ఇంచార్జిలే. ఆ పోస్టులను భర్తీ చేయాలనే ఉద్దేశంలో ప్రభుత్వం పదోన్నతులకు సిద్ధమైంది. ఐదేళ్ల ప్రొఫెసర్‌గా పనిచేసినవారి జాబితాను రూపొందించింది. 150 పేర్లతో జాబితాను వైద్య శాఖ సర్కారుకు పంపింది. కానీ, విభాగాధిపతి పోస్టుల్లో ఉండేవారి విరమణ వయసు పెంపు బిల్లు ఆమోదం కాకుండా పదోన్నతులు చేపట్టలేమని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది. దీంతో కొద్ది నెలలుగా ప్రక్రియ నిలిచిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగా అదనపు డీఎంఈల విరమణ వయసును 61 ఏళ్ల నుంచి 65కు పెంచారు. సంబంధిత బిల్లుకు శాసనసభ ఆమోదం అనంతరం గవర్నర్ ఆమోదానికి పంపారు. అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. రెండోసారీ పంపగా.. ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి, తమిళిసై వెళ్లిపోయాక.. ఇంచార్జి గవర్నర్‌గా వచ్చిన రాధాకృష్ణన్‌ను వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పలుసార్లు కలిసి విభాగాధిపతుల వయో పరిమితి పెంపు బిల్లు గురించి వివరించారు. మరిన్ని వివరాలివ్వాలని కోరిన ఆయన.. అవి సమర్పించిన తర్వాత ఆమోద ముద్ర వేశారు. ఆగస్టు తొలి వారంలో రెగ్యులర్ డీఎంఈ నియామకంపై కోర్టు కేసు విచారణ ఉంది. బిల్లుకు ఆమోదంతో వారంలోపే రెగ్యులర్ డీఎంఈ నియామక ప్రక్రియను చేపట్టే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు తెలిపాయి.

వరంగల్, కరీంనగర్‌లకు రూ.వెయ్యికోట్లు

- స్మార్ట్ సిటీ మిషన్ కింద కేటాయింపు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం 562 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ, హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికైన గ్రేటర్ వరంగల్, కరీంనగర్‌లకు రూ. వెయ్యి కోట్లు కేటాయించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకన్ సాహూ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రెండు నగరాల్లో మొత్తం రూ.2,725 కోట్ల విలువైన 145 ప్రాజెక్టులను చేపట్టి అందులో రూ.2,125 కోట్ల విలువైన 88 ప్రాజెక్టులను రాష్ట్రప్రభుత్వం పూర్తిచేసినట్లు వెల్లడించారు. స్మార్ట్ సిటీ మిషన్‌ను వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు నగరాలకు ఈ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.562 కోట్ల బడ్జెట్ అంచనాలను రూపొందించింది. గ్రేటర్ వరంగల్ నగరానికి రూ.358.58 కోట్లు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.203.76 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.


శ్రావణపల్లి బొగ్గు గని కోసం రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి

శ్రావణపల్లి బొగ్గు గనిని సింగరేణికి కేటాయించాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తమకు విజ్ఞప్తి చేసిందని కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వేలం వేసే బొగ్గు గనుల జాబితా నుంచి శ్రావణపల్లి బొగ్గు గనిని తొలగించాలని కోరినట్లు తెలిపారు. ప్రస్తుత విధానం ప్రకారం బొగ్గు గనులన్నిటినీ వేలం ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సహా రాష్ట్రప్రభుత్వ సంస్థలు ఆ వేలంలో పాల్గొని నిర్దేశిత నిబంధనల ప్రకారం బొగ్గు గనులను తీసుకోవచ్చని తెలిపారు.

సాగర్ దిశగా కృష్ణమ్మ

(మొదటి పేజీ తరువాయి)

లోయర్ జూరాల జలవిద్యుత్తు కేంద్రంతో పాటు 900 మెగావాట్లు కలిగిన శ్రీశైలం భూగర్భ జలవిద్యుదుత్పాదన పరుగులు పెడుతోంది. సాగర్‌లో సోమవారం రాత్రి 9గంటలకు ఎనిమిది టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 16081 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ఈ ప్రాజెక్టు నుంచి 16 వేల క్యూసెక్కులను పంపింగ్ చేసి, మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి రెండు టన్నెల్‌ల ద్వారా నందిమేడారంలోని పంప్‌హౌస్ సర్జ్‌పూల్‌కు నీటిని తరలించి, ఆ నీటిని నంది రిజర్వాయర్‌లో వేసి, అక్కడి నుంచి రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేసి, మిడ్‌మానేరులో వేస్తున్నారు. తొలుత మిడ్‌మానేరు, ఆ తర్వాత లోయర్ మానేరుకు నీటిని తరలించి, శ్రీరాంసాగర్ ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆన్‌లైన్ రిజర్వాయర్లు అయిన అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లను నీటితో నింపనున్నారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు కాస్తా వరద తగ్గుముఖం పట్టింది. మంజీరా నదిపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకు 1779 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 460 క్యూసెక్కులు, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు 17310 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 4860 క్యూసెక్కులు, ప్రాణహితపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి 5.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రాణహిత-ఇంద్రావతిపై సమ్మక్క సాగర్ బ్యారేజీకి 8.56 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం)కు 9.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. దాంతో ఈ బ్యారేజీలకు వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది.



జూరాల ప్రాజెక్టు వద్ద 43 గేట్ల ద్వారా శ్రీశైలం వైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటి మట్టం (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	70.01	300000	300000
నారాయణపూర్	37.64	27.83	290000	270980
తుంగభద్ర	100.86	97.223	131179	311575
జూరాల	9.66	7.91	315000	311575
శ్రీశైలం	215.81	184.28	452583	162466
నాగార్జునసాగర్	312.05	136.13	54772	6744
సింగూరు	29.91	14.53	1179	391
శ్రీరాంసాగర్	80.5	34.10	17310	644
కడెం	7.6	6.43	4860	4311
ఎల్లంపల్లి	20.18	17.81	16081	16081
మేడిగడ్డ	16.17	6.07	579860	579860
సమ్మక్క	6.94	6.94	856350	856350
సీతమ్మ	36.57	0.2	932287	9322287

'సింగరేణి'ని కాపాడేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బెల్లంపల్లి, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణి సంస్థను కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సింగరేణి పరిరక్షణకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం బస్సుయాత్రను ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో ప్రారంభమైన ఈ యాత్ర సింగరేణి ఏరియాల మీదుగా సాగుతూ వచ్చే నెల 5న కొత్తగూడెంలో ముగియనుంది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

ఆగమాలు పాటించకుంటే అనర్థాలు

- శైవాగమ పండితులు పుల్లేటికుర్తి గణపతిశాస్త్రి

నార్కట్‌పల్లి, జూలై 29: ఆగమాలే ఆలయ అభివృద్ధికి సోపానాలని.. ఆలయ నిర్మాణం, నిర్వహణలో వాటిని పాటించకుంటే అనర్థాలు ఎదురవుతాయని శైవాగమ పండితులు పుల్లేటికుర్తి గణపతిశాస్త్రి తెలిపారు. తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ సంఘం, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో జాతీయ శైవాగమ సదస్సు రెండో రోజైన సోమవారం ఆయన మాట్లాడారు. 'ఆలయాల్లో అర్చనా విధులు, ప్రతిష్ఠాపన మహోత్సవాలు, వార, పక్ష, మాస, అయనాది విశేష ఉత్సవాలు, పవిత్రోత్సవ ఆవశ్యకతపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ శైవాగమ సలహాదారు మృత్యుంజయ శర్మ, ఎస్.సుబ్బయ్యశాస్త్రి, ఐ.జైకిషోర్‌శర్మ తమ అనుభవాలను ఈతరం అర్చకులకు వివరించారు.

చట్టం ప్రకారమే ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ

- సికింద్రాబాద్ క్లబ్‌కు ముందస్తు నోటీసు ఇవ్వండి
- హెచ్ఎండీఏకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని హెచ్ఎండీఏకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ విషయంలో తమకు నోటీసు, సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పేర్కొంటూ సికింద్రాబాద్ క్లబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సునీల్ బీ గాను వాదనలు వినిపిస్తూ.. కంటోన్మెంట్ పికెట్ వద్ద తోకట్ట గ్రామపరిధిలోని 22 ఎకరాల్లో ఉన్న సికింద్రాబాద్ క్లబ్‌కు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా టన్నెల్స్ నిర్మాణాల పనులు చేపట్టడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కారిడార్ కారణంగా సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన బంగ్లాలు, ఆస్తులకు నష్టం కలిగించే పక్షంలో పిటిషనర్‌కు ముందస్తు నోటీసులు ఇవ్వాలని పేర్కొంది.

కేంద్రీయ కిచెన్ విధానంతో కార్మికులకు అన్యాయం

- రేపు చలో హైదరాబాద్: ఏఐటీయూసీ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ(సెంట్రలైజ్డ్) కిచెన్ విధానం వల్ల వంట కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏఐటీయూసీ పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హరే రామ హరే కృష్ణ సంస్థ ప్రతినిధులతో చర్చించి కేంద్రీయ కిచెన్ విధానం పైలెట్ ప్రాజెక్ట్ కింద కొండగల్ ప్రాంతంలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందిస్తామని చెప్పారని, దీని వల్ల అక్కడి వంటకార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విధానం అమల్లోకి వస్తే రాష్ట్రంలోని 5,400 పాఠశాలల్లోని వంటకార్మికుల జీవితాలు దెబ్బతింటాయని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బుధవారం దీనిపై చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య



చంద్రయ్య, సరోజన (ఫైల్)

మణుగూరు, జూలై 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరులో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. పగిడేరు పంచాయతీలోని ఎస్టీ కాలనీలో నివాసముండే కాసరబాధ చంద్రయ్య(80), సరోజని(75) దంపతులు ముగ్గురు కుమారులకు తలా 12 ఎకరాల భూమి ఇచ్చారు. వారి పెళ్లిళ్లు చేసిన తర్వాత దంపతులు ఎస్టీ కాలనీలో చిరు దుకాణాన్ని నడుపుకుంటూ జీవిస్తున్నారు. చంద్రయ్య మణుగూరులోని తన ఇంటిని చిన్న కుమారుడికి ఇవ్వడంతో కుటుంబ కలహాలు జరుగుతుండేవని తెలిసింది. ఆదివారం వృద్ధ దంపతులు తమ మనవళ్లందరినీ పిలిపించుకుని మాట్లాడారు. వారు వెళ్లాక సరోజని మృతదేహం బావిలో తేలుతూ కనిపించింది. దానికి కొంతదూరంలో పొలాల్లోని మామిడి చెట్టుకు చంద్రయ్య ఉరేసుకున్నట్టు తెల్లారి స్థానికులు గమనించారు.

మద్దతు ధరపై కాంగ్రెస్ మొసలి కన్నీరు

కౌలు రైతులకు రూ. 15వేల సాయం ఏమైంది

- వరికి రూ.500 బోనస్ ఎందుకు ఇవ్వడం లేదు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు వేదికగా ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రైతు రాజకీయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. 2004 నుంచి 2014 వరకు రైతు సమస్యలను కాంగ్రెస్ గాలికొదిలేసిందని విమర్శించారు. నిపుణుల కమిటీల రిపోర్టులను తుంగలో తొక్కిన కాంగ్రెస్.. ఇవాళ మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రైతులకు సమయానుగుణంగా కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) ఇస్తున్నా బురద జల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మొసలి కన్నీళ్లను ప్రజలు, రైతులు నమ్మే పరిస్థితి లేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. రూపొందించుకున్న కనీస ఉమ్మడి ప్రణాళిక(సీఎంపీ)లో పేర్కొన్నట్లుగా ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలో 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్ (ఎన్సీఎఫ్)' ను 2004లో ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. స్వామినాథన్ కమిటీ.. రైతు పెట్టుబడికి 50 శాతం అదనంగా కనీస మద్దతు ధర ఉండాలని చెప్పిన విషయాన్ని యూపీఏ సర్కారు పట్టించుకోలేదన్నారు. మోదీ అధికారంలోకి రాగానే ఆ సూచనను అమలు చేస్తున్నారని తెలిపారు. సమయానుగుణంగా పంటల ఎమ్మెస్పీలను పెంచుతున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు, సూచనలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో వాగ్దానం చేసినట్లుగా అన్నదాతలకు, కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సహాయం(రైతు భరోసా), రైతు కూలీలకు రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్ ఇస్తామన్న హామీపై రాహుల్ ఎందుకు మాట్లాడరని కిషన్‌రెడ్డి నిలదీశారు.

బీజేపీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు: ఈటల

బీజేపీ హయాంలోనే దేశంలోని గిరిజనులు, దళితులు, మైనారిటీలకు గుర్తింపు లభించిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. సోమవారం లోక్ సభలో తొలిసారిగా ఈటల రాజేందర్ మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాటలు విని ఆశ్చర్యం కలిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశంలోని ఏ వర్గానికీ మంచి జరగలేదన్నారు. తెలంగాణలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క దళితుడు, గిరిజనుడు, ఓబీసీ ముఖ్యమంత్రి కాలేదన్నారు. బీజేపీ హయాంలోనే మైనారిటీ వర్గానికి చెందిన అబ్దుల్ కలాం, దళిత సామాజిక వర్గానికి చెందిన కోవింద్, ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ములకు అవకాశం దక్కిందన్నారు.

లోక్‌సభలో విప్‌గా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి లోక్‌సభలో బీజేపీ విప్‌గా అవకాశం దక్కింది. లోక్‌సభలో ఒక చీఫ్ విప్‌తో పాటు 16 మంది విప్‌లను నియమించినట్టు బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి శివ్ శక్తినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ విప్‌గా డాక్టర్ సంజయ్ జైశ్వాల్ నియమితులయ్యారు.

152 పతకాలున్నా దక్కని స్పోర్ట్స్ కోటా

- 18 ఏళ్ల యువ రోలర్ స్కేటర్‌కు వర్తించని రిజర్వేషన్
- క్రీడా సంఘాల కుమ్ములాటలతో క్రీడాకారులకు అన్యాయం
- టీవోఏ వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు



తేజేశ్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రీడాకారుల అభ్యున్నతికి చేయూత ఇవ్వాల్సిన స్పోర్ట్స్ కోటా.. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీవోఏ) నిర్లక్ష్యపూరిత వైఖరి, క్రీడా సంఘాల కుమ్ములాటల కారణంగా ప్రతిభగల క్రీడాలకు వర్తించని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హ్యాండ్‌బాల్, ఫెన్సింగ్, రోలర్ స్కేటింగ్, బాక్సింగ్‌తో సహా పలు క్రీడా సంఘాల్లో నెలకొన్న వివాదాల కారణంగా క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటిలో కొన్ని సంఘాలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్), ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు లేకపోవడంతో వారికి అన్యాయం జరుగుతోంది. పడిగ తేజేశ్ అనే 18 ఏళ్ల యువ రోలర్ స్కేటర్ ఇప్పటివరకు వివిధ పోటీల్లో 152 పతకాలు సాధించాడు. ఇందులో ఐదు అంతర్జాతీయ, 26 జాతీయ స్థాయి పోటీల్లో నెగ్గిన పతకాలున్నాయి. చైనాలో నిరుడు జరిగిన ఆసియా చాంపియన్‌షిప్ సీనియర్ కేటగిరీలో రజతం సాధించాడు. జీవో 2 ప్రకారం ఈ పతకం ఆధారంగా చూస్తే కౌన్సెలింగ్ ప్రాధాన్య క్రమంలో 35వ స్థానంలో ఉండాలి. అయితే, అసోసియేషన్‌కు గుర్తింపు లేని కారణంగా తేజేశ్ స్పోర్ట్స్ కోటాను కోల్పోవాల్సి వస్తోంది. వాస్తవానికి జీవో నంబర్ 2 ప్రకారం ఎంబీబీఎస్, బీడీఎస్ మినహా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఐఐఐటీ, ఐసెట్, ఈసెట్, లాసెట్ ఇలా అన్ని ప్రొఫెషనల్ కోర్సుల్లోనూ 0.5 శాతం స్పోర్ట్స్ కోటా కింద సీట్లు కేటాయించాల్సి ఉంది. దీంతో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు నెగ్గిన క్రీడాకారుల కష్టం సైతం బూడిదలో పోసిన పన్నీరవుతోంది. క్రీడా సంఘాల మధ్య వివాదాలను పరిష్కరించి, వాటికి గుర్తింపు ఇచ్చి, ప్రభుత్వానికి, క్రీడా సంఘాలకు మధ్య వారధిగా ఉండాల్సిన ఒలింపిక్ సంఘం పూర్తిగా కాడి వదిలేసి, తన గ్రూపు రాజకీయాల్లో నిమగ్నమై ఉందనే విమర్శలున్నాయి. ఏటా విద్యా ప్రవేశాల దగ్గరికి వచ్చేసరికి క్రీడా సంఘాల వివాదాల కారణంగా తేజేశ్ వంటి ప్రతిభావంతులైన క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. 2019 నుంచి రోలర్ స్కేటింగ్‌కు గుర్తింపు లేకపోతే, ఈ విషయంపై క్రీడాకారులకు అవగాహన కల్పించాల్సిన టీవోఏ, శాట్జ్ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

'ఫాస్ట్‌ట్రాక్'లో ఎయిర్‌పోర్ట్ మెట్రో!

- అంతర్జాతీయ బ్యాంకుల నుంచి 45% రుణం
- పీపీపీ పద్ధతిలో మరో ఐదు శాతం
- రాష్ట్రం వాటా 35%.. కేంద్రం నుంచి 15%
- రాష్ట్ర మంత్రివర్గ భేటీ తర్వాత కేంద్రానికి డీపీఆర్
- ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.24,042 కోట్లు
- తాజా బడ్జెట్‌లో రూ.500 కోట్ల కేటాయింపు



హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు మెట్రోను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.24,042 కోట్లు కాగా.. రేవంత్ సర్కారు తాజా బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాయించింది. నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు 'గ్రీన్‌లైన్ కారిడార్'గా నామకరణం చేసిన సర్కారు.. అంతర్జాతీయ బ్యాంకుల రుణాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు, పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును జాయింట్ వెంచర్‌గా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో 35% నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా అందించనుంది. మరో 15% నిధులను కేంద్రం అందజేయనుంది. మిగతా 50శాతంలో 45% నిధులను ఆసియా అభివృద్ధి బ్యాంక్(ఏడీబీ) లేదా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) వంటి అంతర్జాతీయ బ్యాంకుల నుంచి నిధులను సేకరించాలని ప్రభుత్వ నిర్ణయించింది. మిగిలిన 5% నిధులను పీపీపీ పద్ధతిలో సేకరించనుంది. ఎయిర్‌పోర్టు కారిడార్‌కు ఇప్పటికే సిస్ట్రా జనరల్ కన్సల్టెంట్ సంస్థ డీపీఆర్‌ను సిద్ధం చేసింది.

పాతనగరంతో కలిపి..

మొదటి దశ మెట్రో రైల్ పనుల్లో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మేర పెండింగ్‌లో ఉంది. రెండో దశలో 7 కారిడార్లలో 78.04 కి.మీ. మేర పనులను చేపట్టాలని సంకల్పించిన రేవంత్ సర్కారు.. పాతనగర మెట్రో లైన్‌ను మరో 2 కి.మీ. పెంచి, చాంద్రాయణగుట్ట వరకు పొడిగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే..! నాగోల్-ఎయిర్‌పోర్టు మెట్రోకు చాంద్రాయణగుట్ట వద్ద పాతనగర మెట్రో లైన్‌తో రెడ్‌లైన్ ఏర్పాటవుతుంది. అక్కడ ఇంటర్‌చేంజ్‌కు అవకాశం కల్పిస్తారు. ఇప్పటికే అధికారులు పాతనగరంలోని మొత్తం 7.5 కి.మీ. మేర పనులను చేపట్టారు. ఇక నాగోల్ నుంచి ఎల్బీనగర్‌కు 5 కి.మీ. లైన్‌ను పొడిగించి, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్‌కు 'గ్రీన్‌లైన్ కారిడార్'ను నిర్మిస్తారు. రెండో దశ ఏడు కారిడార్లకు సంబంధించి డీపీఆర్‌లను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంది. కేంద్రం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తారు. చాంద్రాయణగుట్ట వద్ద రెడ్‌లైన్(ఇంటర్‌చేంజ్) ఏర్పాటు వల్ల.. మెట్రో ప్రయాణికులు ఎక్కడి నుంచైనా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎన్‌హెచ్, రైల్వేల వద్ద పక్కా ప్రణాళికతో

మొదటి దశ మెట్రోరైల్ నిర్మాణం వద్ద అధికారులు జాతీయ రహదారులు, రైల్వే లైన్ల వద్ద ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జాతీయ రహదారులపై ట్రాఫిక్ ఇబ్బంది ఎదురవ్వగా.. రైల్వే లైన్ల వద్ద నిర్మాణాలకు అనుకూలంగా ఆ మార్గంలో ఎంత సమయం వరకు రైళ్లను ఆపితే.. అంత మొత్తంలో దక్షిణ మధ్య రైల్వేకు చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రెండో దశ విషయంలో అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'కోచింగ్' విషాదం

ఢిల్లీలో సివిల్స్ శిక్షణపొందుతున్న ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన అత్యంత విషాదకరమైనది. భారీ వర్షం కారణంగా వరదనీరు సదరు కోచింగ్ సెంటర్ సెల్లార్‌ను ముంచెత్తడంతో, ఈ ముగ్గురు అక్కడి లైబ్రరీలో చిక్కుబడిపోయి ప్రాణాలు కోల్పోయారు. నీరు చేరడమే తప్ప బయటకు పోయే దారి లేని సెల్లార్‌లో విద్యార్థులకు అత్యంత అవశ్యకమైన లైబ్రరీ నిర్వహించడం ఆ సంస్థ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రమాద సమయంలో అక్కడ ముప్పైమంది విద్యార్థులున్నారు. కొంతమంది తమకు తాముగా బయటపడ్డారు, మిగతావారిని తోటివారు కష్టపడి కాపాడారు. కానీ, ఈ ముగ్గురూ ఆదుకొనే నాథుడు లేక నాలుగుగంటలపాటు అక్కడే చిక్కుబడిపోయి చివరకు ప్రాణాలు వదిలేశారు. ఆ ప్రాంతంలో డ్రైనేజ్ వ్యవస్థ ఘోరంగా ఉన్నదని పదిరోజులక్రితమే అధికారులకు, స్థానిక కౌన్సిలర్‌కు స్వయంగా ఫిర్యాదు చేసినట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో మురుగునీరు వెళ్ళే కాలువలు ఆక్రమణలకు గురై పూడుకుపోయాయని అధికారులు అంటున్నారు. నీటిధాటికి పైప్‌లైన్లు పగిలిపోయి నీరు భారీగా సెల్లార్ లోకి చేరడంతో ఈ ఘోరం జరిగింది. కోచింగ్ సెంటర్‌ల ధనాపేక్ష, అధికార యంత్రాంగాల నేరపూరితమైన నిర్లక్ష్యం ఈ ముగ్గురి కలెక్టర్ కలను చిదిమేశాయి.

ఈ మహావిషాదాన్ని అన్ని పార్టీలూ ముక్తకంఠంతో ఖండించాయి, ఆవేదన వెలిబుచ్చాయి. ఎంతమాత్రం రాజకీయం తగదని ఏక మాటగా అంటూనే అంతిమంగా అదేపనిచేశాయి. పాపం మీదంటే మీదని పరస్పరం విమర్శించుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతాపార్టీ పక్షాన లోక్‌సభ, రాజ్యసభల్లో మోహరింపులు జరిగాయి. ఆ స్వల్పకాలిక చర్చలో కూడా ఎదుటివారిని తప్పుబట్టడమో, నేరం నెట్టివేయడమో ప్రధానమైపోయింది. 'ఢిల్లీ మునిసిపాలిటీ ఏకంగా పదిహేనేళ్ళుగా మీ చేతుల్లో ఉన్న ఫలితంగా వ్యవస్థలన్నీ నాశనమైనాయి, ఇప్పుడేమో డ్రైనేజ్ రిపేర్ చేయమని పదిహేనురోజులుగా పోరుతున్నా అధికారులు మా మాట వినడం లేదు' అని బీజేపీని ఆప్ విమర్శిస్తే, బీజేపీ తరపున మాట్లాడినవారంతా ఆప్ అసమర్థతను తప్పుబట్టారు. ఢిల్లీలో ఈ రెండుపార్టీల మధ్యా ఉచ్ఛస్థితికి చేరిన రాజకీయవైరం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించిందని ఈ ఘటన తెలియచేస్తోంది. మంత్రుల ఆదేశాలను అమలుచేసిన అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ వేధిస్తున్నారని ఆప్ విమర్శిస్తోంది. ఏతావాతా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, అమలుచేయనిపక్షంలో అడగడం వంటివి ఎవరికీ పట్టని వ్యవహారంగా మారిపోయింది. ఇప్పుడు ముఖ్యమంత్రి జైల్లో ఉండటంతో కుంటుతున్న వ్యవస్థకూడా కుప్పకూలింది. ఆప్ ముక్కలు చెక్కలైపోయి, ఏడు ఎంపీస్థానాలు గెలుచుకున్న బీజేపీ అసెంబ్లీని కూడా వశపరచుకొనేవరకూ ఈ ఘర్షణ తప్పదేమో! కోచింగ్ సెంటర్‌ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సహా, బీజేపీ, ఆప్‌లకు చెందిన పలువురు నాయకులను తీవ్ర నిరసనలతో వెనక్కు పంపేయడం గమనించాల్సిన అంశం.

ఈ ఘటన తరువాత బుల్‌డోజర్లు వచ్చాయి, ఫుట్‌పాత్‌లను, నాలాలను దురాక్రమించిన మిగతా కోచింగ్ సెంటర్లను పాక్షికంగా కూలగొట్టాయి. ఒకరిద్దరు అధికారులు కూడా సస్పెండ్ అయ్యారు. మూడుప్రాణాలు పోయిన తరువాత ఏకంగా ఒకరోజులోనే పదిహేను కోచింగ్ సెంటర్‌ల అతిక్రమణలను, అక్రమాలను గుర్తించి, శిక్షించిన ఈ అధికారులకు ఇంతకాలమూ సదరు కోచింగ్ సెంటర్ పార్కింగ్‌కో సమో, స్టోర్‌రూముగానో వాడాల్సిన సెల్లార్‌ను లైబ్రరీగా మార్చిందని తెలియరాలేదనుకోలేం. ఆ సెంటర్‌లో చదువుతున్న ఓ విద్యార్థి, పక్కనే నివాసం ఉంటున్న ఓ పెద్దమనిషి సహా పలువురు ఫిర్యాదు చేసినా వారు బేఖాతరుచేశారు. నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా సదరు సంస్థ నడుస్తున్నదని వివిధ విభాగాలు కనీసం తనిఖీ కూడా చేయకుండా సర్టిఫికేట్లు ఇచ్చేయడం ఆశ్చర్యం. ఇప్పుడు ఉన్నతస్థాయి కమిటీ స్వల్పకాలంలో వేగవంతమైన విచారణతో ఏ కొత్తనిజాలు వెలుగులోకి తెస్తుందో తెలియదు

కానీ, లక్షలాది రూపాయలు వసూలుచేస్తూ, విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న కోచింగ్ సెంటర్‌ల ఇష్టారాజ్యానికి సమస్త వ్యవస్థలు కలసికట్టుగా సహకరిస్తున్నాయన్నది వాస్తవం.

వికసించని మన పారిశ్రామిక భారతం!



స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో కొంత మెరుగుదల కనిపించింది. ఆ తర్వాత 1960ల నుంచి 1980ల చివరి వరకూ ఆశించిన స్థాయిలో అది పెరగలేదు. ఆర్థిక సంస్కరణల తర్వాత కొంత ఎదుగుదల కనపడినా లక్ష్యాలకు చాలా దూరంలోనే ఉండిపోయింది. క్యాపిటలిజం అంటేనే పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచటం. ఇందులో వెనుకబడిన చోట పారిశ్రామిక పురోగతి సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో గణనీయ మార్పు లేకుండా వికసిత భారత్ లక్ష్యాలు నెరవేరుతాయా? అన్నది పెద్ద ప్రశ్నార్థకమే!



■ రాహుల్ కుమార్

వికసిత భారత్! దీని గురించి జరిగే ప్రచారం అంతా ఇంతా కాదు. సమావేశాలు, గోష్ఠులు, లక్ష్య ప్రకటనలు, విధానాల రూపకల్పనలు.. ఎటుచూసినా వికసిత భారత్ వైపే దేశం కదులుతున్నట్లుగా ప్రచారం హోరెత్తుతోంది. రాజకీయ దృష్టితో దీన్ని ప్రచారపటాటోపంగా కొట్టివేయటం తేలిక. భిన్న రాజకీయ దృక్పథంతో పెదవి విరవటమూ కష్టం కాదు. వీటికి మించి వికసిత భారత్ భావన సాధ్యాసాధ్యాలను అర్థం చేసుకోవాలంటే చాలా విషయాలను స్పృశించాలి. అందుకు మన ఆర్థికాభివృద్ధి చరిత్రలోకి వెళ్లాలి. అదెంత వేగంతో నడిచిందో చూడాలి. ఆ వేగం ఆశించిన రీతిలో కాకుండా అరకొరగా ఉంటే కారణాలను వెతకాలి. ఆర్థిక వికాసానికి, మేధో వికాసానికి సంబంధాలను చూడాలి. అసలు ఈ రెండిటికీ బంధనాల్లాంటివి ఉంటే అవెందుకు ఏర్పడ్డాయో విశ్లేషించాలి. మూడు రోజుల క్రితం ఢిల్లీలో నీతిఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధాన మంత్రితో పాటు సీఎంలూ పాల్గొన్నారు. 2047 నాటికి మన ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి అనుగుణంగా విధానాలను రూపొందించుకుని, అడ్డంకులను తొలగించుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. స్వాతంత్ర్యం పొందిన వందేళ్ల నాటికి (2047) మూడు అగ్ర శ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండాలన్నదే వికసిత భారత లక్ష్యం. లక్ష్యం ఘనంగా పెట్టుకోవటంలో తప్పులేదు.

1950 నాటికి ఆర్థికంగా భారత్‌తో సమానస్థాయిలో ఉన్న కొన్ని దేశాలు చాలా ముందుకు వెళ్లాయి. ఆగ్నేయాసియా, చైనాల ఆర్థిక చరిత్ర చూస్తే ఇదే అర్థం అవుతుంది. బంగ్లాదేశ్‌ను పరిశీలించినా కొన్ని రంగాల్లో ఆ దేశం ముందుకు వెళ్లింది. మానవాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఇది స్పష్టంగా కనపడుతుంది. 2024లో బంగ్లాదేశ్ తలసరి జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) 2,529 డాలర్లు. దారిద్ర్యరేఖ (రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం) దిగువన అయిదు శాతం ప్రజలే ఉన్నారు. సగటు ఆయుర్దాయం 74 ఏళ్లు. శ్రామికశక్తిలో బంగ్లా మహిళల వాటా 43 శాతం ఉంది. ఆ దేశంతో పోల్చితే భౌగోళికంగా భారత్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. అయినా కొన్ని విషయాల్లో వెనుకబడే ఉంది. భారత్‌లో తలసరి జీడీపీ 2484.8 డాలర్లు ఉంటే, దారిద్ర్య రేఖకు దిగువన 12.9 శాతం (2021 నాటికి) ప్రజలు ఇప్పటికీ జీవిస్తున్నారు. మన సగటు ఆయుర్దాయం 68 ఏళ్లే. ఇక శ్రామికశక్తిలో మహిళల వాటా (37శాతం) బంగ్లాతో పోల్చితే తక్కువ. తాజా మానవాభివృద్ధి సూచికలో సైతం బంగ్లాదేశ్ కంటే (129) అయిదు పాయింట్లు (134) దిగువనే ఉన్నాం.

ఇప్పుడు మరికొన్ని దేశాలను చూద్దాం. 1970ల నాటికి సింగపూర్ పరిస్థితి దయనీయంగా ఉండేది. ప్రస్తుతం ఆ దేశ వార్షిక తలసరి జీడీపీ 88450 డాలర్లు. మలేసియా కూడా మంచి స్థితిలోనే (13310) ఉంది. థాయిలాండ్ (7810), చైనా (13140), దక్షిణ కొరియా (34165), భూటాన్ (4010), ఐర్లండ్ (106,060), డొమినికన్ రిపబ్లిక్ (11170).. ఇట్లా ప్రత్యక్ష, పరోక్ష వలస పాలన నేపథ్యం ఉన్న దేశాలను తీసుకున్నా ఎంతో ముందుకు వెళ్లిన పరిస్థితి కనపడుతుంది. ఐర్లండ్‌కు 1922లో బ్రిటన్ నుంచి స్వేచ్ఛ లభించినా 1970ల వరకూ పేద దేశంగానే ఉండేది. ఆ తర్వాత బ్రిటన్‌ను అధిగమించింది. ప్రస్తుత ఐర్లండ్ తలసరి జీడీపీతో పోల్చితే బ్రిటన్ తలసరి జీడీపీ సగం కంటే తక్కువగానే ఉంది.

ఆశించిన స్థాయిలో భారత్ గణనీయంగా ఆర్థికాభివృద్ధిని సాధించలేక పోవటానికి చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిలో మనం పెట్టుకున్న లక్ష్యాలను సాధించలేదు. 1950ల నుంచి ఇప్పటి వరకూ జీడీపీలో పారిశ్రామిక రంగం వాటా 20 శాతానికి దాటిన సందర్భాలు అరుదనే చెప్పాలి. వాటా పెరగటం కంటే తరిగిన సంవత్సరాలు కూడా ఉన్నాయి. ఇప్పుడూ ఒకప్పుడూ అగ్ర రాజ్యాలుగా ఉన్న దేశాలన్నీ పారిశ్రామిక రంగంలో గణనీయ అభివృద్ధిని సాధించిన తర్వాతే ఆ స్థాయికి చేరుకున్నాయి. 1950ల నుంచి పారిశ్రామికాభివృద్ధి పరంగా మనం సరైన గాడిలో నడిచిన సందర్భాలు చాలా తక్కువ. దీని మీద ప్రముఖ ఆర్థికవేత్త సుమిత్ కె.మజుందార్ తన 'లాస్ట్ గ్లోరీ–ఇండియాస్ క్యాపిటలిజం స్టోరీ' అన్న పుస్తకంలో మంచి విశ్లేషణే చేశారు. 2013–2014 వరకూ సుమిత్ చేసిన పరిశీలనలో ఒకటి మాత్రం స్పష్టంగా వెల్లడైంది. 1950ల నుంచి 2013–14 వరకూ అంటే 63 ఏళ్ల కాలంలో సేవల రంగమే ప్రధాన పాత్ర వహించింది. ఆ కాలం నాటి సేవల రంగం వార్షిక సగటు వాటా 48 శాతం ఉంది. ఆర్థిక సంస్కరణలతో (1991) సేవలరంగం మరింత ఊపందుకున్న మాట నిజమే. అంతకు ముందు కూడా దాని ప్రాధాన్యం తక్కువ కాదు. ఇక ఇదే కాలంలో పారిశ్రామికరంగం వార్షిక సగటు వాటా 18 శాతానికి మించలేదు. వ్యవసాయం వాటా 34 శాతం వరకూ ఉంది. 63 ఏళ్ల సగటును కాకుండా 2010 తర్వాత పరిస్థితినే తీసుకుంటే వ్యవసాయ రంగం వాటా (14శాతం) బాగా తగ్గిపోయింది. అదింకా క్షీణిస్తూనే ఉంది. దీనికి బదులు పారిశ్రామిక రంగం వాటా పెరిగిందా? అంటే అదీ లేదు. యథాప్రకారం సేవల రంగం (66శాతం) వాటానే విపరీతంగా పెరిగింది. స్పష్టంగా చెప్పుకోవాలంటే వ్యవసాయ రంగ ఆధిక్యత నుంచి సేవలరంగం ప్రాబల్యంలోకి మన ఆర్థిక వ్యవస్థ అడుగుపెట్టింది. దీర్ఘ దృష్టితో చూస్తే దేశంలో పారిశ్రామిక రంగం ఎప్పుడూ ఆధిక్యతను ప్రదర్శించ లేదు. అందుకే పారిశ్రామికాభివృద్ధికి చేదోడువాదోడుగా నిలిచే మేధోవికాసమూ మనకు అరకొరగానే జరిగింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదంటూ చెప్పుకోదగిన ప్రభావిత ఆవిష్కరణలూ కనపడలేదు. ఆ ఆవిష్కరణలతో సమాంతరంగా పెంపొందే శాస్త్రీయ ఆలోచనా విధానమూ సమగ్రంగా బలపడలేదు. వ్యవస్థీకృత రంగంలో కార్మికవర్గం గణనీయ శక్తిగా ఎదగలేదు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ పారిశ్రామిక రంగాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుని ఆర్థికంగా సుసంపన్నం అయిన తర్వాతే సేవల రంగాన్ని విస్తరించుకున్నాయి. బలమైన పారిశ్రామిక రంగం లేకుండా కేవలం సేవల రంగం ఆధిక్యతతో సుసంపన్నం అవుతామని అనుకోవటం ఇప్పటికీ ప్రశ్నార్థకమేనన్నది సుమిత్ మజుందార్ అభిప్రాయం. ఆదాయంలో భారత్ కంటే ముందున్న ఆసియా దేశాల్లో పారిశ్రామిక రంగం వాటా 40 శాతం దాకా ఉంది. ఉత్పాదక సామర్థ్యం కూడా చాలా మెరుగ్గా నమోదైంది. సాధించాలనుకున్న పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో అయిదో వంతుకు కూడా భారత్ చేరుకోలేదు. అలా చేరుకుని ఉంటే మన జాతీయాదాయం ఎన్నో రెట్లు పెరిగేది. ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం వాటా అయిదింట రెండు వంతులకు చేరుకుంటే మన పరిస్థితి భిన్నంగా ఉండేది. 11.5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థకు ఎప్పుడో చేరుకుని ఉండేవారం. చైనాకు దరిదాపుల్లో నిలిచేవాళ్లం. సామర్థ్యం లోపించిన పారిశ్రామిక రంగంతో మనం ఆర్థికంగా చేరుకోగలిగిన స్థాయిలో 20 శాతం మాత్రమే సాధించగలిగాం. అనేక అభివృద్ధి కొలమానాల్లో భారత్ పేద దేశంగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. వివిధ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు పారిశ్రామికాభివృద్ధి ప్రాధాన్యత గురించి చాలానే చెప్పాయి. పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లోనూ ఇదే కనపడింది. చివరికి 1991 నాటి ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యమూ ఘనమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించటమే. ఆత్మ నిర్భర్–మేకిన్ ఇండియా ప్రకటనల పరమార్థమూ అదే! ఇక ఉద్యోగ కల్పనలో వ్యవస్థీకృత పారిశ్రామిక రంగం వాటా చాలా తక్కువ. 2015 నాటికి ఒక శాతం జనాభానే ఈ రంగంలో ఉపాధిని పొందుతున్నారు. చిన్నాపెద్దా అన్నీ కలిపి మొత్తంగా తయారీ రంగాన్ని తీసుకున్నా 13 మిలియన్ల మంది మాత్రమే అందులో ఉన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో కొంత మెరుగుదల కనిపించింది. కానీ ఆ తర్వాత 1960ల నుంచి 1980ల చివరి వరకూ ఆశించిన స్థాయిలో అది పెరగలేదు. ఆర్థిక సంస్కరణల తర్వాత కొంత ఎదుగుదల కనపడినా లక్ష్యాలకు చాలా దూరంలోనే ఉండిపోయింది. క్యాపిటలిజం అంటేనే పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచటం. ఇందులో వెనుకబడిన చోట పారిశ్రామిక పురోగతి సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో గణనీయ మార్పు లేకుండా వికసిత భారత్ లక్ష్యాలు నెరవేరుతాయా? అన్నది పెద్ద ప్రశ్నార్థకమే!

గరిష్ఠ లాభాల కోసమే వెంపర్లాడే ప్రైవేటు రంగం విశాల దృష్టితో జాతీయ అభివృద్ధికి తోడ్పడే రీతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, కుల–మత రాగద్వేషాలకు అతీతంగా సమర్థతకు పెద్దపీట వేస్తూ సంస్థల నిర్వహణకు పూనుకుంటూనే 'మేక్ ఇన్ ఇండియా' అనేది ఎంతో కొంత వాస్తవరూపం దాల్చుతుంది. గత అనుభవాలనూ, మన ప్రైవేటు రంగం స్వభావాన్నీ దృష్టిలో ఉంచుకుని ఇదంత తేలికగా సాకారమయ్యే పరిస్థితి లేదని సుమిత్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానంతో ఏకీభవించకపోయినా ఆయన వ్యక్తంచేసిన సందేహాన్ని తేలికగా కొట్టిపారేయలేం. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, నూతన ఆవిష్కరణల జోలికి వెళ్లకుండా, అమ్మకాలు–కొనుగోలు లావాదేవీలతో లాభాలు గడించాలన్న లక్షణం భారత వ్యాపారవర్గానికి వారసత్వంగా రావటం వల్ల కూడా పారిశ్రామిక రంగంలో పురోగతి సాధించలేకపోయామని సుమిత్ పేర్కొన్నారు. ఇక రాజకీయ వర్గంతో పాటు అధికారవర్గమూ ఆశ్రిత పెట్టుబడిదారులకు అండదండలు అందించింది. దీంతో పోటీ తత్వం దెబ్బతిని పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని పెరగనీయకుండా చేసింది. పరిశ్రమల ప్రారంభానికి కఠినమైన రీతిలో లైసెన్స్, పర్మిట్ వ్యవస్థను అమలుపరచటం, ఉత్పత్తులకు కోటాలను ప్రభుత్వమే కఠోరంగా నిర్ణయించటంతో 1991కు ముందు పారిశ్రామిక రంగంలో నిజమైన పోటీలేకుండా చేసింది. ఆర్థిక సంస్కరణల అనంతరం ఆ పరిస్థితిలో కొంత మార్పు వచ్చినా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి అనుచిత లబ్ధిని పొందటం ఇంకా సాగుతూనే ఉంది.

75 ఏళ్ల చరిత్రను చూస్తే వికసిత భారత్ సాకారం కావటం అనేక సవాళ్లతో కూడినదిగా స్పష్టమవుతుంది. ఉత్పాదక సామర్థ్యానికి అడ్డుగా నిలుస్తున్న ఎన్నో జాడ్యాలను వదిలించుకోవాలి. పారిశ్రామిక, సమాచార సాంకేతిక విజ్ఞానంలో సొంతముద్రను వేయగలగాలి. గతమంతా ఘనమనుకునే సంకుచిత ధోరణికి స్వస్తిపలకాలి. బహుళ సంస్కృతుల సమాజాన్ని నిత్యం భయపెట్టే ఉన్మాద రాజకీయాలకు వీడ్కోలు చెప్పాలి.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

నవజీవన ప్రతిభామూర్తి రాంషా

రాంషా! ఈ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'అభిసారిక' పత్రిక. దాని ప్రచురణకర్తగా, సంపాదకునిగా, పాఠకుల సెక్సు సమస్యలకు, సందేహాలకు ఆత్మీయ పరిష్కారాలు, సలహాలు సూచించే ఒక పెద్ద దిక్కు జ్ఞప్తి కొస్తుంది. ఇంకా ముందు తరం వారిలో ఒక వర్గానికి కమ్యూనిస్టు, కమ్యూనిస్టు రచయిత కనిపిస్తాడు. మరో వర్గానికి అభ్యుదయ కవి, నాటకకర్త, సాహితీ విమర్శకుడు కనిపిస్తే, కొందరికి ప్రతిభావంతుడైన కథా, నవలా రచయిత గోచరమవుతాడు. మరికొందరికి ముద్రాపకుడు! ఇవన్నీ కలగలసిన విశేష వ్యక్తిత్వమే రాంషా!

'రాంషా' అసలు పేరు దర్భా వేంకటరామశాస్త్రి, తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట సమీపంలోని వేట్లపాలెంలో 1924 జూలై 30న జన్మించారు. తండ్రి వేంకటరమణయ్య ఇంజనీరు. తల్లి వెంకటలక్ష్మి. కాకినాడ పిఠాపురం రాజా వారి కాలేజీలో ఎఫ్.ఎ. (నేటి ఇంటర్మీడియెట్) చదివే రోజుల్లోనే తొలి రచన 'శిలాప్రతిమ' నాటికతో పేరు తెచ్చుకుని, 1948లో చోడవరం అఖిలాంధ్ర కవిపండిత పరిషత్తు నుంచి తొలి సన్మానం పొందారు. వేంకటరామశాస్త్రికి 'రాంషా' అనే లేఖినీ నామం ప్రదానం చేసినది ఆ కళాశాల అధ్యాపకులైన సాహితీమూర్తి 'కళాప్రపూర్ణ' నిడదవోలు వెంకటరావు.

రాంషా విద్యార్థి జీవితంలోనే ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య గ్రంథాలెన్నో విస్తృతంగా చదివారు. ప్రముఖ ఇంగ్లీషు నాటకకర్త బెర్నార్డ్ షా సాహిత్యంతో పాటు, షేక్స్పియర్, వర్డ్స్‌వర్త్, మిల్టన్, కీట్స్, షెల్లీ, ఫ్రాస్ట్ తదితర మహాకవుల కవిత్వం ఆకళింపు చేసుకున్నారు. ఇటు కార్ల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ వంటి వారి సోషలిస్టు సైద్ధాంతిక సాహిత్యంతో పాటు టాల్‌స్టాయ్, గోర్కీ, తుర్గనెవ్, చెహోవ్ వంటి రష్యన్ మహారచయితల అజరామర సాహిత్యాన్ని విస్తృతంగా చదివారు. ప్రముఖ భావకవితా ప్రసారకులైన దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి, 'గౌతమీకోకిల' వేదుల సత్యనారాయణశాస్త్రి వంటి కవిదిగ్గజాల సాంగత్య, ప్రోద్బలాలతో రాంషా తన సృజనాత్మక కృషికి వన్నెలు దిద్దుకుంటూ బహుముఖ ప్రతిభావంతుడైన సాహిత్యవేత్తగా ఎదిగారు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితులకు రాంషా కలం ఝుళిపించారు. సోమసుందర్, శశాంక మొదలైన కవి మిత్రులతో చేయి చేయి కలిపి, కమ్యూనిస్టు కార్యకర్తగా శంఖం పూరించారు (1944–1955). ప్రజాచైతన్యం ప్రజ్వలింపజేయడానికి 'కళాకేళి – ధర్మ సంగ్రామకేళి' నినాదంతో "కళాకేళి ప్రచురణలు" నెలకొల్పారు. సామ్యవాద ఉద్యమ ప్రతిధ్వనులైన ఆరుద్ర 'త్వమేవాహం', సోమసుందర్ 'వజ్రాయుధం' అగ్రశ్రేణి అభ్యుదయ కావ్యాలకి రాంషా సముచిత ప్రకాశికలు రాసి ప్రచురించి, వాటికి అద్వితీయ ప్రాచుర్యం కల్పించారు. మందీ–మనిషి, బానిసల దేశం, రోదసి వంటి గ్రంథాలకు అమూల్యమైన పీఠికలు రాశారు. కళాకేళి ద్వారా శశాంక 'నయాజమానా'; తన 'అనంతం', కామేశ్వరి కథ, దయ్యం పట్టిన మనిషి, మనస్తత్వాలు, కళలు–కథలు; సోమసుందర్ 'కాహళి', 'గోదావరి జలప్రళయం', 'రక్తాక్షి; పూభా 'సంజదీపం', చిన్నా 'కుళ్ళుసరుకు', 'శిథిలాలయం'; జోగిరాజు 'అనామకులు'; ఈరంకి 'అప్పగింత'– మొదలైన అనేక సంపుటాలు ప్రకటించి, అభ్యుదయ సాహిత్య చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టానికి నాందీవాచకం పలికారు రాంషా. మిత్రుడు సోమసుందర్‌తో కలిసి 'దండోరా' సాంస్కృతిక పక్షపత్రికను నడిపారు.

తీవ్ర నిర్బంధ విధానంలో అభ్యుదయవాదులైన సాహిత్యకారులు, కళాకారులు చెల్లాచెదురైనారు. ఆ దుర్భర పరిస్థితులలో రాంషా కూడా నిలదొక్కుకోడానికి అనేక కష్టనష్టాల నెదుర్కొన్నారు. అలాంటి సమయంలో ఆప్తమిత్రుడు ధనికొండ హనుమంతరావు కొంతకాలం నడిపి ఆపివేసిన తన 'అభిసారిక' పత్రికను రాంషాకి అందించారు. ఆ విధంగా అభిసారిక పత్రికను స్వీకరించి మరో కొత్త జీవిత అధ్యాయానికి తెరతీసారు రాంషా(1960).

రాంషా నేతృత్వంలో 'అభిసారిక' లైంగిక విజ్ఞాన మాసపత్రిక అచిరకాలంలోనే అసంఖ్యాక పాఠకుల మన్ననలు పొంది, బహుళ ప్రచారంలోకి వచ్చింది. మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలతో, అజ్ఞానంలో, అంధకారంలో అల్లాడుతున్న అనేక మంది తెలుగు పాఠకులకు అది వేగుచుక్కగా రూపొందింది. అభిసారిక పత్రిక ద్వారా శాస్త్రీయంగా 'సెక్సు విజ్ఞానాన్ని' పాఠకులకందజేస్తూ, ఆత్మవిశ్వాసం కోల్పోయి, అనేక మానసిక రుగ్మతలకు లోనై, అశాంతితో, అపోహలతో, సమస్యలతో, సంతాపాలతో సతమతమవుతున్న అసంఖ్యాక వ్యక్తులకు ఆశనీ, ఆత్మస్థైర్యాన్నీ కల్పించి, ఓదార్పునీ, నైతిక బలాన్నీ, నవజీవనాన్నీ ప్రోదిచేసి, వారిని తీర్చిదిద్దే మహోద్యమంలో రాంషా అమోఘ కృషి చేసి, విజయం సాధించారు.

రాంషా జీవితంలోనే కాక, పత్రికావ్యాసంగంలోనూ విడదీయరాని భాగస్వామి ఆయన భార్య శిరీష. ఈమె అభిసారిక నిర్వహణలోనే కాక స్వయంగా కొంతకాలం పాటు 'జీవితం' పత్రిక నిర్వహించారు.

పత్రిక ద్వారానూ, ప్రత్యక్షంగానూ ఎన్నో లైంగిక, వ్యక్తిగత, సాంసారిక సమస్యలు పరిష్కరించి, ఎందరి జీవితాలకో వెలుగునిచ్చి, ఎన్ని కుటుంబాలనో నిలబెట్టి, ఎంతో విజ్ఞానం వెదజల్లిన రాంషా ఒక వ్యక్తి కాదు, ఒక మహా వ్యవస్థ! ఎందరికో నూతన శక్తినీ, దుఃఖ విముక్తినీ ప్రసాదించిన గొప్ప వ్యక్తి! ఫ్రాయిడ్, ఆడ్లర్, జంగ్, హేవలాక్ ఎల్లిస్ మొదలైన మహామహుల విజ్ఞానాన్ని తెలుగు పాఠక ప్రపంచానికి విస్తృతంగా పంచిపెట్టిన ప్రతిభామూర్తి రాంషా. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన 'ఆంధ్రా హేవలాక్ ఎల్లిస్'!

రాంషా శతజయంతిని పురస్కరించుకుని కాకినాడ ఎస్‌ఎంఎస్ రోటరీ సర్వీస్ సెంటరులో 30 జూలై 2024 సాయంత్రం 4.00 నుంచి 7.30 వరకు శతజయంతి సభ జరుగుతుంది. ఈ సందర్భంగా సాహిత్యరంగం నుంచి బహుముఖ ప్రజ్ఞాశీలి మాకినీడి సూర్యభాస్కర్ (కాకినాడ)ను, సెక్సు విజ్ఞాన రంగం నుంచి 'కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్' జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ జి. వెంకటరమణ (హైదరాబాద్)ను రాంషా స్మృతిలో సత్కరిస్తున్నాం. రాంషా సాహిత్యంలోని కావ్య, కథా, నాటక, విమర్శ, వైజ్ఞానిక కోణాలను ప్రతిబింబించే 5 సంపుటాల ఆవిష్కరణ జరుగుతుంది.

■ డా. పూషా దర్భా
■ అప్పాజీ అంబరీష దర్భా

(నేడు రాంషా శతజయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'ఆప్మెల్' ఆంధ్రకు వదిలేయవద్దు..!

ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విభజన సమస్యలపై చర్చించారు. ఈ చర్చల్లో తెలంగాణ ఆస్తి, హక్కు అయిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్ఎంఈఎల్–ఆప్మెల్) గురించి చర్చ జరగలేదు! విజయవాడలో ఉన్న 'ఆప్మెల్' సంస్థ మనది.

తెలంగాణను సింగరేణిని మినహాయించి చూడలేం. విజయవాడ, వైజాగ్‌లలో కోట్ల విలువగల సింగరేణి భూములు ఉన్నాయి. ఏపీలో ఉన్న, దాదాపు రూ.1000 కోట్ల ఆస్తి కలిగిన ఆప్మెల్ సింగరేణికి చెందినదే. విభజన చట్టం ప్రకారం కూడా ఇది సింగరేణికి చెందాలి. ఈ పదేళ్లలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్‌గా ఉన్నవారే ఆప్మెల్‌కు చైర్మన్‌గా ఉంటున్నారు. సింగరేణి అధికారులే సభ్యులుగా పాలక మండలి కొనసాగుతోంది. ఈ పదేళ్లలో షెడ్యూల్ 9లో ఉన్న సంస్థల విభజనకు సంబంధించి షీలాబిడే కమిటీ పదిసార్లు సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు అక్కడికి రావాలని పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చారు. అక్కడి అసెంబ్లీకి తెలంగాణ సంస్థ అయిన సింగరేణి అధికారులను పిలిచే హక్కు ఎలా ఉంటుంది? 2018 మార్చిలో షీలాబిడే కమిటీ ఆప్మెల్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు చెందుతుందని ఒక నివేదికను ఇచ్చింది. 2019లో ఇందుకు సంబంధించి ఒక సమావేశం జరిగింది. అప్పుడు సింగరేణి యాజమాన్యం ఆ సంస్థ తమదేనని వాదించింది. దీనిపై కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వారు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఎందుకంటే ఇందులో సింగరేణికి 81.54 శాతం వాటా ఉంది. ఏపీఐడీసీకి 5.79 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డర్లు 11.81 శాతం ఉన్నారు. దీని ప్రకారం ఆప్మెల్ తెలంగాణలోని సింగరేణికి చెందుతుంది. షీలాబిడే కమిటీ తీసుకున్న నిర్ణయం షెడ్యూల్ 9కి పూర్తి విరుద్ధం. కేసీఆర్ ప్రభుత్వం ఈ విషయమై కేంద్రానికి లేఖ రాసి, చర్చించింది. కానీ గట్టి ప్రయత్నం చేయలేదు.



విజయవాడలోని కొండపల్లి సమీపంలో 1976లో ఏర్పడిన ఆప్మెల్... ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కిందికి వస్తుంది. 1994లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగరేణికి ఆప్మెల్‌ను అప్పజెప్పింది. దాదాపు మూతపడే పరిస్థితుల్లో సింగరేణి దీనిని టేకోవర్ చేసి, రూ.50 కోట్లకు పైగా లాభాల్లోకి తీసుకొచ్చింది. విభజన తర్వాత అటు కేంద్రానికి, ఆంధ్రప్రదేశ్‌కు టాక్స్‌లు కూడా చెల్లించింది. పైగా సిబ్బందికి వేతనాలు కూడా సింగరేణి సంస్థే ఇస్తోంది. అమరావతికి 8 కిలోమీటర్ల దూరంలో దాదాపు 250 ఎకరాల భూమి, ఆటోనగర్‌లో 30 ఎకరాలు... ఇలా విలువైన భూములు ఆప్మెల్ ఆస్తిగా ఉన్నాయి. అలాంటి సంస్థను ఇప్పుడు షీలాబిడే కమిటీ సిఫార్సుతో ఆంధ్రప్రదేశ్‌కు ఎలా కేటాయిస్తారు? గతంలో ఒక ఏడాది సింగరేణి ఇచ్చే ఆర్డర్ తగ్గితేనే ఆ సంస్థకు రూ.2 కోట్ల వరకు నష్టాలు వచ్చాయి.

ఆప్మెల్‌ను సింగరేణి టేకోవర్ చేసినప్పుడు అది తెలంగాణది కాకుండా ఆంధ్రప్రదేశ్‌ది ఎలా అవుతుంది. కేంద్ర ప్రభుత్వం న్యాయంగా ఆలోచించాలి. లేని పక్షంలో ఆప్మెల్ కోసం తెలంగాణలో మరో ఉద్యమం తప్పదు. అక్కడ ఉద్యోగులను సింగరేణి ఉద్యోగులుగా సంస్థ భావిస్తోంది. ఐదు సంవత్సరాలు వరుసగా నష్టాలను చవిచూసిన ఆప్మెల్ 2022–23లో 35 కోట్ల టర్నోవర్‌తో 2.5 కోట్లు స్వల్ప లాభాల్లోకి వచ్చింది. సింగరేణి గతంలో రూ.60 కోట్లు, కోల్ ఇండియా రూ.20 కోట్ల పనులను ఆప్మెల్‌కు అప్పగించడంతో దీని టర్నోవర్ రూ.80 నుంచి వంద కోట్లకు చేరింది. అటువంటి సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడం అన్యాయం. అనవసరమైన వాదనకు వెళ్లకుండా ఆప్మెల్‌ను తెలంగాణకు బేషరతుగా అప్పజెప్పాలి.

సింగరేణి ఆస్తి అయిన ఆప్మెల్ సంస్థ ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నదని, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం తెలుసుకోవాలి. సింగరేణిని చూస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఒకసారి 'ఆప్మెల్' మీద సమావేశం ఏర్పాటు చేయాలి! రాష్ట్ర ప్రభుత్వం షీలాబిడే కమిటీ ఇచ్చిన రిపోర్టును స్టడీ చేయాలి. ప్రభుత్వంతో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు ఆప్మెల్ తెలంగాణకు చెందేలా ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాల్సిన అవసరం ఉంది.

◆ ఎండీ. మునీర్
సీనియర్ జర్నలిస్ట్

ఒక శాంతిదూత కరువైనప్పుడు...

పాలస్తీనా అనగానే ఒకప్పుడు యాసర్ అరాఫత్ గుర్తుకు వచ్చేవారు. బహుశా ప్రపంచ రాజకీయాల స్థితిగతులేం పట్టని ఇప్పటి తరానికి మాత్రం ఆయనెవరో ప్రత్యేకంగా చెప్పాల్సి ఉంటుంది. ఆయన డెబ్భై, ఎనభై దశకాలలో ఐక్యరాజ్య సమితి వేదికలపై తరచు కనపడేవారు. ప్రపంచ రాజకీయాలను శాసిస్తున్న అమెరికా, నాటి సోవియట్ యూనియన్‌లతోపాటు ఏ సైనిక కూటమికీ చెందక 'అలీన దేశాల ఉద్యమా'నికి నాయకత్వం వహించిన ఇండియాకూ తరచు పర్యటనలు చేసేవారు. పాలస్తీనా దేశం పట్ల, పాలస్తీనీయుల పట్ల గౌరవం, గుర్తింపు, ఆర్థిక తోడ్పాటు కోసం విజ్ఞప్తి చేసేవారు. తమ భూభాగంలో భాగం పంచుకుని తమపై ఆధిపత్యం చేస్తున్న ఇజ్రాయెల్ నాయకత్వం చూపుతున్న జాతి వైరం, వివక్షలు, దాడులను వివరిస్తూ ప్రపంచ దేశాల నాయకులను సందర్శించేవారు. నాటి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్ఓ) నాయకుడి పేరు నేడు అరవై ఏళ్లు దాటిన వారికి సుపరిచితమే. ఆ కాలంలో పాలస్తీనా ఇప్పటి నరమేధంతో గాక కాస్తో కూస్తో ప్రశాంతంగా ఉండింది. కాని నేడు అమెరికా నాటో సైనిక కూటమి ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో అందరూ యాసర్ అరాఫత్ నాయకత్వాన్ని, అతను పాలస్తీనా ప్రజలకు సాధించిన శాంతిని మర్చిపోయారు.

వందల ఏళ్ళుగా పాలస్తీనీయుల దేశంగా పరిగణన పొందిన భూభాగంలోనే ఇజ్రాయెల్‌కు భాగం పంచి ఇచ్చిన అగ్ర రాజ్యాలు నేడు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఏదో కారణంతో హింసాత్మకంగా జియోనిస్టు జాతి వైరాన్ని రుద్దుతుంటే నోరు మెదపక ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. వెస్ట్ బాంక్ నుంచి పడమరకు మధ్యధరా సముద్రం మధ్య ఒకప్పటి పాలస్తీనా భూభాగం ఇపుడు ఇజ్రాయెల్ అధీనంలో ఉన్నది. మధ్యధరా సముద్రపు తూర్పు తీరంలో సుమారు 60కిమీ పొడవున, 10కిమీ వెడల్పుతో ఉండే పట్టీ వంటి ప్రాంతంలో 25 లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తున్నారు. ఈ గాజా పట్టీలో మొత్తం పాలన ఇజ్రాయెల్‌దే. ఇక్కడ ఇజ్రాయెల్ సైనికులు అత్యాధునిక ఆయుధాలతో నిత్యం పాలస్తీనీయులపై ఆధిపత్య హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఈ పట్టీలో ఇజ్రాయెల్ సైనికుల దాడులకు అంతర్జాతీయ జర్నలిస్టులు కూడా బలయ్యారు.

పీఎల్ఓ నాయకుడు యాసర్ అరాఫత్ నాయకత్వం తొంభైల దశకంలో ముగిసిన తర్వాత పాలస్తీనా యువతరం నుంచి హమాస్ అనే సాయుధ దళాల పోరాట సంస్థ పాలస్తీనీయుల రక్షణ బాధ్యతను తీసుకున్నది. ఇజ్రాయెల్‌పై సంఘర్షణలో హమాస్‌కు దక్షిణ లెబనాన్‌లో హెజొబుల్లా తీవ్రవాదులు సహకారం అందిస్తున్నారు. తమ దక్షిణ లెబనాన్ స్థావరాల నుండి వారూ, గాజా పట్టీలోని తమ స్థావరాల నుండి హమాస్ దళాలూ కలిసి ఇజ్రాయెల్ ప్రజలు అధికంగా ఉన్న భూభాగం పైకి అప్పుడప్పుడు క్షిపణులు ప్రయోగిస్తూంటారు. ఈ సంస్థలు క్షిపణులు ప్రయోగించినపుడల్లా ఇజ్రాయెల్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాజా పట్టీ నివాసాలపై బాంబుల వర్షం కురిపించి పదుల సంఖ్యలో పాలస్తీనీయులను హత్యచేయడం గత పదేళ్ల కాలంలో జరుగుతూనే ఉంది. ఇజ్రాయెల్ సైనిక దళాలు గాజాలో నిత్యం సృష్టిస్తున్న రక్తపాతానికి, నిత్య ఆంక్షల వేధింపులకు విసిగిన గాజా పట్టీ యువకులు హమాస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ గాజా దక్షిణ హద్దులో ఇజ్రాయెల్ సైనికుల రక్షణను దాటుకుని ఒక గ్రామం చేసిన దాడిలో కొందరిని చంపి మరికొందరు ఇజ్రాయెలీ పౌరులను ఎత్తుకుపోయారు. దీంతో ఇజ్రాయెల్ తమ పౌరుల విడుదల పేరుతోనూ, హమాస్‌ను నిర్మూలించే పేరుతోనూ గాజా పట్టీలో నరమేధం మొదలుపెట్టింది. దాదాపు యాభై వేల మంది అమాయక పాలస్తీనీయుల ప్రాణాలను బలిగొన్నది.

పాలస్తీనీయులపై తొమ్మిది నెలలగా సాగుతున్న ఏకపక్ష మారణకాండపై అంతర్జాతీయ శాంతి సంఘాలు, శాంతికాముక దేశాల వైఖరి కూడా ప్రశ్నార్థకంగానే ఉన్నది. అంతర్జాతీయ శాంతి, సహకారం, సహజీవన సూత్రాలను ప్రచారం చేయడంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా వెనకబడింది. భద్రతా సమితి తీర్మానాలను అమెరికా వీటోతో అడ్డుకుంటున్న పరిస్థితులలో ఐక్యరాజ్యసమితి నాయకత్వం ప్రపంచ దేశాలలో ఏ కూటమికీ చెందని అంతర్జాతీయ నాయకులను రంగంలోకి దించక తప్పదు. పాలస్తీనీయుల శాంతి, సౌభాగ్యాల కోసం యాసర్ అరాఫత్ చేసిన కృషిని నేటి ఐక్యరాజ్యసమితి వేదికలు మరొక్కసారి ప్రపంచానికి గుర్తుచేయాలి.

యాసర్ అరాఫత్ పాలస్తీనీయుల ప్రశాంత జీవనం కోసం చేసిన కృషిని గాజా పట్టీ హమాస్ తరఫున పని చేస్తున్న సాయుధ దళాల నాయకులు పరిగణనలోకి తీసుకోవాలి. అంతర్జాతీయ స్థాయి శాంతిదూతలు కరువైపోయిన నేటి ప్రపంచంలో, ఒకపక్క పాలస్తీనీయుల రక్తపుటేరులను చూస్తూ కూడా మరోపక్క యుద్ధ పిపాసులూ ఆయుధ బేహారులైన అగ్ర రాజ్యాలతో సొంత ప్రయోజన ఒప్పందాలు చేసుకుంటున్న అరేబియా దేశాలు, ఇతర ప్రపంచ దేశాల నిర్లిప్తత నైతికంగా నేరపూరితం! అగ్ర దేశాల ఆయుధ కంపెనీల ఆయుధ ఉత్పత్తీ, వ్యాపారం, లాభార్జన నిరాటంకంగా సాగడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్ మారణకాండకు పరోక్ష మద్దతు ఇస్తున్నాయి. ఇండియాతో సహా అన్ని అగ్రదేశాలూ ఇజ్రాయెల్‌కు సైనిక, ఆర్థిక సహాయాలు అందిస్తున్నాయి. పరోక్షంగా నరమేధంతో పాలుపంచుకుంటూ రక్తపు కూడు తింటున్నాయి.

హమాస్ అనే సాయుధ సంస్థ తన కీలక దాడి ఫలితంగా లక్షల మంది పాలస్తీనీయులు బలవుతారని ఊహించిందా? ఇజ్రాయెల్‌కు లభిస్తున్న అమెరికా, నాటో కూటమి దేశాల మద్దతు గురించి ఆలోచన చేసిందా? కనీసం ఇజ్రాయెల్ అంటే నలభై ఏళ్ల క్రితం మండిపడిన అరేబియా దేశాల నాయకులు కొందరు నేడు నేరుగా ఇజ్రాయెల్‌తోనే ఒప్పందం చేసుకుంటున్న పరిస్థితిని హమాస్ పరిగణనలోకి తీసుకుందా? ఈ ప్రశ్నలకు జవాబులు ఏమైనా గానీ– పాలస్తీనీయుల కోసం అంతర్జాతీయ దౌత్యపరమైన మద్దతు సమీకరించగలిగే యాసర్ అరాఫత్ వంటి నాయకుడి అవసరాన్ని హమాస్ గుర్తించలేకపోవడమే నేడు పాలస్తీనీయులకు శాపమైంది.

నేడు అమెరికా నాటో సైనిక కూటమి ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో అందరూ యాసర్ అరాఫత్ నాయకత్వాన్ని, అతను పాలస్తీనా ప్రజలకు సాధించిన శాంతిని మర్చిపోయారు. పాలస్తీనీయుల కోసం అంతర్జాతీయ దౌత్యపరమైన మద్దతు సమీకరించగలిగే అరాఫత్ వంటి నాయకుడి అవసరాన్ని హమాస్ గుర్తించలేకపోవడమే నేడు పాలస్తీనీయులకు శాపమైంది.



● కిన్నెర



నిర్వహణకు నిధులేవీ?

- జాడలేని మొదటి విడత పాఠశాలల గ్రాంట్లు
- ఎదురుచూస్తున్న హెచ్‌ఎంలు
- కష్టంగా మారిన స్కూళ్ల మెయింటెనెన్స్
- చాక్‌పీసులకు కూడా డబ్బుల్లేని పరిస్థితి
- సొంతంగా ఖర్చుచేసినా మంజూరుకాని బిల్లులు
- గతేడాది పరిస్థితే పునరావృతం

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను నిధుల కొరత వేధిస్తోంది. సాధారణ కార్యకలాపాలకు కూడా కష్టమవుతోంది. పాఠశాలల నిర్వహణ రోజు రోజుకు భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా సర్కారు నుంచి నయాపైసా మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా పరిణమిస్తోంది. మూడు నెలలకు ఒకసారి ఇచ్చే నిర్వహణ గ్రాంట్ విషయంలో నిర్లక్ష్య ధోరణి కారణంగా పాఠశాల విద్యపై నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వాలు మారినా సర్కారు బడుల పరిస్థితి మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కార్ బడులను బలోపేతం చేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నా... పాఠశాల నిర్వహణకు కనీస నిధులను ఇవ్వడం లేదని, ఈ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ధోరణినే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ గ్రాంట్‌ను ప్రతీ మూడు నెలలకోసారి విధిగా విడుదల చేయాలి. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడత గ్రాంట్ జూన్ మొదటి వారంలోనే మంజూరు కావాల్సి ఉండగా జూలై నెల కూడా ముగుస్తోంది. ఇప్పటి వరకు అతీగతీ లేదు. నిర్వహణ గ్రాంట్ ఎప్పుడు వస్తుందా అని ప్రధానోపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో విడుదల చేయ లేదు. నిధులన్నీ మురగబెట్టి విద్యాసంవత్సరం ముగుస్తుందనగా ఒక్క సారే ఇచ్చింది. వాటిని సకాలంలో ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు..

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే ధోరణితో వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లే సొంత డబ్బులు వెచ్చించి కొంత మేర సౌకర్యాలు సమకూర్చుకుంటున్నారు. సాధారణంగా విద్యార్థుల సంఖ్య మేరకు నిర్వహణ గ్రాంట్లు వస్తాయి. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.10వేల వరకు, 31 నుంచి 100మంది విద్యార్థులున్న స్కూళ్లకు రూ.25 వేలు, 101 నుంచి 250మంది విద్యార్థులున్న బళ్లకు రూ.50వేలు, 251 నుంచి 1000మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.75వేల వరకు ఇస్తారు.



మొత్తం 4,777 స్కూళ్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,777 ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. హనుమకొండ జిల్లాలో 865, జనగామ జిల్లాలో 638, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 532, మహబూబాబాద్ జిల్లాలో 1181, ములుగు జిల్లాలో 550, వరంగల్ జిల్లాలో 1011 పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 3.27లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా నాలుగు విడతలుగా విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రూ.12500వరకు నిధులను అందించాలి. వాటితోనే పాఠశాలల్లో చాక్‌పీసులు మొదలు హాజరు రిజిస్టర్లు, ఇతర అవసరమైన సామగ్రి, ప్రయోగశాల రసాయనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల చేయని కారణంగా బడుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.

క్రీడానిధులెప్పుడు?

విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలతో పాటు ఆత్మరక్షణ శిక్షణలో భాగంగా ఏడాదికి రూ.15వేలు కూడా ఇవ్వాలి. ఈ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పీఈటీలను పీడీలుగా పదోన్నతులు కల్పించారు. విద్యార్థులకు పలు చోట్ల పరికరాలు లేవు. మైదానాలు చదునుచేయడానికి ఆర్థిక వనరుల అవసరం ఉంటోంది. క్రీడల నిర్వహణకు ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఓ పక్క అట్టహాసంగా ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల్లో స్వతహాగా క్రీడలపై ఆసక్తి నెలకొంటుండడం సహజం. నిధులు లేకపోవడంతో పీడీలు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్సులకు..



ఉమ్మడి జిల్లాలో సర్కారు బడుల్లో మండల రిసోర్సు కేంద్రాలు, పాఠశాల కాంప్లెక్సుల వారీగా ప్రభుత్వం ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తోంది. ఒక్కో ఎమ్మార్సీకి ఏడాదికి రూ.90వేలు, ఒక్కో పాఠశాల కాంప్లెక్సుకు రూ.33 వేలుగా నిర్దేశించారు. బడుల సంఖ్యకు అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.80వేల దాకా అందిస్తారు. 2020-21 విద్యా సంవత్సరంలో బడులకు సగమే నిధులిచ్చారు. 2021-22లో ముందుగా సగం నిధులు ఇచ్చి మిగతావి మార్చి 31వ తేదీ వరకు మంజూరు చేశారు. ఏప్రిల్‌లో అన్ని బ్యాంకుల్లోని ఖాతాలను విద్యాశాఖ అధికారులు మూసేశారు. ఖర్చుకాని నిధులన్నింటిని వెనక్కి తీసుకున్నారు. 2022-23లో జనవరి వరకు నిర్వహణ నిధులను ఖాతాల్లో వేశారు. 2023-24 విద్యా సంవత్సరం లోనూ పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. 2024-25 విద్యా సంవత్సరంలోనైనా ఈ నిధులు పూర్తిస్థాయిలో విడుదల వుతాయా అన్న సందేహం ప్రధానోపాధ్యాయులను వెంటాడుతోంది. ఈ పాటికే కొన్ని నిధులు విడుదల కావలసి ఉండింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా రాలేదు.

స్మార్ట్‌సిటీకి రూ.180 కోట్ల కేటాయింపు

అభినందనీయం

- బీఆర్ఎస్ పాలనలో కుంటుపడిన నగరాభివృద్ధి
- కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు
- అక్రమంగా బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణం
- బడ్జెట్ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూలై 29 : రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన అసెంబ్లీలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేశారు. స్మార్ట్‌సిటీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలు, వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్ల నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ నగరాభివృద్ధి కుంటుపడిందన్నారు. వర్షాలకు నగరం ముంపునకు గురవ్వడం కారణంగా ప్రజలు నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ లోపభూయిష్ట పాలన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల పాలనలోనే ముంపు సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టి ఈ మేరకు నిర్మాణాలను జరుపుతున్నట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన జీవో తో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో జీవోను సవరించాల్సిన అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్ పశ్చిమలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని సమగ్ర విచారణకు ఆదేశించి ఆస్తుల పరిరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. హనుమకొండలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమైందని పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీకి చెందిన పార్కు స్థలంలో కార్యాలయ నిర్మాణం జరిగిందన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు.



అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

- 7లో..

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపులు

- కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా
- నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు

వివరాలు : 7లో..





శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- పద్నాలుగేళ్ల క్రితం మంజూరు
- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు

7



ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలోని పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

మళ్లీ పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, జూలై 29 : గోదావరి పరవళ్లు తొక్కుతోంది. తగ్గినట్టు తగ్గి మళ్లీ పెరుగుతోంది. మండలంలోని కాళేశ్వర వద్ద సోమవారం గోదావరి ప్రవాహం పెరిగింది. 11.2 అడుగుల మేర ఎత్తుతో పరుగులు పెడు తోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడం, మానేరు, ప్రాణహిత నదుల నుంచి వరద చేరడంతో త్రివేణి సంగమం వద్ద గోదావరి పెరిగినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రామన్నగూడెం వద్ద...

ఏటూరునాగారం రూరల్, జూలై 29: రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి సోమవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు 14.250 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నం 11 గంటలకు 14.210 మీటర్లకు గోదావరి నీటిమట్టానికి చేరి క్రమేపీ తగ్గిం ది. ఆ తర్వాత మూడు గంటల పాటు నిలకడగా ఉన్న గోదావరి సాయంత్రం 4 గంటల 14.230 మీటర్లకు నీటిమట్టానికి చేరి పెరుగుతోంది. పుష్కరఘాట్ వద్ద సాయంత్రం 6 గంటలకు 14.270 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి

- బోడ మాణిక్యం తండాలో విషాదం



జీవన్ (ఫైల్)



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బాలుడి కుటుంబసభ్యులు

చెన్నారావుపేట/బాలసముద్రం, జూలై 29 : డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడమాణిక్యంతండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య ఉమ-మోహన్‌ల కుమారుడు భూక్యా జీవన్(13) మండల కేంద్రంలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జీవన్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది. నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. వైరల్ జ్వరంగా వైద్యులు నిర్ధారించి మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. రెండు రోజుల క్రితం వాంతులు చేసుకున్నాడు. దీంతో హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు డెంగీగా గుర్తించి, ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా సోమవారం మృతి చెందాడు. సిద్ధార్థ ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కేతిడి వీరారెడ్డి, జక్క అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, కుండె కుమారస్వామి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన

కాగా, వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు జీవన్ మృతిచెందాడని బాలుడి కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వెంటనే సుబేదారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేపడుతున్న వారితో పోలీసులు మాట్లాడుతుండగా బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులతో, వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- వెంకట్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

డెంగీ జ్వరంతో హస్పిటల్‌లో చేరిన బాలుడు జీవన్ మృతికి ఆస్పత్రి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. సోమవారం మృతి చెందిన బాలుడు జీవన్ కుటుంబసభ్యులను వెంకట్ పరామర్శించి మాట్లాడారు.



తీరు మారట్లే!

- అడ్డంగా దొరుకుతున్నా ఆగని సబ్‌రిజిస్ట్రార్ల చేతివాటం
- మధ్యవర్తుల ద్వారా యథేచ్ఛగా అక్రమాలు, వసూళ్లు

రాంనగర్, జూలై 29 : రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయంలో లేని సమస్యలను సృష్టించడం, ఆ తర్వాత మధ్యవర్తులను రంగంలోకి దించి బేరసారాలు చేసుకోవడం.. సబ్ రిజిస్ట్రార్లకు అలవాటుగా మారిందని, ఏకంగా ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరుకుతున్నా సబ్‌రిజిస్ట్రార్లు తీరు మార్చుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని ఇళ్లు, నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకూడదని గత ప్రభుతం నిబంధనలు విధించడం వారికి కలిసివచ్చినట్లు కనిపిస్తోంది. ఇలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో సబ్ రిజిస్ట్రార్లు ఆస్తి విలువను బట్టి వసూలు చేస్తున్నారు. జిల్లాలో 13 కార్యాలయాలు ఉండగా చాలా కార్యాలయాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ముడుపులు పుచ్చుకుంటూ అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరుకుతున్నా సబ్‌రిజిస్ట్రార్లలో మార్పు రాకపోవడం విశేషం. శాఖ ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

అడ్డంగా దొరుకుతున్నా మారని తీరు

అందినకాడికి దండుకుంటూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నా సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావడం లేదనే విమర్శలున్నాయి. గత మార్చి 22వ తేదీన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా 128 గజాల స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో మధ్యవర్తి ద్వారా రూ.19,200 తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈనెల 25న పరకాల సబ్ రిజిస్ట్రార్ సుజాత వారసత్వ ఆస్తి రిజిస్ట్రేషన్ విషయంలో రూ.80వేలు మధ్యవర్తి ద్వారా తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరిపై గతంలో పలు ఆరోపణలు వచ్చినా ఏమాత్రం పద్ధతి మార్చుకోకుండా ముడుపులు పుచ్చుకుంటూ దొరికిపోవడం విశేషం. జిల్లాలో ఇంకా పలువురు సబ్ రిజిస్ట్రార్లు అక్రమ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేస్తూ అందినకాడికి దండు కుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిద్దరు సబ్ రిజిస్ట్రార్లపై లెక్కకు మించి ఆరోపణలు రావడంతో ఎక్కడ దొరికిపోతామోననే భయంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నట్టు సమాచారం. హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సబ్ రిజి స్ట్రార్లు గతంలో వారు పనిచేసిన ప్రాంతంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్నట్టు అధికారిక సమాచారం.

దృష్టి సారించని ఉన్నతాధికారులు

ఇన్ని అక్రమాలు జరుగుతున్నా శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిచ్చి నట్లవుతోంది.

నిరంతరం ఉన్నతాధికారుల నిఘా లేకపోవడం మూలంగానే పలువురు సబ్ రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. విచ్చల విడిగా రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుచున్న అక్రమాలకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

మధ్యవర్తులతో దందాలు

జిల్లాలోని చాలా కార్యాలయాల్లో మీడియేటర్ల హవా కొనసాగుతోంది. సబ్ రిజిస్ట్రార్లు వ్యక్తిగత పనుల కోసం ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వారి ద్వారా దందాల కొనసాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లాలో ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు కూడా మీడియేటర్ల ద్వారానే ముడుపులు పుచ్చుకుంటూ అడ్డంగా దొరికిన విషయం తెలిసిందే. సబ్ రిజిస్ట్రార్లతో పని కావాలంటే వారి వ్యక్తిగత ప్రైవేటు సిబ్బందిని సంప్రదిస్తే ఎలాంటి పని అయినా క్షణాల్లో పూర్తవుతుందనే విమర్శలున్నాయి. నగరంలో ఉన్న మూడు కార్యాలయాల్లో మీడియేటర్లు ఆస్తుల క్రయవిక్రయాల్లో కీలక పాత్ర పోషిస్తుంటారనే ఆరోపణలున్నాయి. తమ వద్దకు వచ్చే వారిని సబ్ రిజిస్ట్రార్‌లు సైతం వ్యక్తిగత ప్రైవేటు వ్యక్తిని సంప్రదించాలని సూచిస్తారనే ప్రచారం ఉంది. ఎలాంటి సమస్య ఉన్నా ప్రైవేటు వ్యక్తి చక్కదిద్ది సదరు ఆస్తి రేటును బట్టి ముడుపులు వసూలు చేస్తారని సమాచారం. మొత్తంగా చాలా కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా దందా సాగుతుందనే విమర్శలున్నాయి.



కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

గూడూరు, జూలై 29: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కారు అతివేగంగా దూసుకువెళ్లి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. మండలంలోని దామరవంచకు చెందిన నలుగురు యువకులు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గూడూరు నుంచి మహబూబాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నాయకపల్లిలో అతివేగంగా నడుపుతూ రోడ్డుపై కుక్క ఉండడంతో ఎడమ వైపుకు వాహనం తిప్పాడు. ఎడమ వైపున ఉన్న ఓ వ్యక్తి సెల్ లైట్ వేసుకుని నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన డ్రైవర్ ఆవెంటనే మళ్లీ కుడివైపుకు తిప్పాడు. కుడివైపున ఉన్న చిన్నకంకర కుప్పపైకి వెళ్లడం, ఆవెంటనే ఎడమవైపుకు వేగంగా దూసుకెళ్తూ తొలుత కల్వర్టును ఢీకొట్టింది. ఆపై ఓ చెట్టును, హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరును కారు ఢీకొట్టి రోడ్డు కింది భాగంలోని పొలాల్లో పడింది. వాహనంలో ఉన్న ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో ముందుభాగంలో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. వాహనం నడుపుతున్న దామరవంచ తండాకు చెందిన నూనావత్ సిద్దు తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో రోడ్డువెంట మాట్లాడుతున్న గ్రామస్తులు, చిన్నపిల్లలు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి పక్క నుంచే కారు అతివేగంగా దూసుకుపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు.


ప్రమాదంలో గాయపడిన నూనావత్ సిద్దు

సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్

బోర్డుకు దరఖాస్తు చేసిన సంస్థ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణా లు గల మరింత నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో వ చ్చే వి ద్యాసంవత్సరం నుఏంచి సింగరేణి పాఠశాలలో సెంట్రల్ బో ర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)సిలబస్‌ను బోధించాలని ఆ సంస్థ నిర్ణయించింది. దీనికోసం తొలుతగా రామగుండం-2 ఏరియా ఇంక్లైన్ కాలనీలో ఉన్న సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సింగరేణి సంస్థ దరఖాస్తు సమర్పించింది. దీనికన్నా ముందు తెలం గాణ విద్యాశాఖనుం చి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకొని దరఖా స్తును సమర్పించింది. దాంతో పాఠశాలను పరిశీలించడానికి వీలుగా త్వరలోనే సీబీఎస్ఈకి చెందిన ఉన్నత స్థాయి బృందం రామగుండం చేరుకొని, తరగతి గదులను, పాఠశాల క్రీడా మైదానం , ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు తదితర అన్ని అంశాలను పరిశీలించి, తగి న సిఫారసులు చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి రామగుం డం లో, ఆ తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోనూ దీన్ని అందుబాటు లోకి తీసుకురావాలని నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 29 : కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని ఎంజీఎం ఆస్పత్రి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆవరణలో సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికుల సమాఖ్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 4న వరంగల్‌లో కార్మిక వర్గ హక్కుల కో సం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేత నం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణ మే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ వివిధ వి భాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సి బ్బంది గొర్రె నాగరాజు, ఆర్.రాజు, సుధాకర్, పుష్ప, రాజవీరు, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, నాగరాజు, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





















సీఎంకు పండుగల పంచాంగం అందజేత



సీఎంకు పండుగల జాబితాను అమ్మవారి ప్రసాదాన్ని అందించిన సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 29: తెలంగాణ విద్వత్‌సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా పండుగల నిర్వహణను తెలియజేసే 2025-26 విశ్వవసు నామ సంవత్సర జాబితా(పంచాంగం)ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం అందించారు. అలాగే, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో సభ బాధ్యులు సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్వత్‌సభ వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిలిచ్చినట్టు పేర్కొన్నారు. పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి లేకుండా జాబితాను నిర్ధారించి అందించినందుకు మంత్రి సురేఖ అభినందించారన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు(వరంగల్), యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహచార్యులు(యాదాద్రి), విద్వత్‌సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి(మేడపల్లి-నల్లగొండ), కోశాధికారి ఎంవీఆర్ శర్మ(హైదరాబాద్), వేదపండితులు నటార్‌శర్మ(వరంగల్), సాయిదీక్షిత్(వరంగల్) పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్లను వెంటనే నియమిం చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొం డలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో పారిశుధ్య పనులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో బీఈడీ కలిగి ఎస్జీటీలు నష్టపోయారని, వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణమ య్యా యని, వాటి నిర్వహణకు స్కావేంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెం డింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, పి. మనోజ్, స్వామి, తన్వీర్, బుచ్చాచారి, అశోక్, పూర్ణ చందర్, రమేష్, రవి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం పీడీ



కొమ్ము రాజేందర్

కేసముద్రం, జూలై 29 : ప్యారిస్‌లో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరిగే పారా ఒలింపిక్స్‌కు దేశం తరపున బ్యాడ్మింటన్ క్రీడకు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా రాజేందర్ గతంలో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, బ్యాడ్మింటన్ ఏషియా, ఏషియన్ స్కూల్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడలు, మూడుసార్లు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, టాటా ఓపెన్ ఇంటర్నేషనల్, ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్, ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, నేషనల్ గేమ్స్, సౌత్ జోన్ క్రీడలతో పాటు అనేక జాతీయ స్థాయి క్రీడలకు అంపైర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. తాజాగా వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వారు టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, స్థానిక హైస్కూల్ హెచ్ఎం బి.రాజు, ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయ



విజయ

వడ్డెపల్లి, జూలై 29 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జా తారకం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా హనుమకొండ పట్టణానికి చెందిన చేపూరి విజయ నియమితులయ్యారు. ఆర్‌పీఐ బొజ్జా తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, ఆర్‌పీఐ వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని చేపూరి విజయ పేర్కొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, జూలై 29 : ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అమరవీరుల అనంతరం గళమెత్తి ఉద్యమించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కళాకారులు నిరసనగా భిక్షాటన చేశారు. వరంగల్ చౌరస్తాలో ఒక బృందం, హనుమకొండ చౌరస్తాలో ఒక బృందం కళాకారులు భిక్షాటన చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలంటూ కోరారు. రోడ్డుప క్కన ఉన్న షాపుల్లోకి వెళ్లి భిక్షాటన చేశారు. కళాకా రుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, ఎస్ కే.రాజు, బిర్రు సురేం దర్, గుండెకారి సునీల్, సదానందం, డప్పు కార్తీక్, వెంకట్, హను మకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి, రాయబారపు సాంబయ్య తదితర సుమారు 100 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో పదోన్నతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు నిర్వహించగా కొన్ని ఖాళీలు మిగిలాయి. వరంగల్ జిల్లాలో 43 ఖాళీలు ఏర్పడగా హనుమకొండ జిల్లాలో సైతం 43 ఖాళీలే ఏర్పడ్డాయి. దీంతో మిగులు ఖాళీల్లో సైతం అర్హులైన ఉపాధ్యాయులకు సోమవారం పదోన్నతులు కల్పించారు. వరంగల్ జిల్లాలో పీఎస్ హెచ్ఎంలు 4, హిందీలో 5, ఫిజికల్‌సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 9, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, తెలుగులో 7, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్‌లో 40 మంది ఉపాధ్యాయులకి మాత్రమే ప్రమోషన్ రాగా, మిగతా మూడు ఖాళీల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో 3 ఖాళీలు అలాగే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పీఎస్ హెచ్ఎంలలో 11, సోషల్ స్టడీస్‌లో 16, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో 7, ఫిజికల్ సైన్స్‌లో ఒక్కరు పదోన్నతి పొందారు. వీరందరికి సోమవారం ఆర్డర్లు ఇవ్వగా మంగళవారం పాఠశాలల్లో జా యిన్ కానున్నారు.

సీపీ పేరిట నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు

వరంగల్ క్రైం, జూలై 29 : సైబర్ నేరగాళ్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేరిట నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేశారు. నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేసి పలువురు ఖాతాదారులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. ఈ విషయమై అప్రమత్తమైన కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ పేరిట వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు ఎవరూ స్పందించకూడదని పేర్కొన్నారు. ఇది నకిలీ ఫేస్ బుక్ అని గుర్తించాలని వారు పేర్కొన్నారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?



హైదరాబాద్‌లోని ఈ శిల్పారామం తరహాలోనే వరంగల్‌లోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు..

- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు

పద్నాలుగేళ్ల క్రితం మంజూరు

హన్మకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా శిల్పారామం ఏర్పాటు చేస్తామని పద్నాలుగేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు రూ.6కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేసింది. కానీ ఆ పనులు నేటికీ మొదలవలేదు. అసలు శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపైన ఏర్పడిన తకరారు ఇప్పటికీ సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని వరంగల్ నగర వాసులు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సాకారం కాని తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

14 ఏళ్లనాటి కల..

నగర వాసుల శిల్పారామం కల ఇప్పటిది కాదు. పదమూడేళ్లనాటిది. నాటి ప్రభుత్వం నిధులిచ్చినా ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో స్పష్టత లేకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అనువైన స్థలం గుర్తింపులో అధికారుల వైఫల్యం గ్రహపాటుగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శిల్పారామం మంజూరైంది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఏర్పాటుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శిల్పారామం ఏర్పాటులో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత కాలంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సీఎం కేసీఆర్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్‌తో త్వరలో శిల్పారామం ఏర్పాటుపై ఇచ్చిన హామీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆయా సందర్భాల్లో చేసిన ప్రకటనలు గాలిమాటలుగానే మిగిలి పోయాయి. స్థానికంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు, పట్టణాల్లో నివసించే వారికి పల్లె వాతావరణం రుచి చూపేందుకు, వివిధ ప్రదర్శనల ద్వారా స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించేందుకు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయాలని 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌తో పాటు సంగారెడ్డి, కడప, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపూర్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు శిల్పారామం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు కసరత్తు చేసినా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

స్థల ఎంపికలో తకరారు..

శిల్పారామం ఏర్పాటుకు స్థలం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో అధికారులు తుది నిర్ణయానికి రాలేక పోతున్నారు. ఇప్పటి వరకు అయిదారు చోట్ల స్థలాలను చూశారు. వీటిలో కొన్నిటిని ఖరారు చేశారు. చివరి నివిషంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. శిల్పారామంను మొదట హన్మకొండ గోపాలపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఓ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల స్థలం ఈ స్థల సేకరణకు అధికారులు కొంత కసరత్తు చేశారు. అయితే ఈ స్థలంలో అప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినందు వల్ల శిల్పారామం ఏర్పాటు సాధ్యం కాదని భావించిన అధికారులు ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఖిలా వరంగల్ కోట సమీపంలోనూ స్థలాన్ని చూసిన అధికారులు పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లు కోటకు దగ్గరగా ఉందని, ఈ స్థలం అనుకూలమైందని భావించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. కానీ కేంద్ర పురావస్తు శాఖ అభ్యంతరం చెప్పడంతో అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. హన్మకొండ బాలసముద్రంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న అయిదు ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అయితే ఈ స్థలం సరిపోదని, పైగా ఇది ఇళ్ల మధ్యలో ఉందని అధికారులు ఆ ఆలోచనను కూడా మానుకున్నారు. నగర శివార్లలోని హసన్‌పర్తిలో ఏర్పాటు చేసే విషయమై కూడా అధికారులు పరిశీలించారు. మామునూరు సమీపంలో బెస్తం చెరువును అనుకొని జయశంకర్ స్మృతి వనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. నగరానికి 8కిలోమీటర్ల దూరంలో వరంగల్-ఖమ్మం రోడ్డును ఆనుకొని ఉన్న ఈ స్థలం శిల్పారామానికి అనువైనదిగా భావించారు. అప్పుడు కూడా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ (వైటీడీసీ) వైస్‌చైర్మన్ కిషన్‌రావు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి ఈ స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 60 ఎకరాల్లో శిల్పారామానికి 15 ఎకరాలు కేటాయించేందుకు నాటి కలెక్టర్ వాకాటి కరుణ అంగీకరించారు. కానీ అక్కడ కూడా ఏర్పాటు కాలేదు. చివరికి 2019 సెప్టెంబరు 19న నాటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హైదరాబాద్ శిల్పారామం జనరల్ మేనేజర్ కిషన్‌దాస్ వరంగల్ హంటర్ రోడ్డులో జూపార్క్‌కు ఎదురుగా, ప్రాంతీయ సైన్స్ కేంద్రం సమీపంలో అందుబాటులో ఉన్న సుమారు 30ఎకరాలను పరిశీలించారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించారు. కానీ రెండేళ్లవుతున్నా ఓ కొలిక్కి రాలేదు. ఇక్కడ ఇప్పటికే అక్రమణలు, నిర్మాణాలున్నాయి. పైగా పూర్తిగా గుట్ట ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడానికి దారి లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ సైన్స్ సెంటర్ నుంచే వెళ్లాల్సి ఉంటుందన్న ఆక్షేపణలున్నాయి. కానీ నాడు ఎమ్మెల్యే, కలెక్టర్, వైటీసీ వైస్ చైర్మెన్, మాజీ ఐఏఎస్ అధికారి, ఆర్ట్ డైరెక్టర్ తదితరులు సమీక్షించడంతో పెండింగ్‌లో ఉన్న శిల్పారామానికి కూడా మోక్షం లభించనట్టేనని నగరవాసులు భావించారు. కానీ ఆ తర్వాత అంతా మొదటికే వచ్చింది. అయితే అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత హడావిడి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా శిల్పారామాన్ని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

మూలుగుతున్న నిధులు

వరంగల్‌లో ఏర్పాటు చేసే శిల్పారామంలో వివిధ చేతి వృత్తుల అమ్మకానికి 40కి పైగా స్టాళ్లు, నాటక, కళా ప్రదర్శనలకు ఓపెన్ ఏయిర్ థియేటర్, ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని, శిల్పారామంలో చిన్నపాటి చెరువును ఏర్పాటు చేసి అందులో పిల్లల ఆహ్లాదానికి బోటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. అదనపు ఆకర్షణగా రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి అంచనా ప్రకారం మొత్తం రూ.12కోట్ల వ్యయం కాగా దశల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తొలి విడతగా రూ.5కోట్లను, ఆ తర్వాత రూ.కోటి 14 లక్షలను మంజూరు చేసింది. మొత్తంగా రూ.6.14కోట్లు విడుదలైనా ఇప్పటికీ అవి ఖర్చు కాకుండా మూలుగుతున్నాయి. శిల్పారామం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి లభిస్తుంది. హస్తకళాకారులు తాము తయారు చేసిన కళారూపాలకు, ప్రధానంగా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ లభిస్తుంది. పర్యాటకులు, నగరవాసులకు ఆహ్లాదం కూడా అందుతుంది.

అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

వర్షాల కారణంగా టైగర్ జోన్ ఏర్పాటుకు ఆటంకం



వర్షం నీళ్లు చేరడంతో నిలిచిన టైగర్‌జోన్ పనులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 29 : వచ్చే అక్టోబరులో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు పెద్దపులి రానుంది. మూడు నెలల క్రితం జూపార్కులో అధికారులు టైగర్ జోన్ ఏర్పాట్లు ప్రారంభించారు. వాస్తవానికి టైగర్ జోన్ పనులు ఇప్పటికే పూర్తిచేసి జూపార్కుకు పెద్దపులిని తీసుకురావాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో టైగర్ జోన్ చుట్టు కంచె ఏర్పాటు చేసేందుకు గుంతలు తీయగా ఆ గుంతల్లో వర్షంనీరు చేరి పనులకు ఆటంకం కలిగింది. మూడు నెలల్లో టైగర్‌జోన్ పనులు పూర్తిచేసి పెద్దపులిని తీసుకువస్తామని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపినప్పటికీ వర్షాల కారణంగా పనులు ఇప్ప టికే 70శాతం వరకు మాత్రమే పూర్తయ్యాయి. వ చ్చే సెప్టెంబర్ నెల చివరి వరకు టైగర్ జోన్ పనులు పూర్తిచేసి జూపార్కుకు పులిని తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ అధికారులు పనులు వేగవం తం చేశారు. ఎంతోకాలంగా నగరంలో పులిని చూద్దాం అనుకునే ప్రజలకు మరో రెండు నెలల్లో పులి జూపా ర్కులో కనిపించనుంది.

వర్షాల కారణంగా టైగర్‌జోన్ పనులు ఆలస్యం

మయూరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



మూడు నెలల్లో జూపార్కులో టైగర్‌జోన్ పనులు పూర్తి చేసి పులిని తీసుకొద్దామనుకున్నాం. వర్షాలు పడటం వలన టైగర్‌జోన్ పనులు చేసే ప్రాంతంలో నీళ్లు నిలిచి పనులు చేయడానికి కొంతవరకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం ఇంకా ఇక్కడికి పులిని తీసుకువచ్చే కండిషన్ లేదు. పులిని కొత్త ప్రదేశానికి తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 70శాతం వరకు టైగర్‌జోన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బారికేడ్స్ పనులు జరుగుతున్నాయి. లోపల ఇంకా టైల్స్ వేయాలి. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి అక్టోబర్‌లో జూపార్కుకు పెద్దపులిని తీసుకువస్తాం.

వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు పేరుతో చోరీలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు .. రెండుకార్లు స్వాధీనం

మట్టెవాడ, జూలై 29 : వాహనాల ట్రాన్స్‌ఫోర్ట్ పేరుతో దొంగతనాలకు పాల్పడున్న అంతర్ రాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సోమవారం దొంగల ముఠా అరెస్టు వివరాలను ఏసీపీ వెల్లడించారు. రెండు సంవత్సరాల నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఆగ్రాకు చెందిన కృష్ణ కాంత్ సక్సేనా, రాజస్థాన్ రాఊంపాళీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమకి, వికాస్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌ఫోర్టు, పార్సల్ సర్వీస్ వారి దగ్గరకు కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు చేసేందుకు వారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌ఫోర్టు చేయుటకు వారికి వాహనం ఇచ్చినప్పుడు ముగ్గురు కలిసి వాహనం నెంబరు ప్లేట్‌ని మార్చి, వరంగల్, హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జూన్ 22న మహారాష్ట్ర గోండియా జిల్లాకు చెందిన వికాస్‌కు చెందిన ఎకోస్పోర్ట్ కారును జైపూర్‌లోని రిలీఫ్ రీ లోకేషన్ పార్సెల్ సర్వీసు వారి వద్ద నుంచి మహారాష్ట్ర గోండియాలో డెలీవరి కోసం తీసుకొని, ఆ వాహనంలో గతంలో దొంగతనాలకు పాల్పడిన విధంగా జూన్ 24న వరంగల్‌కు వచ్చి హంటర్‌రోడ్‌లోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ. 2 లక్షల విలువైన ఫినోలెక్స్ ఎలక్ట్రికల్ వైరును దొంగిలించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎకోస్పోర్ట్, మారుతి రిడ్జ్ కార్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ తెలిపారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ నవీన్ కుమార్, మట్టెవాడ క్రైమ్ పార్టీ పోలీసు సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌లను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.



అరెస్టు చూపుతున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మహాలక్ష్మీ పథకంతో పెరిగిన ఆదాయం

ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

బాలసముద్రం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని వరంగల్ రీజనల్ ఆర్టీసీ ఆర్ఎం విజయభాను అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో మొత్తం 928 బస్సులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం కోసం 759 బస్సులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులలో 9 కోట్ల 46 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించగా 5 కోట్ల 78 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి మహాలక్ష్మీ స్కీంను వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. పెరిగిన ప్రయాణికులకు గాను ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను సమయాలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా 20 రూట్లలో ప్రజలు ప్రజాపతినిధుల విజ్ఞప్తుల మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ప్రయాణికులు ప్రయాణం పెరిగిందని హైదరాబాద్, కరీంనగర్, మరికొన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు త్వరలో 42 బస్సులు రానున్నట్లు ఆర్ఎం తెలిపారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభించినప్పటి నుంచి వరంగల్ రీజియన్‌కు రూ.554 కోట్ల 63లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మహాలక్ష్మీ ప్రయాణీకుల ద్వారా రూ.293 కోట్ల 58లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రస్తుతం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాను

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా

నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు



ఆన్‌లైన్‌లో రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రశీదు

కేయూ క్యాంపస్, జూలై 29 : కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత డిసెంబరులో వర్సిటీ డిగ్రీ కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్‌లో పరీక్షల ఫలితా లను విడుదల చేశారు. అయితే చాలా మంది విద్యా ర్థులు తమ పరీక్షల ఫలితాలను రీవాల్యూవేషన్ చేయాలని దరఖాస్తులు వర్సిటీ అధికారులకు చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 305 చెల్లిం చారు. వర్సిటీకి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెల రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ తమ సబ్జెక్టులలో రీవాల్యూవేషన్, రీ కౌంటింగ్ చేసి ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు తాము దరఖాస్తులు చేసుకున్నటువంటి సబ్జెక్టు మంచిగా రాసినట్లయితే రీవాల్యూవేషన్, రీకౌంటింగ్‌లో బేని ఫిట్ పొందుతారు. లేక నాట్ బేనిఫిట్ అని ఫలి తాలు వస్తాయి.

రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా వర్సిటీ అధికారులకు ఫలితాలను వెల్లడించాలనే ఊసే రావడం లేదు. దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి నెల 15 రోజుల్లో ఫలితాలను వెలువరించాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలి తాల కోసం విద్యార్థులు కాలం గడుస్తుండటంతో కళ్ళు కాయలు కాసేలా చూస్తున్నారు.

6వ సెమిస్టర్‌ది ఇచ్చారు.. మిగతావి మరిచారు...

ఉన్నత విద్య ప్రవేశాలకు వేళ్ళే విద్యార్థుల వెనులుబాటును ఆలోచించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డిగ్రీ 6వ సెమిస్టర్ రీవాల్యూ వేషన్ ఫలితాలను ఇచ్చారు. మిగతా 1, 2,3, 4, 5వ సెమిస్టర్ డిగ్రీ కోర్సులు ఫలితాలను మరిచారు. అయితే 1 నుంచి 5వ సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జె క్టు తప్పిన విద్యార్థి ఉన్నట్లయితే ఉన్నత విద్య ప్రవే శాలకు అర్హత కోల్పోతారు. దీన్ని గుర్తించని వర్సిటీ అధికారులు విద్యార్థులకు లాభం చేశామనే ఉద్దేశ్యం తో కేవలం 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితా లను వెల్లడించి చేతులు దూలుపుకోవడంపై విద్యా ర్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తాం..

ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

వారం రోజుల్లో డిగ్రీ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను విడుదల చేస్తాం. రీవాల్యూవేషన్ ప్రాసెస్ పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దు. వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేస్తాం.



కదంబ పూలతో రుద్రేశ్వరుడికి విశేష అభిషేకం

హనుమకొండ కల్చరల్, జూలై 29 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివప్రీతికర సోమవారం, ఆశాఢ బహుళ నవమి విశేష పూజలు నిర్వహించారు. సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ వంద మంది పుణ్యదంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సహజసిద్ధమైన కదంబ వృక్ష పూలతో శివనామజపంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వాసన లేని పూలతో రుద్రేశ్వరున్ని అభిషేకించడం వల్ల భక్తులకు ప్రకృతిపర రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మణికంఠ శర్మ, ఇతర అర్చకులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేంద్రాలు

వైన్‌షాపుల వద్ద ఇష్టానుసారంగా పార్కింగ్‌లు

ఇబ్బందులు పడుతున్న జనం.. పట్టించుకోని పోలీసులు



వైన్స్‌ల వద్ద బారులుదీరిన మందుబాబులు, అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

రెడ్డికాలనీ, జూలై 29: ప్రధాన రోడ్ల వెంబడి గల వైన్‌షాపులు న్యూసెన్స్‌కు అడ్డాలుగా మారాయి. వైన్‌షాపుల ఎదుట ఇష్టానుసారంగా వాహనాలు పార్కు చేయడంతోపాటు అటుగా వెళ్లే ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన దుస్థితి నెలకొంది. పగలంతా సాధారంగా కనిపించే వైన్‌షాపులు.. సాయంత్రం అయిందంటే చాలు.. గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. కాస్త చీకటిపడగానే మందుబాబులు ఎలాంటి జంకు, భయం లేకుండా వైన్‌షాపుల ఎదుట మద్యం సేవించి ఖాళీ సీసాలను రోడ్లపైనే వేస్తున్నారు. రోడ్ల వెంట తాగుతూ అటుగా వెళ్లే మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. పాఠశాలలు, ఆఫీసులు, షాపింగ్ మాళ్లలో పనిచేసి తిరిగి ఇళ్లకు వెళ్లే మహిళలు మందుబాబుల ఆగడాలతో వైన్‌షాపుల ముందు నుంచి వెళ్లేందుకు జంకుతున్నారు. కేయూ జంక్షన్ - పెద్దమ్మగడ్డ రహదారిలో ఉన్న వైన్‌షాపుల ఎదుట సాయంత్రం అయిందంటే మందుబాబులతో రోడ్లు కిక్కిరిసిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలను రహదారి వెంబడి పార్కింగ్ చేస్తుండడంతో లారీలు, బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు మద్యం ప్రియులతో సాధారణ వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రమాదకరంగా మూలమలుపు

యాదవనగర్ సమీపంలోని మూలమలుపు వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఓ బార్ ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారిందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం లారీలు, బస్సులు, ఇతర వాహనాలతో రద్దీగా ఉండే రహదారికి ఆనుకొని బార్ ఉండడంతో మద్యం ప్రియులు రోడ్డు వెంబడి వాహనాలు పార్కింగ్ చేయడమే అందుకు కారణమని చెబుతున్నారు. బార్ షాపు ఎదుట నిత్యం ఎదో ఒక ప్రమాదం జరుగుతోందని, నెలలో ఇద్దరు ముగ్గురు ప్రమాదంలో మృతి చెందుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇష్టానుసారంగా చేసే వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి, న్యూసెన్స్ కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్ కుమార్

డీజిల్ షెడ్ డీఎంఈగా వెంకట్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

కాజీపేట, జూలై 29 : కాజీపేట డీజిల్‌షెడ్ నూతన డీఎంఈగా వెంకట్ కుమార్‌ను నియమిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు ఈ మేరకు ఆయన సోమవారం కాజీపేట డీజిల్‌షెడ్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇతడు హైదరాబాద్‌లో సీనియర్ డీఎస్‌వోగా విధులు నిర్వర్తించి కాజీపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇంతకుముందు పనిచేసిన స్వరాజ్ కుమార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌కుమార్‌ను రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, కార్మిక నాయకులు, ఎస్‌కె జానిమియా, వేదప్రకాశ్, రాజేశ్వర్‌రావు, రైల్వే కార్మికులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

గ్రానైట్ లారీని అడ్డుకున్న స్థానికులు



లారీని అడ్డుకున్న స్థానికులు

కాజీపేట, జూలై 29: కాజీపేట 63వ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ వాసులు గ్రానైడ్ లోడ్ లారీని సోమవారం తెల్లవారుజామున అడ్డుకున్నారు. లారీకి అడ్డంగా కూర్చున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడారు. తమ కాలనీలలో రాత్రంతా క్వారీకి సంబంధిన లారీలు లోడ్‌లతో వెళ్లడం వల్ల శబ్దకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. లారీల రాకపోకలతో రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. ఈ హెవీలోడ్ లారీలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. క్వారీలీజ్ ముగిసినా మళ్లీ రెన్యూవల్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని క్వారీ రిన్యూవల్ నిలిపివేయాలని కోరారు.

విద్యార్థి సంఘాలపై ఆరోపణలు తగదు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహిస్తూ వారి అక్రమాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తీరును ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఏ. హకీంనవీద్ తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే కళాశాలలకు ఒకే ప్రాంగణంలో అనుమతి పొంది వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు భవనాల్లో నిబంధనలకు కళాశాలలు నడుపుతూ ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాలపై దాడులు చేయడం, తప్పుడు ఆరోపణలు చేయడం హేమమైనచర్యగా అభివర్ణించారు. విద్యార్థి సంఘాల నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తున్న టీపీజేఎంఏ నాయకులు వారి వైఖరిని వెంటనే మార్చుకోవాలని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని ప్రైవేటు కళాశాలలు నిబంధనల మేరకే నడుస్తున్నాయని చెబుతున్న టీపీజేఎంఏ నాయకులు విద్యార్థి సంఘాలతో బహిరంగ చర్చకు రావాలని నాయకులకు సవాలు విసిరారు. విద్యార్థి సంఘాలపై చేసిన ఆరోపణలను వారు బేషరతుగా వెనక్కు తీసుకోవాలని హకీం ప్రకటనలో డిమాండ్ చేశారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరి వెంకన్న మాదిగ



అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డెపల్లి, జూలై 29: కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పిస్తామని నమ్మబలికిన బీజేపీ ప్రభుత్వం తమ హామీని విస్మరించి మాదిగ సమాజాన్ని మోసం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి సాతూరి వెంకన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలు మారి బాలస్వామి, హనుమకొండ జిల్లా కన్వీనర్ గంగారపు సుమన్‌కుమార్‌లు అన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశంలోనే ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించి మాదిగ సమాజానికి న్యాయం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగా ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే మాదిగల మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ వద్ద ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా తాత్సారం చేస్తున్నదని దుయ్యబట్టారు. దశాబ్దాల కాలంగా వర్గీకరణ అంశాన్ని పాలకులు నాన్చుతూ ఉండడం వల్ల మాదిగ సమాజం విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎంతో నష్టపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. ఆగస్టు 9న ఢిల్లీలో జరిగే మాదిగల మహా ధర్నాకు మాదిగలు, దాని ఉపకులాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు దామెర కరుణ, మస్కె సదయ్య, సాతూరి కోమల, చిలుక గోపి, తూముల రాజ్‌కుమార్, కొడవటి తిరుపతి, గంగారపు యశ్వంత్, ఇలాపాక దయాసాగర్, చిలుక రాజేష్, లక్మాల ప్రకాష్, తుడుముల నందకిశోర్, కె. సత్యకుమారి, ఇమ్మడి ప్రసన్న పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దపెండ్యాలలో పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ధర్మసాగర్, జూలై 29 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య శాఖ సబ్ యూనిట్ అధికారి పరంజ్యోతి అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో సోమవారం పరంజ్యోతి ఆధ్వర్యంలో గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఇంటింటికి తిరిగి మురుగు కాలువల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని, ఇండ్లల్లో ఉన్న నీటి తొట్లలో నిల్వ ఉంచిన మురుగునీటిని గ్రామ పంచాయతీ సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సబ్ యూనిట్ అధికారి పరంజ్యోతి, సూపర్‌వైజర్ ప్రసన్న ,హెల్త్ అసిస్టెంట్ సత్య, కరుణాకర్, ప్రకాశ్‌కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం రజిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మత్స్యకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొడుగు వెంకట్

కాళోజీ జంక్షన్, జూలై 29: జిల్లాలోని కమలాపురం మండలానికి చెందిన మౌటం రాజేష్ అనే మత్స్యకారుడు గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి కాళ్లకు వల చుట్టుకొని ఈ నెల 28న ప్రమాదవశాత్తు మృతి చెందాడని ప్రభుత్వం అతని కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ కోరారు. సోమవారం హనుమకొండలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ ముదిరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గొడుగు వెంకట్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం వెంటనే రూ. 10 లక్షలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దదిక్కు చనిపోవడంతో మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రాజేష్ కుటుంబం రోడ్డున పడిందని ఆయన అన్నారు. అనాథలైన కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లును మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మౌటం పవన్, కల్యాణ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వీడ్కోలు సన్మానం



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

ఐనవోలు, జూలై 29: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్సై పదోన్నతిపై వెళ్తున్న రమణారెడ్డి అదేవిధంగా బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ నాగరాజులకు వీడ్కోలు సన్మానం సన్మానించారు. ఎస్సై పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొని సన్మానించారు.

బదిలీ వీడ్కోల సభ

వరంగల్ కార్పొరేషన్, జూలై 29: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో సుదీర్ఘ కాలం పాటు సేవలందించి హైదరాబాద్‌కు బదిలీపై వెళుతున్న సిటీ ప్లానర్ బి. వెంకన్నకు ఆదివారం హనుమకొండ జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ బదిలీ వీడ్కోల సన్మాన సభ నిర్వహించారు. గోర్ బంజార పలు సంఘాల నాయకులు వెంకన్నను కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. గోర్‌బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. బాలాజీ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాగ్యానాయక్, ఫూల్‌సింగ్ చౌహాన్, కిరణ్, హట్యానాయక్, శంకర్‌నాయక్, తేజావత్ బాలాజీ, జవహర్‌లాల్, ఈర్యానాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ జోన్ రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలి

• అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్

• కమిషనర్, మంత్రికి వినతి పత్రాల అందజేత



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న భద్రకాళి బండ్ కమిటీ సభ్యులు (ఫైల్)

వరంగల్ కార్పొరేషన్, జూలై 29: భద్రకాళి ట్యాంక్ పక్కన ఉన్న ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) జోన్ నుంచి రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలని భద్రకాళి బండ్ ఏరియా అభివృద్ధి కమిటీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే కమిటీ తరుపున తాము గత సోమవారం బల్దియాలో జరిగిన గ్రీవెన్ సెల్‌లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు, అలాగే ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసి వినతి పత్రాలు అందజేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్ సోమవారం మాట్లాడుతూ 1971లో వరంగల్ మాస్టర్ ప్లాన్ అనుమతించబడిందని, ఫోర్ షెడ్ బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ జోన్‌గా ప్రకటించారన్నారు. ఫోర్‌షెడ్ బండ్ నివాసుల నుంచి ఈ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలని అధికారులను కలిసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనిన్నారు. బలహీన వర్గాల కుటుంబాలకు 36 ప్లాట్లు కేటాయించారని 24 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వారు నివసిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అనుమతుల ప్రకారం బల్దియా నుంచి భవన నిర్మాణ అనుమతులు, సీసీ రోడ్లు, బీ-7 రోడ్లు, విద్యుత్ స్తంబాలు, డ్రైనేజీలు నిర్మించబడ్డాయని చెప్పారు. ఎఫ్‌టీఎల్ డిసిగ్నేషన్‌ను ఈ ప్రాంతం నుంచి తొలగించేందుకు లేక్ ప్రొటక్షన్ కమిటీని కోరామన్నారు. మర్రి రవీందర్ వెంట కమిటీ నాయకులు జలంధర్, శ్రీహరి, శ్రీనాథ్, సంజీవచారీ, శ్రీనివాస్, సాయిలు, అవినాష్ ఉన్నారు.

'విపక్ష రాష్ట్రాలకు బడ్జెట్‌లో మొండిచేయి'



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

గిర్మాజిపేట, జూలై 29: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీజేపీ పాలిత, మద్దతు రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మొండిచేయి చూపిందని ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లేపు ఉపేందర్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. సోమవారం వరంగల్ నగరంలోని అండర్‌బ్రిడ్జి సమీపంలో ఎంసీపీఐ(యు) పార్టీ జిల్లా కార్యాలయ ఓంకార్ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున అధ్యక్షతన పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల ఆదాయాల ప్రాతిపదికన కేంద్రం బడ్జెట్‌లో ఆయా రాష్ట్రాలకు నిధులు కేటాయించాల్సి ఉండగా, మోదీ ప్రభుత్వం విపక్ష రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో అన్యాయం చేసిందని ఆరోపించారు. వ్యవసాయ, విద్యా రంగాలకు నిధుల కేటాయింపు నామమాత్రమేనని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేయవచ్చంటూ కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం భారత లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

సమావేశంలో పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ కార్యదర్శి హంసారెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవిందర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాస్ సావిత్రి, రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ఇంద్రారెడ్డి, ఉస్మాన్, బుచ్చయ్య, కిషన్, రమేష్, రాజేశ్వరావు, ప్రభాకర్,బ ్రద్రయ్య, రవిందర్, బాపురావు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో కేంద్ర సచివాలయ బృందం



గంగదేవిపల్లిలో కేంద్ర సచివాలయ బృందం

గీసుగొండ, జూలై 29: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామాలైన గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలను కేంద్ర సచివాలయ గ్రూప్ 1 బృందం ఫౌండేషన్ ట్రేయినింగ్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గంగదేవిపల్లిలో గ్రామాభివృద్ధి, ప్రజల స్వచ్ఛంధ భాగస్వామ్యం, అభివృద్ధి కమిటీల పనితీరును బృందానికి జిల్లా ట్రేయినింగ్ మేనేజరు కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు విక్రాంత్‌పునియా, అనిత్ కుమార్‌బర్తీ, ప్రదీప్ గుర్జార్, అమిత్‌కుమార్, సత్యంసింగ్ పాల్, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐ సాంబయ్య, ఏపీవో చంద్రకాంత్, ఏఎస్‌వో సతీష్, రమేష్, రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల సామాజిక బాధ్యత గొప్పది

సామాజిక బాధ్యతలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. సోమవారం సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలంకు చెందిన స్వయం సహాయక మహిళలు గంగదేవిపల్లిని సందర్శించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నవీన్, పూర్ణిమ, మంజుల, రమ, రజిత, విమల, రేణుక సంధ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులు అర్పిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, జూలై 29: మండలకేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పల్లకొండ చిన్నమల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాలుడు అబ్దుల్ ఖాదీర్ కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట పరామర్శలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

అపరిశుభ్రత మధ్య వికాస్ నగర్

చెత్తను తొలగించాలని కాలనీ వాసుల వేడుకోలు




వికాస్ నగర్ రోడ్డు నంబర్ 23లో పేరుకుపోయిన చెత్త

వడ్డెపల్లి, జూలై 29: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ వికాస్ నగర్ దుర్గంధం గుప్పిట్లో కూరుకుపోయింది. మహా నగర పాలక సంస్థ సిబ్బంది పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతాన్నాయి. చెత్త పేరుకుపోయి తాము రోగాల భారిన పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.

చెత్తతో ప్రబలుతున్న వ్యాధులు..

వికాస్ నగర్ మెయిన్ రోడ్ నంబర్ 23 వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయి పక్షం రోజులు దాటింది. నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి చెత్త తొలగించాలని కాలనీవాసులంతా విన్నవించుకున్నా, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. చెత్త కుప్పలను తొలగించకపోవడం చెత్తలోని వ్యర్థ పదార్థాలు కుళ్లిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పల నుంచి వెలువడే దుర్గంధంతో తాము రోగాలు, విషజ్వరాల భారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

విషజ్వరాలు ప్రబలుతున్నాయి



చెత్త కుప్పలు ప్రధాన రహదారిపై పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో విష జ్వరాలు, డెంగ్యూ వ్యాధులు ప్రబలుతున్నాయి. నగర పాలక సంస్థ సిబ్బందికి విన్నవించుకున్నా చెత్తకుప్పలను తొలగించడం లేదు. అధికారులు స్పందించి చెత్తకుప్పలను వెంటనే తొలగించాలి.

- అల్లం మల్లికార్జున్‌రావు, వికాసనగర్..

పెయిన్ రిలీఫ్

వేడి వర్సెస్ చల్లదనం

నొప్పులను తగ్గించుకోవడం కోసం కొందరు వేడి కాపడం సూచిస్తారు, ఇంకొందరు ఐస్ ప్యాక్ సూచిస్తారు. ఈ రెండింటిలో ఏది ఎక్కువ ఫలితాన్నిస్తుంది. తెలుసుకుందాం!

వేడి, చల్లదనం... ఈ రెండూ సహజసిద్ధ నొప్పినివారిణి చిట్కాలు. అయితే వేడి కాపడం ఎటువంటి నొప్పులను తగ్గిస్తుందో, చల్లని పట్టు ఏ బాధను దూరం చేస్తుందో తెలుసుకోవడం అవసరం. కొన్ని నొప్పులు చల్లదనంతో తగ్గితే, మరికొన్ని వేడితో ఉపశమనాన్ని అందిస్తాయి. సమస్య ఆధారంగా పరిష్కారాన్ని ఎంచుకోవాలి.

ఆర్థ్రయిటిస్: మోకాళ్లు, భుజాలు, మేచేతులు, వేళ్ల కీళ్లలో మృదులాస్థి అరిగిపోవడం మూలంగా తలెత్తే నొప్పులు వేడి కాపడంతో తగ్గుముఖం పడతాయి. బిగుసుకుపోయిన కీళ్లు, కండరాలు వేడి కాపడంతో వదులై, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

గౌట్: కాలి బొటనవేలు, చీలమండలం, మడమ, మోకాలు, మణికట్టు, వేళ్లు, మోచేతుల్లోని తీవ్రమైన ఇన్‌ఫ్లమేటరీ ఆర్థ్రయిటిస్‌కు కోల్డ్ కంప్రెషన్ చక్కని పరిష్కారం.

తలనొప్పి: తలలోని నాడులు, రక్తనాళాల వల్ల తలెత్తే తలనొప్పులు లేదంటే మెడలోని కండరాల నొప్పులకు రెండు రకాల కాపడాలు అవసరమవుతాయి. కత్తితో పొడుతున్నట్టు బాధించే పోటులను ఐస్‌తో, మెడ నొప్పులను వేడి కాపడంతో తగ్గించుకోవచ్చు.

బెణుకులు: తొడ, వెన్ను, పిక్కల్లోని కండరాలు పట్టేసినా, టెండాన్లు గాయపడినా, లక్షణాల ఆధారంగా వేడి, చల్లదనాల పట్టులను ఎంచుకోవాలి. వాచి, నొప్పితో బాధించే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించుకోవడం కోసం ఐస్‌ను ఉపయోగించాలి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గిన తర్వాత బిగుతును సడలించడం కోసం వేడి కాపడం ఉపయోగపడుతుంది.

గాయాలు: మోకాలు, మోచేతులు, యాంకిల్, పాదాల్లో లిగమెంట్లు దెబ్బతిన్నప్పుడు ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, నొప్పి అదుపులోకి రావడం కోసం ఐస్‌తో పట్టు వేయాలి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గిన తర్వాత బిగుతును సడలించడం కోసం వేడి కాపడం పెట్టుకోవాలి.



టెండనైటిస్: భుజాలు, మోచేతులు, మోకాళ్లు, మణికట్టు మడమల్లోని కీళ్లతో అనుసంధానమై ఉండే టెండాన్లు ఎక్కువగా శ్రమకు గురవడం వల్ల తలెత్తే నొప్పులకు ఐస్‌తో పట్టు వేయాలి.

టెండినోసిస్: కీళ్లతో అనుసంధానమై ఉండే టెండాన్లు ఇరిటేట్ అయి, బిగుసుకుపోయినప్పుడు కలిగే అసౌకర్యాన్ని తొలగించుకోవడం కోసం, వేడి కాపడం పెట్టుకోవాలి.

ఏం జరుగుతుంది?

మంచుతో రక్తనాళాలు కుంచించుకుపోయి గాయాలు, దెబ్బల నొప్పి తగ్గుతుంది. ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొచ్చి గాయం తీవ్రత తగ్గుతుంది. ఆర్థ్రయిటిస్‌కూ వేడికాపడం పెట్టడానికి కారణం వేడితో రక్తప్రవాహం పెరిగి, బిగుసుకున్న కండరాలు, కీళ్లు వదులవుతాయి. దాంతో ఉపశమనం దక్కుతుంది. తీవ్రమైన గాయాలు, ఎముకలు చిట్లిన, విరిగిన సందర్భాల్లో నొప్పిని తగ్గించుకోవడం కోసం ఎలాంటి కాపడాలు ఉపయోగించకూడదు. ఇలా చేయడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, గాయం తగ్గే వేగం నెమ్మదిస్తుంది.



పెయిన్స్

మెడనొప్పి, నడుము నొప్పి, తల నొప్పి... అందర్నీ ఏదో ఒక సందర్భంలో వేధించే నొప్పులే ఇవన్నీ! అయితే ఇవే నొప్పులు సర్జరీ వరకూ దారి తీయకుండా ఉండాలంటే వైద్యులను కలిసి మూల కారణాన్ని కనిపెట్టాలి.

అలవాట్లతోనే అగచాట్లు

ప్రతి నొప్పికీ సర్జరీ అవసరం ఉండదు. సర్జరీకి దారి తీసేటంత రుగ్మతలు ఏ కొద్ది మందికో ఉంటాయి. ఎముకలు, కండరాల నొప్పులను నాడీసంబంధ నొప్పులుగా పొరపాటు పడుతూ ఉంటాం. కానీ నిజానికి ఆ నొప్పుల కారణాలు మన అలవాట్లలోనే దాగి ఉంటాయి. కాబట్టి నొప్పి, అసౌకర్యాలకు మూల కారణాల కోసం మనల్ని మనం ఒకసారి తరచి చూసుకోవాలి. గంటల తరబడి కంప్యూటర్లకు అతుక్కుపోవడం, కూర్చున్నప్పుడు శరీర భంగిమ కుదురుగా లేకపోవడం లాంటి వాటి వల్ల మెడ నొప్పి, చేతుల్లో తిమ్మిర్లు సహజం. ఇదే పరిస్థితి తీవ్రమైతే, స్పర్శ కోల్పోవడం, చేతులు బలహీనమై వస్తువులను బలంగా పట్టుకోలేకపోవడం, కండరాలు క్షీణతకు గురవడం జరుగుతుంది. కొందరికి నడకలో కూడా ఇబ్బంది తలెత్తుతుంది. మూత్ర విసర్జన కూడా కష్టం కావచ్చు.

మెడనొప్పి ఎందుకు?

కంప్యూటర్లతో పాటు, తల వంచి ఫోన్లకు అతుక్కుపోయి కూర్చునేవాళ్లు, దూర ప్రయాణాలు చేసేవాళ్లు, మెడ ఆధారంగా బరువులు లేపేవాళ్లను మెడనొప్పి వేధిస్తుంది. నిజానికి 70% మందిలో చిన్నపాటి మార్పులతో ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. కూర్చునే భంగిమ సరిదిద్దుకోవడం, ప్రయాణాల్లో నెక్ సపోర్ట్ పిల్లోలు వాడుకోవడం, కంప్యూటర్ల ముందు పనిచేసేవాళ్లు తరచూ లేచి నడుస్తూ ఉండడం, మెడ కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయడం ద్వారా మెడ నొప్పిని పూర్తిగా తగ్గించుకోవచ్చు. అయితే ఫిజియోథెరపీ, మందులతో పాటు, ఇతరత్రా జీవనశైలి మార్పులు చేసుకున్నప్పటికీ సమస్య తగ్గకపోతే, దాన్ని నాడీ సంబంధ సమస్యగా అనుమానించాలి. ఈ సమస్యను కూడా మందులతో, విశ్రాంతితో చాలా మేరకు తగ్గించుకోవచ్చు. అప్పటికీ తగ్గనప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది. వెన్నులో డిస్క్ ప్రొలాప్స్, ఇన్‌ఫెక్షన్లు, ట్యూమర్ల వల్ల కూడా ఇవే లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి తేలికపాటి చికిత్సతో లక్షణాలు తగ్గుముఖం పట్టనప్పుడు వైద్యులను కలవాలి.

ఈ తలనొప్పులు భిన్నం



తలనొప్పులన్నీ బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించినవి కావు. కేవలం ఒక శాతం కంటే తక్కువ మందిలోనే బ్రెయిన్ ట్యూమర్స్ ఉంటూ ఉంటాయి. ఎలాంటి ట్యూమర్లు, ఇన్‌ఫెక్షన్లు లేకపోయినా తలెత్తే తలనొప్పులు ప్రైమరీ హెడేక్స్. వీటిలో అత్యంత సాధారణమైనది మైగ్రేన్. చాలా మందిలో మైగ్రేన్ జీవనశైలి మార్పులతో ముడిపడి ఉంటుంది. ఎక్కువసేపు మొబైల్ చూడడం, రాత్రుళ్లు ఎక్కువ సమయాలు మేల్కొని ఉండడం, జంక్ ఫుడ్, ధూమపానం, ఆల్కహాల్, ఒత్తిడి, ఆందోళన, కెఫీన్ ఉన్న పానీయాలు ఎక్కువగా తాగడం, ఊబకాయం... ఇవన్నీ మైగ్రేన్‌కు దారితీసే కారణాలే! కొందరికి తలనొప్పి ఒకవైపే వేధిస్తుంది. వాంతులు కూడా వేధిస్తూ ఉంటాయి. కొందరు శబ్దాలను వినలేరు. ఇంకొందరు వెలుగును భరించలేరు. ఇలాంటివాళ్లు మైగ్రేన్‌ను ట్రిగ్గర్ చేసే కారణాలను వాళ్లంతట వాళ్లే కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. అయినా తగ్గకపోతే తలనొప్పి ఎపిసోడ్స్ రాకుండా ఆపే మందులతో పాటు, తలనొప్పి వచ్చినప్పుడు తగ్గించే మందులు కూడా వాడుకుంటూ ఉండాలి.

నడుము నొప్పి అందుకే

నడుము నొప్పికి ఎన్నో కారణాలుంటాయి. శరీర భంగిమ లోపాలతో పాటు, పుట్టుకతో వెన్నులో సమస్య ఉండవచ్చు. వెన్నుపూసలు బలహీనపడి ఉండొచ్చు. ఫ్రాక్చర్స్ ఉండొచ్చు. ఇలా లంబార్ స్పాండిలోసిస్‌లో సమస్యలు, సయాటికా లాంటివి తగ్గకుండా పెరుగుతున్నప్పుడు, ఎమ్మారై, ఎక్స్‌రేలతో కారణాన్ని కనిపెట్టి సరిదిద్దుకోవాలి. ఒకవేళ నడుము నొప్పికి కారణం డిస్క్ ప్రొలాప్స్ అయితే, ఎండోస్కోపిక్ సర్జరీతో, చిన్నపాటి కోతతో, సమస్యను సరిదిద్దుకుని, సర్జరీ జరిగిన మరుసటి రోజే ఇంటికెళ్లిపోయే వెసులుబాట్లు అందుబాటులోకొచ్చాయి. ఫ్రాక్చర్ ఉంటే, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీతో సరిదిద్దుకోవచ్చు.

వెన్ను సర్జరీ 5% మందికే!

సాధారణంగా వెన్ను సర్జరీ అందరికీ అవసరం పడదు. సర్జరీతోనే సమస్యను సరిదిద్దే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రమే, అంతిమ ప్రత్యామ్నాయంగా వైద్యులు సర్జరీని ఎంచుకుంటూ ఉంటారు. వీపు నొప్పి, నడుము నొప్పి, సయాటికాలతో బాధపడేవాళ్లు డాక్టరు దగ్గరకు వెళ్తే ఆపరేషన్ చేయించుకోవలసివస్తుందనే భయంతో గృహవైద్యాలను అనుసరిస్తూ, సర్జరీ వరకూ తెచ్చుకుంటూ ఉంటారు. ప్రారంభంలోనే వైద్యులను కలిస్తే తేలికపాటి చికిత్సతోనే సమస్యను పరిష్కరించుకోవచ్చు. వెన్నుపూసలో నుంచి కాళ్లలోకి దారితీసే సయాటికా నాడి ఒత్తిడికి లోనైనప్పుడు సయాటికా నొప్పి వేధిస్తుంది. దీనికి కూడా డిస్క్ ప్రొలాప్స్, ఇన్‌ఫెక్షన్లే కారణం. కారణం తీవ్రత మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. ఫిజియోథెరపీ, మందులతోనే సమస్యను అదుపు చేయగలిగే వీలుంటుంది. కాళ్లలో బలహీనత, స్పర్శ కోల్పోవడం, మూత్రవిసర్జన మీద నియంత్రణ కోల్పోవడం లాంటి తీవ్ర లక్షణాలు బయల్పడినప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది.

డాక్టర్ బాల రాజశేఖర్
సీనియర్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్



ఆయుర్వేదం

ఆరోగ్యంగా, చురుగ్గా, దృఢంగా ఉండాలంటే తినే ఆహారంతో పాటు, ఆహారం తిన్న తర్వాత చేసే పనుల మీద కూడా దృష్టి పెట్టాలి. మరీ ముఖ్యంగా భోజనం చేసిన తర్వాత వంద అడుగులు నడవాలని ఆయుర్వేదం సూచిస్తోంది.

షట్‌పావ్లీ మరాఠీ పదం. షట్ అంటే వంద అనీ, పావ్లీ అంటే అడుగులు అని అర్థం. వంద అడుగుల నడక జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది కాబట్టి ప్రాచీన కాలంలో ఈ అలవాటును అనుసరించేవారు. భోజనం తర్వాత వంద అడుగులు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు, క్యాలరీలు కూడా కరుగుతాయి.



రక్తంలోని చక్కెరలు అదుపులో ఉండి, తిన్న ఆహారం జీర్ణమై, పోషకాలు శోషణ చెందుతాయి. భోజనం తదనంతర నడకతో రక్తంలోని చక్కెర మోతాదులు తగ్గుతాయనీ, తద్వారా టైప్2 మధుమేహ ప్రభావం శరీరం మీద పడకుండా ఉంటుందని జోర్నల్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది. అయితే కొందరికి భోజనం తర్వాత కునుకు తీసే అలవాటు ఉంటుంది. ఇలా కునుకు తీయడం వల్ల శరీరంలో కఫం, మేదం (కొవ్వు) పేరుకుని, మెటబాలిజం నెమ్మదిస్తుందని, తద్వారా తిన్న ఆహారం పూర్తిగా జీర్ణం కాదనీ ఆయుర్వేదం చెప్తోంది.

భోజనం తర్వాత ఈత, దూరాలు నడవడం, ప్రయాణం, వ్యాయామం చేయడం వల్ల వాతం పెరిగి, జీర్ణప్రక్రియకు అవరోధం ఏర్పడుతుంది. దాంతో కడుపుబ్బరం, శోషణ అసంపూర్తిగా జరగడం, పొట్టలో అసౌకర్యం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి ఈ అలవాట్లకు స్వస్తి చెప్పాలి.

బిజినెస్

బ్లాక్‌స్టోన్ చేతికి హల్దీరామ్ స్నాక్స్?

» 51% వాటా రూ.40 వేల కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. ప్రముఖ స్నాక్స్ కంపెనీ హల్దీరామ్ ఈక్విటీలో 51 శాతం వాటా కోసం ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్ జరుపుతున్న చర్చలు కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఇందుకోసం హల్దీరామ్ ప్రమోటర్లకు రూ.40,000 కోట్లు చెల్లించేందుకు బ్లాక్‌స్టోన్ సంస్థ సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే రెండు కంపెనీలు దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ లెక్కన హల్దీరామ్ మార్కెట్ విలువను రూ.78,000 కోట్లుగా నిర్ధారించినట్టు భావిస్తున్నారు. ఈ కొనుగోలు తర్వాత కూడా హల్దీరామ్ బ్రాండ్ మీదే కంపెనీ ఉత్పత్తులు కొనసాగుతాయి. అందుకు హల్దీరామ్ ప్రమోటర్లకు బ్లాక్‌స్టోన్ ఏటా కొంత రాయల్టీ చెల్లించేందుకూ అంగీకరించినట్టు సమాచారం.

రూ.40,000 కోట్ల పెట్టుబడులు

» హైదరాబాద్‌లో డేటా సెంటర్: పవర్‌గ్రిడ్

ముంబై: ప్రభుత్వ రంగంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భారత్-పశ్చిమాసియా దేశాల మధ్య విద్యుత్ సరఫరా కోసం సముద్ర గర్భ ఉపరితలం మీదుగా హై ఓల్టేజీ డైరెక్ట్ కరెంట్ కేబుల్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందు కోసం ఒమన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలకు చెందిన కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు పవర్‌గ్రిడ్ సీఎండీ ఆర్‌కే త్యాగి చెప్పారు. వచ్చే ఆరేళ్లలో ఈ కేబుల్ ఏర్పాటు కోసం రూ.35,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. దీనికి తోడు ప్రస్తుతం మనేసర్‌లో ఉన్న డేటా కేంద్రానికి తోడు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లోనూ డేటా కేంద్రాలు ఏర్పాటు చేసే యోచన ఉందని త్యాగి చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,160 ▼	63,400 ▼	89,500 ▲
ముంబై	68,800 ▲	63,021 ▲	82,192 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	106
కర్నూలు	94	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

2026 నాటికి జీడీపీలో 20%

భారత డిజిటల్ ఎకానమీపై ఆర్‌బీఐ నివేదిక

ముంబై: ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పదో వంతుగా (10 శాతం) ఉన్న డిజిటల్ ఎకానమీ వాటా.. 2026 నాటికి రెట్టింపై ఐదో వంతుకు (20 శాతానికి) చేరుకోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ డిజిటల్ విప్లవంలో భారత్ అందరి కంటే ముందుందని రిపోర్టు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కరెన్సీ అండ్ ఫైనాన్స్‌పై రిపోర్టును ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసింది. అందులోని మరిన్ని ముఖ్యాంశాలు..



- భారత్ డిజిటల్ చెల్లింపులను వేగవంతం చేసేందుకు ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్)ని విరివిగా వినియోగించుకోవడమే కాకుండా బయోమెట్రిక్ ధ్రువీకరణతో కూడిన ఇండియా స్టాక్, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), మొబైల్ కనెక్టివిటీ, డిజిటల్ లాకర్స్, కంటెంట్ బేస్డ్ డేటా షేరింగ్ వంటి విజయోత్సవాలనూ జరుపుకుంటోంది.
- డిజిటల్ విప్లవం బ్యాంకింగ్ మౌలిక వసతులు, ప్రత్యక్ష నగదు బదిలీ, పన్ను వసూళ్లకు అవసరమైన పబ్లిక్ ఫైనాన్స్ నిర్వహణ వ్యవస్థ సామర్థ్యాన్ని భారీగా పెంచింది.
- చురుకైన ఈ-మార్కెట్లు వికసిస్తుండటంతో పాటు వాటి పరిధిని వేగంగా విస్తరించుకుంటున్నాయి. గడిచిన దశాబ్ద కాల వృద్ధి రేటును బట్టి చూస్తే, రెండేళ్లలో జీడీపీలో డిజిటల్ ఎకానమీ వాటా రెట్టింపు కానుంది.
- దేశంలో డిజిటల్ విప్లవానికి చాలా అంశాలు తోడయ్యాయి. గత ఏడాది దేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి 55 శాతంగా ఉన్నప్పటికీ, ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య గడిచిన మూడేళ్లలో 19.9 కోట్ల మేర పెరిగింది. ఒక జీబీ డేటా వినియోగ ధర రూ.13.32 (0.16 డాలర్లు)గా ఉంది. ప్రపంచంలో ఇదే అతి తక్కువ ధర. ప్రపంచంలో అత్యధికంగా మొబైల్ డేటా వినియోగమవుతున్న దేశాల్లో భారత్ ఒకటి. గత ఏడాదికి గాను ఒక్కో వినియోగదారు నెలలో వినియోగించే మొబైల్ డేటా సగటు 24.1 జీబీగా నమోదైంది.
- ప్రస్తుతం దేశంలో 75 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తుండగా.. 2026 నాటికి ఈ సంఖ్య 100 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. వచ్చే ఐదేళ్లలో భారత్ రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ల తయారీదారుగా అవతరించే అవకాశం ఉంది.
- ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థగా భారత్ ఎదిగింది. ప్రస్తుతం దేశంలో 1.4 లక్షలకు పైగా స్టార్టప్‌లుండగా.. అందులో 100 కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువతో యూనికార్న్ హోదా సాధించిన స్టార్టప్‌లు 100 దాటాయి.

త్వరలో ఆర్‌బీఐ వెబ్ సిరీస్

ఆర్‌బీఐ తన విధులతో పాటు 90 ఏళ్ల ప్రయాణాన్ని ప్రజలకు తెలియజేసేందుకు 5 ఎపిసోడ్లతో కూడిన ఓ వెబ్ సిరీస్‌ను విడుదల చేసే ఆలోచనలో ఉంది. దాదాపు 3 గంటల నిడివితో కూడిన ఈ వెబ్ సిరీస్ ఒక్కో ఎపిసోడ్ 25-30 నిమిషాలు ఉంటుందని తెలిపింది. ఈ వెబ్ సిరీస్‌ను జాతీయ టీవీ చానెళ్లతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రసారం చేయనుంది. 1935లో ఏర్పాటైన ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌తో 90 ఏళ్లు పూర్తి చేసుకుంది.

సిల్వర్ ధమాల్

ఒక్కరోజే రూ.4,500 తగ్గిన ధర

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(24 క్యారెట్లు) ధర సోమవారం రూ.950 తగ్గి రూ.71,050కు జారుకుంది. ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్ భారీగా తగ్గడం ఇందుకు కారణమైంది. కాగా, కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గుదలతో రూ.84,500 స్థాయికి దిగివచ్చింది. ఈ ఏడాదిలో సిల్వర్‌కు ఇదే అతిపెద్ద ధర పతనం. నాణేల తయారీదారులు, పరిశ్రమల నుంచి డిమాండ్ కొరవడటం ఇందుకు కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్ విషయానికొస్తే, ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,388.80 డాలర్లు, సిల్వర్ 28.02 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

- భారత్‌లోని 2 కోట్ల గిగ్ వర్కర్స్‌కు వాట్సప్ ద్వారా ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసే అవకాశాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు క్లియర్ ట్యాక్స్ ప్రకటించింది. ఏఐ ఆధారిత విధానంతో వాట్సప్ ద్వారా యూజర్లు తమ పన్ను ఫైలింగ్‌ను చేపట్టవచ్చు. ప్రస్తుతం ఐటీఆర్-1,4 ఫారమ్స్ అందుబాటులో ఉన్నాయి.
- యునైటెడ్ నీలగిరి టీ ఎస్టేట్స్. ప్రీమియం టీ బ్రాండ్ అయిన చామ్‌రాజ్.. కొత్త టీ బ్లెండ్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. మాస్టర్ బ్లెండ్, మాస్టర్ బ్లెండ్ జింజర్ టీ, మాస్టర్ బ్లెండ్ లెమన్ టీ పేరుతో వీటిని విడుదల చేసింది. 500. 250 గ్రాముల ప్యాక్‌ల్లో అందుబాటులో ఉండనున్న మాస్టర్ బ్లెండ్ టీ పొడి ధరలు వరుసగా రూ.175, రూ.95గా ఉన్నాయి. 250 గ్రాముల ప్యాక్‌తో కూడిన జింజర్, లెమన్ వేరియంట్ ధరలు రూ.210గా ఉన్నాయి.

నిఫ్టీ 25,000కు చేరువై.. వెనక్కి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నప్పటికీ ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా అతి స్వల్ప లాభంతో ముగింపు పలికాయి. ఈ వారంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్త ధోరణిని కనబరిచారని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. మోస్తరు లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్. ఒక దశలో 575.71 పాయింట్ల వరకు ఎగబాకి 81,908.43 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. రికార్డు స్థాయిలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీ చివరికి 23.12 పాయింట్ల లాభంతో 82,355.84 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 164.9 పాయింట్ల వృద్ధితో 24,999.75 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1.25 పాయింట్ల లాభంతో 24,836.10 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి.

ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ధరల శ్రేణి రూ.72-76

వచ్చే నెల 2 నుంచి 6 వరకు ఆఫర్

ఆన్‌లైన్ క్యాబ్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ ఓలాకు చెందిన విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) రిటైల్ మదుపరుల కోసం వచ్చే నెల 2న ప్రారంభమై 6న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.72-76గా నిర్ణయించింది. గరిష్ఠ ధర ప్రకారం సంస్థ ఈ ఇష్యూ ద్వారా రూ.6,146 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. అందులో రూ.5,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 8.49 కోట్లకు పైగా షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) పద్ధతిన విక్రయించనుంది. తద్వారా మరో రూ.646 కోట్ల వరకు సమకూరవచ్చు. గరిష్ఠ ధర ప్రకారం.. కంపెనీ మార్కెట్ విలువ రూ.33,522 కోట్ల స్థాయిలో నమోదు కానుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ ఏడాది అతిపెద్ద ఐపీఓల్లో ఒకటి. ఈ ఇష్యూలో పెట్టుబడి పెట్టాలనుకునే మదుపరులు కనీసం 195 షేర్ల కోసం బిడ్ వేయాల్సి ఉంటుంది. ఆపై బిడ్ సైజును 195 షేర్ల చొప్పున పెంచుకుంటూ పోవచ్చు.

1 నుంచి సీగల్ ఇండియా ఐపీఓ: మౌలిక రంగ కంపెనీ సీగల్ ఇండియా లిమిటెడ్ ఐపీఓ వచ్చే నెల 1న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.1,253 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.380-401గా నిర్ణయించింది.

ధరల పోటీ తట్టుకోలేక పోతున్నాం

అందుకే ఇండియా సిమెంట్స్‌ను అమ్మేశా: ఎన్.శ్రీనివాసన్



చెన్నై: ఇండియా సిమెంట్స్ (ఐసీఎల్) అమ్మకానికి దారితీసిన పరిస్థితులను ఆ సంస్థ అధినేత ఎన్ శ్రీనివాసన్ తనకు సన్నిహితులైన 300 మంది ఉద్యోగులతో పంచుకున్నారు. ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి ధరల విషయంలో పోటీ సంస్థలతో పోటీపడలేకే కంపెనీని అమ్మాల్సి వచ్చిందని వారితో భావోద్వేగంతో చెప్పారు. కంపెనీ యాజమాన్యం చేతులు మారినా ఐసీఎల్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఢోకా ఉండదని హామీ ఇచ్చారు. కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు, భూములు అమ్మేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదన్నారు. కంపెనీ అమ్మకానికి ఇది కూడా ఒక కారణమన్నారు. 'ధరలు తగ్గించి మన పోటీ సంస్థలు మనల్ని తొక్కేయగలవు. వారితో పోలిస్తే మన ఉత్పత్తి వ్యయం కొద్దిగా ఎక్కువ. దాన్ని తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. అందుకే ఇండియా సిమెంట్స్‌ను అమ్మేయాల్సి వస్తోంది' అని శ్రీనివాసన్ తనను కలిసిన ఉద్యోగులతో భావోద్వేగంతో చెప్పారు. దీంతో గత 55 సంవత్సరాలుగా సిమెంట్ పరిశ్రమతో ఆయనకు ఉన్న అనుబంధం ముగియబోతోంది.

లిస్టెడ్ కంపెనీగానే ఐసీఎల్: ఇండియా సిమెంట్స్ (ఐసీఎల్) షేర్లను డీలిస్ట్ చేసే ఆలోచన లేదని అల్ట్రాటెక్ సిమెంట్ ప్రకటించింది. కంపెనీ ఈక్విటీలో మెజారిటీ వాటా తమ హస్తగతమైనా.. ఐసీఎల్ ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగానే కొనసాగుతుందని రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఐసీఎల్ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్, ఆయన కుటుంబసభ్యుల నిర్వహణలోని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) యాజమాన్యంలోనూ ఎలాంటి మార్పు ఉండదని ప్రకటించింది. ఐసీఎల్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కోసం తాము చేసే ఓపెన్ ఆఫర్‌ను యాక్సిస్ క్యాపిటల్ నిర్వహిస్తుందని తెలిపింది.

తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి యూనిటీ బ్యాంక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (యూనిటీ బ్యాంక్)- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్‌లో ఐదు శాఖలను ప్రారంభించింది. ఈ శాఖలను దిల్‌సుఖ్‌నగర్, ఎస్‌ఆర్ నగర్, మౌలాలి, సుచిత్ర క్రాస్‌రోడ్స్, కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసినట్లు యూనిటీ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఇంద్రజిత్ కమోత్రా వెల్లడించారు. రానున్న కొద్ది రోజుల్లో హైదరాబాద్‌లో మరో మూడు శాఖలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడల్లో శాఖలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించే ఉద్దేశంతో ఈ దీపావళి నాటికి క్రెడిట్ కార్డ్ విభాగంలోకి ప్రవేశించటంతో పాటు వ్యక్తిగత రుణాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇంద్రజిత్ తెలిపారు.

మ్యూచువల్ ఫండ్స్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్

» నవంబరు 1 నుంచి కొత్త నిబంధనలు : సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పైనా మార్కెట్ నియంత్రణ మండలి సెబీ దృష్టి పెట్టింది. ఈ జాడ్యానికి చెక్ పెట్టేందుకు కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఇందులో భాగంగా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) తమ పథకాల యూనిట్ల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ప్రచురితం కాని సమాచారం ఏఏ ఉద్యోగులు, వ్యక్తులకు అందుబాటులో ఉంటుందో ఒక జాబితా తయారు చేసి.. వారి నుంచి ఆ సమాచారం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడాలని కోరింది. ఈ సమాచారం రహస్యంగా ఉంచుతామని వారి నుంచి సంతకాలతో కూడిన ఒప్పంద పత్రాలు కూడా తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం ఉన్న ఉద్యోగులు, వ్యక్తులు ఆయా పథకాల యూనిట్లలో ట్రేడింగ్ చేయడాన్నీ అనుమతించరు.

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి టీజీపీఎస్సీ నోటిఫికేషన్

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదోతరగతి(2025 జూలై టర్మ్) ప్రవేశాలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత

గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జూలై 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష

మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 200 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి టీజీపీఎస్సీ చిరునామాకు పంపించాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరితేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నాంపల్లి, హైదరాబాద్ - 500001
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** rimc.gov.in, tspsc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/idJOcxHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నవ్య | చిత్రజ్యోతి

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్ చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎన్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేవిటో ఇప్పుడు చూద్దాం.

- ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.
- పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.
- నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.
- ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.
- నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.
- అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.


-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన విగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

కొత్తగా..



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ఫ్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో చార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు

ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం: భవనమ్
ప్రొడ్యూసర్: ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్: బాలాచారి కూరెళ్ల
బ్యానర్: సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు: సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు

ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటీలతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం: ఉషా పరిణయం
ప్రొడ్యూసర్: కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్: కె. విజయ్ భాస్కర్
బ్యానర్: విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్
నటీనటులు: శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య

బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం: బడ్డీ
ప్రొడ్యూసర్: కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్: శామ్ ఆంటోన్
బ్యానర్: స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్: అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)



ఆఖరి మ్యాచ్ ఆడేశా

రిటైర్మెంట్ ప్రకటించిన రోహన్ బోపన్న

న్యూఢిల్లీ: ఆటగాడిగా భారత టెన్నిస్‌తో రోహన్ బోపన్న ప్రస్థానం ముగిసింది. ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌తో 22 ఏళ్ల తన టెన్నిస్ కెరీర్‌కు అతడు ఘనంగా ముగింపు పలికాడు. శ్రీరామ్ బాలాజీ జతగా పారిస్ ఒలింపిక్స్ పురుషుల డబుల్స్ బరిలో దిగిన బోపన్న.. తొలి రౌండ్‌లో పరాజయం చవిచూశాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యం గెలిచిన తర్వాత విశ్వక్రీడల టెన్నిస్‌లో భారత్‌కు మరో పతకం లభించలేదు. అయితే 2016 రియో గేమ్స్‌లో సానియా మీర్జాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ పతకాన్ని రోహన్ త్రుటిలో మిస్సయ్యాడు. ఆ క్రీడల్లో బోపన్న, సానియా జోడీ నాలుగో స్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ ఆరంభ రౌండ్‌లోనే వెనుదిరిగినా..రెండు దశాబ్దాల తన టెన్నిస్ కెరీర్‌పట్ల బోపన్న సంతృప్తి ప్రకటించాడు. 'దేశం తరఫున ఇదే నా ఆఖరి మ్యాచ్. టెన్నిస్ క్రీడలో ప్రస్తుతం నేను ఏ స్థాయిలో ఉన్నానో అర్థమైంది. ఇకపై సాధ్యమైనంత కాలం టెన్నిస్ సర్క్యూట్‌ను ఎంజాయ్ చేస్తా' అని బోపన్న అన్నాడు. తద్వారా 2026 జపాన్ ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశాలు ఏమాత్రం లేవని అతడు స్పష్టంజేసినట్టయింది. డేవిస్ కప్ నుంచి రోహన్ ఇప్పటికే రిటైరైన సంగతి తెలిసిందే.

ఇదీ కెరీర్ ఘనత

కెరీర్‌లో మొత్తం 26 డబుల్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న బోపన్న..ఈ ఏడాది మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్ అందుకున్నాడు. ఆపై డబుల్స్‌లో నెం.1 ర్యాంక్‌నూ దక్కించుకున్నాడు. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌గా నిలిచాడు. 2010, 2023లో యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్‌కు చేరాడు. వింబుల్డన్‌లో మూడుసార్లు (2013, 2015, 2023), ఫ్రెంచ్ ఓపెన్ (2022, 2024) రెండుసార్లు డబుల్స్ సెమీస్ వరకు వచ్చాడు. 2012, 2016 ఒలింపిక్స్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

బోపన్న జోడీ అవుట్

టెన్నిస్‌లో భారత పోరాటం ముగిసింది. డబుల్స్‌లో బోపన్న జంట తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ జంట 5-7, 2-6తో ఫ్రాన్స్‌కు చెందిన ఎడ్వర్డ్ రోజర్-గేల్ మోన్‌ఫిల్స్ ద్వయం చేతిలో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో సుమిత్ నగాల్ కూడా మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

హర్మన్ మళ్లీ ఆదుకున్నాడు

అర్జెంటీనాతో భారత్ మ్యాచ్ డ్రా



పారిస్: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి ఆదుకున్నాడు. ఒలింపిక్స్ హాకీ పోటీల్లో భాగంగా మాజీ చాంపియన్ అర్జెంటీనాతో సోమవారం జరిగిన పూల్ 'బి' మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేసుకుంది. చివరి నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ గోల్‌గా మలచడంతో మ్యాచ్‌ను మనోళ్లు డ్రా చేయగలిగారు. అయితే ఈ మ్యాచ్‌లో దీనికంటే ముందు లభించిన తొమ్మిది పెనాల్టీ కార్నర్లను జట్టు వృథా చేసుకోవడం గమనార్హం. ఇక.. సారథి హర్మన్ జట్టును ఇలా గట్టెక్కించడం వరుసగా రెండోసారి. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లోనూ ఆఖరి క్షణాల్లో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను హర్మన్ గోల్‌గా మల్చడంతో జట్టు విజయం అందుకున్న విషయం విదితమే. ఈ పోరులో 22వ నిమిషంలో లుకాస్ మార్టినేజ్ ఫీల్డ్ గోల్ చేసి అర్జెంటీనాను ఆధిక్యంలో నిలిపాడు. 36వ నిమిషంలో మరో గోల్ చేసే మహత్తర అవకాశం అర్జెంటీనాకు దక్కింది. పెనాల్టీ స్ట్రోక్‌ను మైకో కసేలా గోల్ పోస్ట్‌లోకి పంపలేకపోవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయిన రియో విశ్వక్రీడల స్వర్ణ పతక విజేత అర్జెంటీనా..భారత్‌తో పోరులో విజయం సాధించడం అనివార్యమైంది. అందుకోసం శతధా యత్నించినా డ్రాతో సరిపెట్టుకోక తప్పలేదు. 10వ నిమిషంలో హర్మన్ సేనకు మొదటి పెనాల్టీ కార్నర్ దక్కింది. కానీ సంజయ్ కొట్టిన షాట్‌ను అర్జెంటీనా విజయవంతంగా అడ్డుకుంది. ఆ వెంటనే గోల్ కొట్టే సువర్ణావకాశం భారత్‌కు లభించింది. అభిషేక్ కొట్టిన షాట్ 'క్రాస్ బార్'ను తాకుతూ బయటకు వెళ్లిపోయింది. కానీ మ్యాచ్ మరి కొద్ది క్షణాల్లో ముగుస్తుందనగా లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా కొట్టి జట్టును రక్షించాడు. ఆరు జట్ల పూల్ 'బి'లో నాలుగు పాయింట్లతో భారత్ మూడో స్థానంలో కొనసాగుతోంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో మనోళ్లు తలపడనున్నారు.

మరొకటి ఊరిస్తోంది





రెండో మెడల్‌కు చేరువలో మను భాకర్

సరబ్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్య పోరుకు అర్హత

నేడే పతక పోరు
మ.1గం. నుంచి

మను జోడీ మెరుగైన ప్రదర్శన మినహా.. మిగతా షూటర్లు గురి తప్పడంతో.. ఒలింపిక్స్‌లో మూడోరోజు భారత్ పతకంతో మురిపించలేక పోయింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మను-సరభ్‌జోత్ జంట కాంస్య పోరుకు చేరుకోగా.. రైఫిల్ షూటర్ అర్జున్ బబుతా త్రుటిలో పతకం కోల్పోయాడు. రమితా జిందాల్ పేలవ ప్రదర్శనతో మెడల్‌కు దూరమైంది. పురుషుల ఆర్చరీ టీమ్ కూడా క్వార్టర్స్‌లో ఓడి నిరాశపర్చింది. అయితే, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాత్విక్ జోడీ క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడం ఊరటనిచ్చే విషయం.

పారిస్: భారత్‌కు చారిత్రక పతకం అందించిన ఆత్మవిశ్వాసంతో ఉన్న మను భాకర్ మరో మెడల్‌పై గురి పెట్టింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరభ్‌జోత్ సింగ్ జోడీగా మను కాంస్య పోరుకు చేరుకొంది. సోమవారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను భాకర్-సరభ్‌జోత్ సింగ్ జోడీ పాయింట్ తేడాతో గోల్డ్ కొల్లగొట్టే గొప్ప అవకాశాన్ని కోల్పోయింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను-సరభ్‌జోత్ మొత్తం 580 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచారు. 579 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన కొరియా జోడీతో మను ద్వయం మంగళవారం జరిగే కాంస్య పోరు ప్లేఆఫ్స్‌లో తలపడనుంది. తొలి రెండు సిరీస్‌ల్లో భాకర్ 98 పాయింట్లతో అదరగొట్టినా.. మూడో సెట్‌లో 95 పాయింట్లు మాత్రమే స్కోరు చేసింది. అయితే, సింగ్ 95, 97, 97 పాయింట్లు సాధించాడు. తొలి సెట్‌లో సరభ్‌జోత్ తక్కువ పాయింట్లు స్కోరు చేయడంతో గోల్డ్ మెడల్ పోరుకు చేరుకొని.. కనీసం రజతం ఖరారు చేసుకొనే అవకాశాన్ని భారత్ చేజార్చుకొంది. టర్కీ జంట 582 పాయింట్లతో టాప్‌లో నిలవగా.. సెర్బియా ద్వయం 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి స్వర్ణ పోరు ప్లేఆఫ్స్‌కు చేరుకొన్నాయి. కాగా, ఇదే ఈవెంట్‌లోకి మరో భారత జంట రిథమ్ సంగ్వాన్-అర్జున్ సింగ్ చీమా 576 పాయింట్లతో పదో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు అర్హత సాధించలేక పోయింది.

అయ్యో.. అర్జున్



అద్భుతంగా ఆరంభించినా.. చివర్లో ఒత్తిడికిలోనైన అర్జున్ బబుతా త్రుటిలో పతకం చేజార్చుకొన్నాడు. పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో బబుతా 208.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గే అవకాశాన్ని కోల్పోయాడు. చివరి షాట్‌లో మూడో స్థానంలో నిలిచిన క్రొయేషియా షూటర్ మిరాన్ మరికిక్ 10.7 స్కోరు చేస్తే.. అర్జున్ 9.5 పాయింట్లు మాత్రమే సాధించాడు. లిహావ్ షెంగ్ (చైనా) స్వర్ణం గెలవగా.. విక్టర్ లిండ్ గ్రెన్ (స్వీడన్) రజతం, మిరాన్ కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రమితా జిందాల్ 143.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది. పురుషుల ట్రాప్‌లో తొలి మూడు క్వాలిఫికేషన్ రౌండ్లు పూర్తయ్యే సరికి పృథ్వీరాజ్ తొండైమాన్ 30వ ర్యాంక్‌లో నిలిచాడు. మంగళవారం జరిగే మరో రెండు 'క్వాలిఫికేషన్స్' పూర్తయిన తర్వాత ఫైనల్ చేరే ఆరుగురిని నిర్ణయిస్తారు.





ఒలింపిక్ రికార్డు సాధించినా..

చైనా టీనేజ్ షూటర్ హువాంగ్ యూటింగ్ ఒలింపిక్ రికార్డు సాధించినప్పటికీ స్వర్ణం చేజారడం ఆశ్చర్యానికి గురిచేసింది. మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో చైనాకు చెందిన 17 ఏళ్ల హువాంగ్, 16 ఏళ్ల బాన్ హ్యోజిన్ (కొరియా) ఇద్దరూ 251.8 పాయింట్లతో ఒలింపిక్ రికార్డు సృష్టించి తొలి స్థానంలో నిలిచారు. అయితే విజేతను తేల్చేందుకు నిర్వహించిన షూటాఫ్‌లో బాన్ 10.4 స్కోరు చేయగా.. అటు హువాంగ్ 10.3తో నిలిచింది. దీంతో కేవలం 0.1 తేడాతో హ్యోజిన్ స్వర్ణం ఎగరేసుకుపోవడంతో, హువాంగ్ రజతంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.

బస్ ఆగిపోతేనేం..

ఒక్కోసారి తాము నేర్చుకున్న క్రీడ కష్టకాలంలో ఎలా ఆదుకుంటుందో ఈ సరదా సంఘటన చూస్తే తెలుస్తుంది. సోమవారం జరిగే ఈవెంట్ కోసం కెనడా, యూఎస్ఏకు చెందిన స్కేట్‌బోర్డ్ క్రీడాకారులను తీసుకుని ఓ బస్ వారి బస నుంచి బయలుదేరింది. అయితే వేదికకు రెండు కి.మీ దూరంలోనే ఓ ఇరుకైన మలుపు దగ్గర ఇరుక్కుపోయింది. పది నిమిషాలు వేచిచూసినా ఫలితం లేకపోవడంతో అంతా కిందికి దిగాల్సివచ్చింది. కానీ ఇక్కడే వారు తమ టాలెంట్‌ను ప్రదర్శించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తమ బ్యాగుల్లోంచి స్కేట్‌బోర్డులను బయటికి తీసి పారిస్ వీధుల గుండా ఎంచక్కా స్కేటింగ్ చేసుకుంటూ వేదికవద్దకు వెళ్లారు. ఇదంతా కెనడా అథ్లెట్ మ్యాట్ బెర్గర్ వీడియో తీయడంతో వైరల్‌గా మారింది.



కొడుకు కోరాడు.. పతకం పట్టేశాడు

బ్రిటన్‌కు చెందిన 30 ఏళ్ల డైవర్ టామ్ డేలీ టోక్యో గేమ్స్‌లో స్వర్ణం సాధించాక ఆటకు వీడ్కోలు పలికాడు. కానీ పారిస్‌లోనూ బరిలోకి దిగి రజతంతో మెరిశాడు. డేలీ రీఎంట్రీకి కారణం.. అతడి ఐదేళ్ల కుమారుడు రాబీ కావడం విశేషం. 'టోక్యో గేమ్స్ తర్వాత కొలరాడో స్ప్రింగ్స్‌లోని ఒలింపిక్ మ్యూజియానికి రాబీతో వెళ్లా. అక్కడి చిత్రాలను చూశాక పాత జ్ఞాపకాలతో కన్నీళ్లు ఆగలేదు. ఐదు ఒలింపిక్ గేమ్స్ ఆడాలన్నది నా స్వప్నం. దీంతో రాబీ.. నేను పారిస్‌లో పాల్గొంటే చూడాలని ఉందన్నాడు. అందుకే ఈసారి వచ్చా' అని నోహ్ విలియమ్స్‌తో కలిసి సింక్రనైస్డ్ 10మీ. ప్లాట్‌ఫామ్ డైవింగ్‌లో రజతం అందుకున్న డేలీ తెలిపాడు. 2008 నుంచి డేలీకిది ఐదో ఒలింపిక్ పతకం కావడం విశేషం.



అన్నకు మోదం చెల్లికి ఖేదం

జపాన్‌కు చెందిన ఉటా అబె, హఫుమి అబె అన్నాచెల్లెళ్లు.. అలాగే జూడో ప్రపంచ చాంపియన్లు కూడా.. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒకేరోజు స్వర్ణాలతో మెరిసి పారిస్ క్రీడల్లో ఫేవరెట్లుగా బరిలో దిగారు. కానీ ఈసారి నాటి సీన్ రిపీట్ కాలేదు. సోమవారం జరిగిన మహిళల అండర్-52 కిలోల విభాగంలో పాల్గొన్న ఉటా అబే రెండో రౌండ్‌లో డియోరా కల్డి (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడింది. దీంతో ఈ ఓటమిని భరించలేని ఆమె మ్యాట్‌పైనే కుప్పకూలి రోదించింది. కోచ్ ఎంత ఓదార్చినా ఫలితం లేకపోయింది. ఇక, స్టేడియంలోని ప్రేక్షకులు నిల్చొని చప్పట్లతో ఆమెకు మద్దతు ప్రకటించారు. మరోవైపు సోమవారమే జరిగిన పురుషుల అండర్- 66 కిలోల విభాగంలో విలియమ్ లిమా(బ్రెజిల్)ను ఓడించి ఉటా సోదరుడు హఫుమి స్వర్ణం గెలవడం విశేషం. ఇలా.. ఈ క్రీడలు అన్నకు సంతోషాన్ని అందిస్తే.. చెల్లికి బాధను కలిగించాయి.

క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఆడాల్సిన రెండో మ్యాచ్ రద్దయింది. జర్మనీ జంట లమ్స్‌ఫస్-మార్విన్ సీడెల్‌తో సాత్విక్ తలపడాల్సి ఉంది. అయితే, లమ్స్‌ఫస్ గాయపడడంతో జర్మనీ జంట ఒలింపిక్స్‌నుంచి వైదొలిగింది. దీంతో పోటీలో



మూడు జంటలు మాత్రమే నిలిచాయి. కానీ, ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కోర్వీ-రోనన్ లబార్ జోడీ తామాడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఈ నేపథ్యంలో ఒక్కో మ్యాచ్ నెగ్గిన సాత్విక్ జోడీ, ఇండోనేసియాకు చెందిన అర్దియాంటో-అల్ఫియాన్ జంటలు టాప్-2లో నిలిచి నాకౌట్ బెర్త్‌లను ఖరారు చేసుకొన్నాయి. మంగళవారం ఈ రెండు జోడీల మధ్య జరిగే మ్యాచ్‌తో గ్రూప్ విన్నర్ ఎవరనేది తేలుతుంది.

లక్ష్యసేన్ తొలి మ్యాచ్ రద్దయినా..

తొలి మ్యాచ్ విజయాన్ని రద్దు చేసినా.. లక్ష్య సేన్ జోరు మాత్రం తగ్గలేదు. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-19, 21-14తో జూలియన్ (బెల్జియం)పై నెగ్గాడు. మంగళవారం జరిగే ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో మూడో సీడ్ జొనాథన్ (ఇండోనేసియా)తో సేన్ తలపడనున్నాడు. ఈ మ్యాచ్‌తో టోర్నీలో ఎవరు ముందంజ వేస్తారో తేలిపోతుంది. 16 గ్రూప్‌ల నుంచి టాప్‌లో నిలిచిన ఆటగాడు మాత్రమే నాకౌట్‌కు అర్హత సాధిస్తారు. కాగా కెవిన్ కార్డన్‌తో లక్ష్య సేన్ తలపడి గెలిచిన తొలి మ్యాచ్ ఫలితం రద్దయింది. ఇందుకు కెవిన్ గాయంతో పోటీల నుంచి వైదొలగడమే కారణం. నిబంధనల ప్రకారం గ్రూప్ దశలో ఏ ఆటగాడైనా గాయాలతో టోర్నీ నుంచి వైదొలిగితే అతడు ముందుగా ఆడిన మ్యాచ్‌లు, ఆడాల్సిన మ్యాచ్‌లను పరిగణనలోకి తీసుకోరు. ఆడిన మ్యాచ్‌లు ఏవైనా ఉంటే ఆ ఫలితాన్ని రద్దు చేస్తారు. ఇక, మహిళల డబుల్స్‌లో వరుసగా రెండో ఓటమితో అశ్విని జోడీ కథ దాదాపుగా ముగిసింది.

దండాన్ని నేలపై కొట్టి..



రమితా జిందాల్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్ ఆరంభానికి ముందు మాజీ షూటర్ అభినవ్ బింద్రా.. ఎర్రటి దండంతో నేలపై మూడుసార్లు కొట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. చూసే వారికి ఇది కొత్తగా అనిపించినా.. పారిస్ క్రీడల్లో కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టినట్టు నిర్వాహకులు వివరించారు. ఎర్రటి దండాన్ని 'బ్రిగేడియర్'గా సంబోధిస్తున్నారు. ఈవెంట్ ఆరంభానికి ముందు ప్రేక్షకులను నిశ్శబ్దంగా ఉండాలని చెప్పడంతోపాటు వారి దృష్టి మొత్తం పోటీలపైనే కేంద్రీకరించే ఉద్దేశంతోనే ఆ దండాన్ని నేలపై కొట్టే ఆనవాయితీని తీసుకొచ్చినట్టు చెబుతున్నారు. 17వ శతాబ్దంలో నాటకం ఆరంభమయ్యే ముందు ఇలా దండాన్ని.. నేలపై కొట్టే సంప్రదాయం ఉండేదని ఒలింపిక్ వెబ్‌సైట్ పేర్కొంది.

ఆర్చరీలో అబ్బాయిలు కూడా..

రికర్వ్ ఆర్చరీలో భారత పురుషుల జట్టు కూడా తీవ్రంగా నిరాశపర్చింది. నేరుగా క్వార్టర్స్ చేరిన ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్ త్రయం కీలక మ్యాచ్‌లో ఘోరంగా తడబడింది. రౌండ్-8 పోరులో భారత్ 2-6తో టర్కీ చేతిలో ఓటమి పాలైంది. క్వాలిఫికేషన్ ఈవెంట్‌లో అద్భుతంగా రాణించిన తెలుగు కుర్రాడు ధీరజ్.. క్వార్టర్స్‌లో ఒక్కసారి మాత్రమే 10 పాయింట్లు సాధించాడు. తొలి రెండు సెట్లలో 53-57తో ఓడిన భారత్.. మూడో సెట్‌లో 55-54తో గెలిచి ఫలితాన్ని మరోసెట్‌కు తీసుకెళ్లింది. అయితే, నాలుగో సెట్‌లో చివరగా బాణం సంధించిన ధీరజ్ గురితప్పి 7 పాయింట్లే స్కోరు చేయగా.. టర్కీ ప్లేయర్ 10 సాధించాడు. దీంతో టర్కీ 58-54తో సెట్‌తోపాటు మ్యాచ్‌ను గెలిచి సెమీస్ చేరుకొంది.


నడాల్‌పై అవలీలగా..

జొకోవిచ్ ఘనవిజయం
మూడో రౌండ్‌లో ప్రవేశం



పారిస్: కెరీర్‌లో తొలి ఒలింపిక్ స్వర్ణం కోసం ఎదురుచూస్తున్న సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ బదులు తీర్చుకున్నాడు. 2008 ఒలింపిక్స్ సెమీస్‌లో తనపై గెలిచి స్వర్ణం సాధించిన నడాల్‌ను ఈసారి రెండో రౌండ్‌లోనే అడ్డుకున్నాడు. టెన్నిస్ దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్న ఈ ఇద్దరి మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతుందనుకున్నా, జొకో దూకుడుకు పోరు ఏకపక్షంగా ముగిసింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో జొకో 6-1, 6-4తో నడాల్‌ను చిత్తుచేసి మూడో రౌండ్ చేరుకున్నాడు.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్ - పృథ్వీరాజ్ తొండైమాన్ (మ. 12.30), మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్ - శ్రేయాసి సింగ్, రాజేశ్వరి కుమారి (మ. 12.30), **మిక్స్‌డ్ 10 మీ. ఎయిర్‌పిస్టల్ కాంస్య పతక పోరు** - భారత్ (మను భాకర్/సరబ్‌జోత్ సింగ్) x దక్షిణ కొరియా (మ. 1);
హాకీ: భారత్ x ఐర్లాండ్ (సా. 4.45)
ఆర్చరీ: మహిళల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - అంకిత (సా. 5.15), భజన్ కౌర్ (సా.5.30), పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - ధీరజ్ (రా. 10.45);
బ్యాడ్మింటన్: పురుషుల డబుల్స్ : సాత్విక్/చిరాగ్ x అర్దియాంటో/అల్ఫియాన్ (ఇండోనేసియా) (సా. 5.30), మహిళల డబుల్స్ : అశ్విని/తనీషా x మపాస/యూ (సా. 6.20);
బాక్సింగ్: పురుషుల 51 కిలోల ప్రీక్వార్టర్స్ - అమిత్ పంఘల్ x పాట్రిక్ (జాంబియా) (రా. 7.15), మహిళల 57 కిలోల రౌండ్ ఆఫ్ 32-జాస్మిన్ లంబోరియా x నెస్తీ పెటెసియో (ఫిలిప్పీన్స్) (రా. 9.25), 54 కిలోల ప్రీక్వార్టర్స్ - ప్రీతి పవార్ x యెని మార్సెలా (కొలంబియా) (రా. 1.20).

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

నేడు లంకతో భారత్ మూడో టీ20




రాత్రి 7 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

పల్లెకెలె: కొత్త నాయకత్వంలో టీమిండియా ఆశించిన రీతిలోనే సాగుతోంది. శ్రీలంకతో వరుసగా రెండు టీ20లను ఖాతాలో వేసుకున్న భారత్ నేడు ఆఖరిదైన మూడో మ్యాచ్ కోసం బరిలోకి దిగబోతోంది. 2-0తో ఇప్పటికే సిరీస్ వశమైనప్పటికీ లంకను క్లీన్‌స్వీప్ చేయాలన్న లక్ష్యంతో ఉంది. చివరి మ్యాచ్‌లోనూ పైచేయి సాధించి సూర్యకుమార్ తన ఫుల్ టైమ్ కెప్టెన్సీ అరంగేట్రాన్ని చిరస్మరణీయం చేసుకోవాలనుకుంటున్నాడు. ఇక ఈ మ్యాచ్ నామమాత్రమే కావడంతో శాంసన్, పరాగ్, రింకూ సింగ్‌లకు మరింత ప్రాక్టీస్ ఇవ్వాలనుకుంటోంది. అలాగే అర్ష్‌దీప్‌నకు విశ్రాంతినిచ్చి ఖలీల్‌ను ఆడించే చాన్స్ ఉంది. మరోవైపు శ్రీలంక బ్యాటింగ్‌లో టాపార్డర్ మినహా అంతా విఫలమవుతున్నారు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా ఆ జట్టు తమ లోపాలను సరిచేసుకుంటే ఓదార్పు విజయం దక్కుతుంది.

శ్రీలంక చేరిన రోహిత్, విరాట్ : భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ శ్రీలంక చేరుకున్నారు. వచ్చేనెల రెండు నుంచి శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనేందుకు వారిద్దరు ఇక్కడకు విచ్చేశారు. రోహిత్, కోహ్లీతోపాటు వచ్చిన వన్డే జట్టు సభ్యులు శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా సోమవారం ఇక్కడ ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. కాగా..ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ అనంతరం రోహిత్, విరాట్ పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పిన విషయం విదితమే.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
జపాన్	6	2	4	12
చైనా	5	3	2	10
కొరియా	5	3	1	9
ఫ్రాన్స్	4	7	3	14
ఆస్ట్రేలియా	4	3	0	7
అమెరికా	3	8	7	18
బ్రిటన్	2	5	3	10
కెనడా	2	1	2	5
జర్మనీ	2	0	0	2
ఇటలీ	1	2	3	6
భారత్	0	0	1	1

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

క్రికెట్ స్టేడియానికి స్థలమివ్వండి

- ప్రభుత్వాన్ని కోరిన హెచ్‌సీఏ
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మించేందుకు 100 నుంచి 120 ఎకరాల భూమి కావాలని సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కోరింది. ఈమేరకు సంఘం కోశాధికారి సీజే శ్రీనివాస్ సోమవారం సీఎం కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. ప్రధానంగా హైదరాబాద్ పరిసరాల్లో నూతన స్టేడియం కట్టడానికి ప్రభుత్వ ధర ఆధారంగా భూమిని సమీకరించి ఇవ్వాలని కోరారు. హెచ్‌సీఏ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లాల్లోనూ మంచి స్టేడియాలు నిర్మించి, యువ క్రికెటర్ల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించినట్టు శ్రీనివాస్ తెలిపారు. భూసమీకరణకు చర్యలు తీసుకోవాలని సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని రేవంత్ ఆదేశించినట్టు శ్రీనివాస్ చెప్పారు. హెచ్‌సీఏ విజ్ఞప్తికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంపై ఆ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

అర్ధరాత్రి దాటినా.. అసెంబ్లీ!

» 15 గంటలకు పైగా బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈసారి రికార్డు స్థాయితో జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సభ.. అర్ధరాత్రి 12.30 గంటలు దాటాక కూడా కొనసాగుతూనే ఉంది. ఏకంగా 15 గంటలకుపైగా, తేదీ మారాక కూడా బడ్జెట్ పద్దులపై చర్చ జరుగుతూనే ఉంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాడివేడి వ్యాఖ్యలు, సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ కొనసాగుతున్నా.. ఒక్కసారి కూడా వాయిదా పడకపోవడం, వాకౌట్‌ల లాంటివి లేకపోవడం గమనార్హం.

అమెరికాలోని ఎన్ఆర్ఐలతో 4న రేవంత్ భేటీ

» ఇండియన్ కమ్యూనిటీ, ఓవర్సీస్ కాంగ్రెస్ ఏర్పాట్లు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 3వ తేదీన అమెరికా పర్యటనకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 4వ తేదీన న్యూజెర్సీ రాష్ట్రంలోని ఎడిసన్‌లో ఎన్ఆర్ఐలతో సమావేశం కానున్నారు. ఇండియన్ కమ్యూనిటీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ బృందం సంబంధిత ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ..రేవంత్ పాల్గొననున్న సమావేశానికి 3వేల మందికిపైగా ప్రవాస భారతీయులు హాజరు కానున్నట్టు తెలిపారు. పెట్టుబడుల సమీకరణలో భాగంగా ఆగస్టు 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సీఎం రేవంత్‌రెడ్డి అమెరికాలో పర్యటించనున్నారు.

డియర్ అథ్లెట్స్.. ఆల్ ది బెస్ట్

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్-2024లో తెలంగాణ నుంచి పాల్గొంటున్న క్రీడాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆయా కేటగిరీల్లో తొలి దశ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిఖత్ జరీన్ (బాక్సింగ్), శ్రీజ ఆకుల (టేబుల్ టెన్నిస్), పీవీ సింధు (బ్యాడ్మింటన్)కు ఫోన్ చేసి మాట్లాడి, ప్రత్యేకంగా అభినందించారు. షూటింగ్ పోటీ కోసం సిద్ధమవుతోన్న ఇషాసింగ్‌కు కూడా విషెస్ చెప్పారు. క్రీడాకారులందరూ తరువాతి దశల్లోనూ మంచి స్ఫూర్తిని కొనసాగించి, విజయంతో దేశానికి మెడల్స్‌ను తీసుకురావాలని ఆకాంక్షించారు.

తిరుమలలో మా సిఫారసు లేఖలు అనుమతించేలా చర్యలు తీసుకోండి

» సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తమ సిఫారసు లేఖలు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తమ నియోజకవర్గాల నుంచి ప్రతిరోజు వందలాది మంది తిరుమల వెళుతున్నారని తెలిపారు. తమ సిఫారసు లేఖలను అక్కడి అధికారులు అనుమతించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈమేరకు వారు సోమవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీ ప్రభుత్వంతో, టీటీడీ అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారని బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్ మీడియాకు తెలిపారు.

కేబినెట్‌లో మాదిగలకు చోటు కల్పించండి

» సీఎం రేవంత్‌కు మాదిగ ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గం నుంచి ఒకరికి చోటు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, సత్యనారాయణ, వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో రేవంత్‌కు వినతిపత్రం సమర్పించారు. మాదిగలు కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు.

పాత బస్తీ ఏమైనా ఒవైసీ జాగీరా?

» అక్బరుద్దీన్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): "పాతబస్తీ ఏమైనా ఒవైసీ జాగీరా?" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్‌పై మండిపడ్డారు. అసెంబ్లీలో అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. "రాత్రి 10 గంటలు దాటితే పాతబస్తీలోకి పోలీసులు రావద్దని అక్బరుద్దీన్ ఒవైసీ అంటున్నారు. పాతబస్తీ ఏమైనా ఒవైసీ జాగీరా? లేక పాతబస్తీ ఏమైనా పాకిస్థాన్‌లో ఉందని భావిస్తున్నారా? లేక ఇంకా నిజాం రజాకార్ల పాలనే కొనసాగుతుందని అనుకుంటున్నారా?"అని నిలదీశారు ఎవరో ఒక పోలీస్ తప్పు చేస్తే మొత్తం పోలీస్ వ్యవస్థను, పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేలా మాట్లాడటం సిగ్గుచేటని సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లలో డిజిటల్ విధ్వంసం: కేటీఆర్

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాఖాతాల్లో డిజిటల్ విధ్వంసం జరుగుతోందని, దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన పనులు, గత ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్లలో తొలగించడం సరికాదని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం ఈ డిజిటల్ సంపదను పరిరక్షించాలని, ఇందుకోసం తక్షణచర్యలు చేపట్టాలని, లేదంటే పరిష్కారంకోసం న్యాయపరంగా ముందుకు వెళ్తామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మరోవైపు సోమవారం అసెంబ్లీ ఆవరణలో వేములవాడకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేటీఆర్‌తో ఫొటోలు దిగారు. అసెంబ్లీ సందర్శనకు వచ్చిన వారు.. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ఎల్పీలోకి వెళ్తున్న కేటీఆర్‌ను ఫొటో కోరగా అందుకు ఆయన అంగీకరించారు. అయితే కేటీఆర్‌తో ఫొటో దిగే సమయంలోనూ కాంగ్రెస్ నేతలు మెడలో పార్టీ కండువాలు వేసుకోవడం గమనార్హం.

సీఎం రేవంత్‌కు పండుగల జాబితా అందజేత

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరుపుకొనే పండుగలకు సంబంధించిన తేదీలతో కూడిన జాబితాను సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విద్వత్ సభ బాధ్యులు అందజేశారు. తెలంగాణ విద్వత్ సభ ఆధ్వర్యంలో సిద్ధాంతులు చర్చించి, విశ్వావసు నామ సంవత్సరానికి (2025-26) సంబంధించిన పండుగల జాబితాను రూపొందించారు. ఆ జాబితాను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా విద్వత్ సభ బాధ్యులను సీఎం, మంత్రి అభినందించారు.

గ్రేటెస్ట్ హైదరాబాద్ చేస్తాం!: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌ను గ్రేటెస్ట్ హైదరాబాద్‌లా చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అసెంబ్లీలో హైదరాబాద్ నగర అభివృద్ధి, బడ్జెట్ కేటాయింపులపై సిటీ ఎమ్మెల్యేలు మాట్లాడిన సందర్భంలో శ్రీధర్‌బాబు ఈ వ్యాఖ్యలు చేశారు. మూసీ నది ప్రక్షాళనకు నిధులు కేటాయించామని, గ్రేటర్ హైదరాబాద్‌కు బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రణాళిక ప్రకారం పూర్తిచేస్తామని తెలిపారు.

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందేంటి?: కాటిపల్లి

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల విషయంలో కేంద్రాన్ని బద్నాం చేయడం సమంజసం కాదని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. స్మార్ట్ మీటర్లను అమర్చినా.. ఉచిత కరెంటు ఇవ్వాలని ప్రభుత్వాలు భావిస్తే ఇవ్వొచ్చని, దానికయ్యే బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సోమవారం తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ కొనుగోళ్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం విమర్శలు చేసుకోవడంతోపాటు, ఇద్దరూ హౌస్ కమిటీకి ఒప్పుకుంటున్నందున వెంటనే కమిటీని వేసి విద్యుత్ అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సింగరేణిని బతికించండి: కూనంనేని

అప్పులు, సమస్యల్లో ఉన్న సింగరేణిని బతికించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసలు సింగరేణిలో వచ్చిన లాభాలన్నీ ఎటు వెళ్లాయోనంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోమవారం శాసనసభలో బడ్జెట్ పద్దు చర్చపై ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ సింగరేణికి దాదాపు రూ.21వేల కోట్ల బకాయి చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాలన్నారు. సింగరేణిని కూడా విద్యుత్ శాఖపై ఏర్పాటు చేసిన కమిషన్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ అబద్ధాలు

» జవాబు చెప్పలేక తప్పుడు అంశాల ప్రస్తావన
» ఎల్ఆర్ఎస్ ఉచితమని.. మాట మార్చారు
» సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం పెడతాం
» మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సభా నాయకుడి హోదాలో ఆదర్శంగా ఉండాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ప్రజలను పక్క దోవ పట్టించేలా వ్యవహరిస్తున్న సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం పెడతామని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, రూ.31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇప్పటికే సభను తప్పుదోవ పట్టించేలా మూడు సార్లు మాట్లాడారని, రేవంత్ అబద్ధాలను మీడియా ఎండగట్టాలని సూచించారు. మేడిగడ్డ దగ్గర కాళేశ్వరంప్రాజెక్టు సాధ్యం కాదని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చినా కేసీఆర్ పట్టించుకోలేదంటూ గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక ఒకలా ఉంటే సీఎం మరోలా మాట్లాడారని దుయ్యబట్టారు. తాజాగా విద్యుత్ మీటర్ల అంశంపై శనివారం తప్పుడు పత్రంతో సభను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఉదయ్ ఒప్పందంలో తనకు కావాల్సిన వాక్యాలు చదివి మిగతావి వదిలేశారని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కేసీఆర్ ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. ఉమ్మడి ఏపీలో పోతిరెడ్డిపాడు విస్తరణ కోసం నాటి వైఎస్ ప్రభుత్వం జీవో ఇచ్చినప్పుడు పదవుల కోసం పెదవులు మూసుకున్నామన్న రేవంత్ ఆరోపణ వాస్తవం కాదని, అప్పుడు తాము మంత్రులమే కాదని వెల్లడించారు. అప్పటి ప్రభుత్వం నుంచి బీఆర్ఎస్ వైదొలగడానికి.. ఇది కూడా ఒక కారణమన్నారు. తమ ప్రశ్నలకు జవాబులు దొరకనప్పుడల్లా సీఎం తప్పుడు అంశాలు ప్రస్తావిస్తూ సభను పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ మాదిరిగా రాజీనామాలు, త్యాగాలు చేసిన చరిత్ర తెలుగు రాష్ట్రాల్లో ఇంకెవరికైనా ఉందా? అని ప్రశ్నించారు. 14 ఏళ్ల ఉద్యమంతో కేసీఆర్ తెలంగాణ సాధించకపోతే రేవంత్‌రెడ్డి ఇప్పటికీ చంద్రబాబుతోనే ఉండే వారని సీఎం, పీసీసీ అధ్యక్ష పదవులు దక్కేవి కాదన్నారు. "జైపాల్‌రెడ్డి పెద్ద తెలంగాణ వాది.. తాను చిన్న తెలంగాణ వాదిని అన్నట్టుగా రేవంత్ గొప్పలు చెబుతున్నారని.. ఆ రోజు తెలంగాణ కోసం 36 పార్టీలను ఒప్పించింది కేసీఆరా? జైపాల్ రెడ్డా? తెలంగాణ ఏర్పాటు ఖాయమన్న వాతావరణం ఏర్పడ్డాకే రేవంత్ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడారు" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని వ్యాఖ్యానించడం.. రేవంత్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చి చార్జీలు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు.

3 హత్య కేసుల్లో నిందితుడు

పెట్రోల్ బంకులో దొంగతనం కేసులోనూ.. జిల్లా నుంచి ఏడాదిపాటు బహిష్కరించారు

జగదీశ్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు
రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా
లేదంటే మంత్రి, సీఎం రాజీనామా చేయాలి
వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సవాల్
చెత్తగాళ్లు.. చెత్త మాటలంటూ ఫైర్
సవాల్‌కు సిద్ధం.. నిరూపిస్తా: కోమటిరెడ్డి



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో విద్యుత్తు అంశంపై చర్చ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మధ్య మాటల మంటలు రేగాయి. ఇరువురూ పరస్పరం తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేసుకున్నారు. ఆరోపణల్ని నిరూపించకపోతే పదవులకు రాజీనామా చేయాలంటూ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకునేదాకా వెళ్లింది. దీంతో సోమవారం శాసనసభలో చర్చ వాడివేడిగా జరిగింది. జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, "ఈయన తన గ్రామానికి చెందిన మదన్ మోహన్‌రెడ్డి హత్య కేసులో ఏ2. భిక్షం అనే వ్యక్తి హత్య కేసులో ఈయన, ఈయన తండ్రి ఏ6, ఏ7. రామిరెడ్డి హత్య కేసులో ఏ3. మా జిల్లా నుంచి ఈయనను ఏడాదిపాటు బహిష్కరించారు. అంతేకాదు.. మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్‌కు చెందిన పెట్రోల్ బంకులో దొంగతనం కేసులో ముద్దాయి. వీటితోపాటు ఎన్టీరామారావు హయాంలో మద్యనిషేధం విధించిన సమయంలో కర్ణాటక నుంచి మద్యం తెచ్చి అమ్ముతూ పట్టుబడ్డాడు. ఇప్పటికీ ఆ కేసు ఉంది. ఆయన తెలంగాణ ఉద్యమం చేసిండంట. దొంగతనాలు, కిరాయి హత్యలు తప్ప చేసిందేమీ లేదు" అంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. తనపై చేసిన ఆరోపణల్లో ఒక్కదానిని నిరూపించినా.. సభలో ముక్కు నేలకు రాసి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళతానని సవాల్ చేశారు. నిరూపించకపోతే మంత్రి వెంకట్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చెత్తగాళ్ల, చెత్త మాటలు అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.



16 ఏళ్లు కోర్టు చుట్టూ..

మంత్రి కోమటిరెడ్డి మరోసారి స్పందిస్తూ.. హత్య కేసుల్లో జగదీశ్‌రెడ్డి కోర్టు చుట్టూ 16 ఏళ్ల తిరిగిన విషయం రికార్డుల్లోనూ ఉంటుందన్నారు. బంకులో దొంగతనం కేసు, దొంగ మద్యం అమ్మిన కేసు ఇప్పటికీ ఉన్నాయని తెలిపారు. సవాల్‌ను స్వీకరిస్తున్నానని, వాటిని నిరూపిస్తానని చెప్పారు. లేదంటే తన మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానన్నారు. కాగా, జగదీశ్‌రెడ్డి.. స్పీకర్ తీరుపై అభ్యంతరం తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని.. శాసనసభ్యుల పట్ల జగదీశ్‌రెడ్డి ఇష్టానుసారంగా, అడ్డగోలుగా మాట్లాడారని, ఆయన మాటల్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. అయితే కాంగ్రెస్ నాయకులు తనపై మూడు హత్య కేసులు పెట్టారని, కోర్టు మూడు కేసుల్లోనూ తనను కోర్టు నిర్దోషిగా తేల్చిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసులు తప్ప.. తనపై మరే కేసులూ లేవన్నారు. ఈ విషయంలో హౌస్ కమిటీ వేయాలని స్పీకర్‌ను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ, "మా నాయకుడు కేసీఆర్ సత్య హరిశ్చంద్రుడే. మీ లాగా సంచులు మోసే చంద్రుడు కాదు. చంద్రుడి సంచులు మోసి జైలుకు పోయింది మీరు" అని అన్నారు.

సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయండి

» లేదంటే ఆ శాఖ పేరులో 'ప్రొహిబిషన్'ను తీసేయండి
» రాత్రి వేళ పోలీసుల జులుంపై పిల్ వేస్తా
» అసెంబ్లీలో మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, లేదంటే ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ పేరులో ప్రొహిబిషన్ పదాన్ని తొలగించాలని మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. మద్యపానాన్ని నిషేధించాలనే చిత్తశుద్ధి లేనప్పుడు శాఖ పేరులో 'ప్రొహిబిషన్' అనే పదం ఎందుకని ప్రశ్నించారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు డ్రగ్స్, గంజాయి ఎక్కడ్నుంచి వస్తున్నాయో పోలీసులకు తెలుసని, నిజంగా వారికి నిర్మూలించాలనే ఉద్దేశం ఉంటే ఒక్క రోజు సరిపోతుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో లాఅండ్ ఆర్డర్ అదుపు తప్పిందని, నేరాల రేటు పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు నేరాలు చేసే వారిని పట్టుకోకుండా.. సామాన్యులను విచారించడం, కొట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు మామూళ్లు వెళ్తున్నాయని, ఈ విషయమై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. పాతబస్తీతోపాటు ఇతర ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ పోలీసుల జులుంపై కోర్టులో పిల్ దాఖలు చేస్తామన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా నీలోఫర్ కేఫ్ తెరిచే ఉంటుందని, సిటీ కమిషనర్‌కు చాయ్, బిస్కట్లు వెళ్తున్నందునే దాన్ని మూసివేయడం లేదని ధ్వజమెత్తారు. మెట్రోతోపాటు ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌నూ తీసుకొస్తే పాతబస్తీ పేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తే జీహెచ్ఎంసీకి కనీసం రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు.

ఆరు నెలల్లో 1.2 లక్షల నేరాలు

శాంతి భద్రతల పరిరక్షణలో విఫలం: సబిత
పదేళ్లలో దిశ లాంటి ఎన్నో నేరాలు జరిగాయి
వాటన్నింటినీ గుర్తు చేసుకోండి: మంత్రి సీతక్క
ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని మందలించిన సభాపతి

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో రేవంత్ సర్కారు విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆమె సోమవారం శాసనసభలో మాట్లాడారు. గత ఆరు నెలల్లో 500 హత్యలు, 3200 దోపిడీలు, 10వేల దొంగతనాలు, వెయ్యి కిడ్నాప్ కేసులు, 1800 అత్యాచార కేసులు.. మొత్తం 1.2 లక్షల కేసులు నమోదయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నడిబొడ్డున గ్యాంగ్ రేప్ జరిగిందని.. కొల్లాపూర్‌లో గిరిజన మహిళపై.. మలక్‌పేటలో అంధుల పాఠశాలలో వికారాబాద్‌కు చెందిన బాలికపై అత్యాచారం జరిగిందన్నారు. నేరాలపై స్పందించడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేటులోనూ అమలుచేయాలని సబిత డిమాండ్ చేశారు. "25వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ఇస్తామనిచెప్పి.. మేము గుర్తించిన 11 వేల పోస్టులతోనే డీఎస్సీ వేశారు. మిగిలిన 14 వేలు, త్వరలో ఖాళీ కానున్న మరో 10 వేల పోస్టులు కలిపి 24 వేల పోస్టులతో మళ్లీ డీఎస్సీ వేయాలి" అని డిమాండ్ చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. సబిత ఆరోపణలపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని.. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యలపై రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంధుల పాఠశాలలో అత్యాచారం జరగలేదన్నారు. కొల్లాపూర్‌తోపాటు ఇతర అత్యాచార ఘటనలు దురదృష్టకరమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 'దిశ' వంటి ఘటనలు ఎన్నో జరిగాయని.. వాటిని కూడా ఒకసారి గుర్తుచేసుకోవాలని సీతక్క కోరారు. గత పాలనలో నేరాలే జరగలేదని, అంతా ఈ ఏడు నెలల్లోనే జరిగిందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం స్పందిస్తూ.. కొల్లాపూర్ మహేశ్ యాదవ్ హత్య కేసును రాజకీయం చేస్తున్నారన్నారు. భూసమస్య కారణంగానే హత్య జరిగిందని.. అందులో బీఆర్ఎస్ కార్యకర్త ప్రమేయం ఉందని చెప్పారు. కాగా.. సభలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంను ఏకవచనంతో సంబోధించడం.. మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మందలించారు.

బీఆర్ఎస్ ఆఫీసులకు అక్రమంగా స్థలాలు: నాయిని

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు గాను గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలపై విచారణ జరిపి, అక్రమ కేటాయింపులను రద్దుచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం పద్దులపై చర్చ జరిగే సమయంలో ఆయన మాట్లాడారు. హనుమకొండలో పార్కు స్థలంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని నిర్మించారని తెలిపారు. కేటాయించిన సర్వేనెంబరుకు, ఆఫీసు నిర్మించిన సర్వేనెంబరుకు పొంతనలేదని చెప్పారు. ఎకరంన్నర స్థలాన్ని కబ్జాచేశారని, కార్యాలయ విద్యుత్ బిల్లును పరిశీలిస్తే వినియోగదారుని పేరు బీఆర్ఎస్, తండ్రి పేరు బీఆర్ఎస్ అని ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు... గత పదేళ్లలో ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే దానిని కబ్జా చేశారని ఆరోపించారు.

ప్రముఖ సంస్థకు సినారె పేరు!

» ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాం
» 93వ జయంతి సభలో సీఎం రేవంత్
» తమిళ రచయిత్రికి పురస్కారం ప్రదానం


రచయిత్రి శివశంకరికి సి.నారాయణరెడ్డి అవార్డును ప్రదానం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు కవిత్వానికి కొత్త నడకలు నేర్పిన సాహిత్య దిగ్గజం, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలంగాణకే పరిమితమైన కవి కాదని, ఆయన తెలుగు జాతికే గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. కవిగా, సినీ గేయ రచయితగా, ఆచార్యునిగా, వర్సిటీ వీసీగా, రాజ్యసభ సభ్యుడిగా తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. సినారె 93వ జయంతి సందర్భంగా రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినారె జ్ఞాపకార్థం ముఖ్య కేంద్రానికి ఆయన పేరు పెట్టడంతో పాటు వేములవాడ, సిరిసిల్ల, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కాంస్య విగ్రహాలు నెలకొల్పుతామని కేసీఆర్ ప్రభుత్వం మాటిచ్చి, నెరవేర్చలేదని సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్య సభాముఖంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, నారాయణరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, మంత్రులతో చర్చించి, విశ్వవిద్యాలయానికి లేదా ప్రముఖ సంస్థకు సినారె పేరు పెడతామని ప్రకటించారు. ఆయన రచనలను పుస్తకాలుగా తీసుకురావడానికి సహకారం అందిస్తామని చెప్పారు. తమిళ రచయిత్రి శివశంకరికి సీఎం రేవంత్ చేతుల మీదగా 'విశ్వంభర సి.నారాయణరెడ్డి జాతీయ సాహితీ అవార్డు'ను ప్రదానం చేశారు. రూ.5లక్షల పురస్కారాన్ని సినారె కుటుంబ సభ్యులు అందజేశారు. సినారె రాసిన 'సమన్వితం' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ సినిమాలకు పాటలే కాదు, రాజకీయ ప్రసంగాలను కూడా సినారె రాశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాంతాబయోటెక్ వరప్రసాద్ రెడ్డి, సినీనటుడు మురళీమోహన్, సినారె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నాట్యాచార్యులు అనుపమ కైలాష్ బృందం సినారె రచించిన 'కర్పూర వసంత రాయలు' నృత్య రూపకాన్ని ప్రదర్శించింది.

గద్దర్ అవార్డుపై మరో మాట లేదు

» నా ప్రకటనపై మీరు కనీసం స్పందించలేదు.. సినీ ప్రముఖులపై రేవంత్ అసంతృప్తి

సినారె జయంతి సభలో సినీ నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ నంది అవార్డుల ప్రదానం పదేళ్లుగా ఆగిపోయిందని, వాటిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. నంది అవార్డులకు బదులుగా అంతకంటే ఘనంగా డిసెంబరు 9న తెలంగాణ మేలి జాతి రత్నం గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తామని తాను గతంలో ప్రకటించానని గుర్తు చేశారు. ఆ ప్రతిపాదనపై ఇంతవరకు సినీ ప్రముఖులెవ్వరూ తనను సంప్రదించలేదని, కనీసం స్పందించలేదని రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సినీ ప్రముఖులు ముందుకు వస్తే, తాను అన్న మాటకు కట్టుబడి డిసెంబర్ 9న గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆ విషయంలో మరో మాట లేదని తేల్చిచెప్పారు.

గవర్నర్‌గా రేపు జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

ఈ పదవి అస్సలు ఊహించలేదు
మోదీ ఫోన్ చేసి రాష్ట్రం విడిచి వెళ్లాలన్నారు
రేవంత్‌రెడ్డి తెలంగాణకు స్వాగతమన్నారు
గవర్నర్‌గా నియమించారని అప్పుడు అర్థమైంది: జిష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్/అగర్తల, జూలై 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కొత్త గవర్నర్‌గా నియమితులైన త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి జిష్ణుదేవ్ వర్మ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాధే నూతన గవర్నర్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. తాను బుధవారమే హైదరాబాద్‌కు వస్తానని జిష్ణుదేవ్ వర్మ ఆదివారం త్రిపుర రాజధాని అగర్తలలో తనను కలిసిన విలేకరులకు చెప్పారు. తెలంగాణ గవర్నర్‌గా తనను నియమిస్తారని అస్సలు ఊహించలేదన్నారు. రాష్ట్రపతి ప్రకటన వెలువడటానికి కొద్ది గంటల ముందు ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకరి తర్వాత ఒకరు ఫోన్ చేయడంతో తనకు విషయం తెలిసిందన్నారు. "ప్రధాని మోదీ శనివారం రాత్రి ఫోన్ చేశారు. త్రిపుర రాష్ట్రం బయట పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఏ బాధ్యత అప్పగించినా చేస్తానన్నాను" అని జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి, తెలంగాణకు సుస్వాగతం అని చెప్పారన్నారు. అప్పుడే తెలంగాణ గవర్నర్‌గా నియమిస్తున్నారని తనకు అర్థం అయ్యిందని వెల్లడించారు. త్రిపుర రాష్ట్రం నుంచి గవర్నర్‌గా నియమితులైన తొలి వ్యక్తి తానేనన్నారు. రాజ్యాంగబద్ధ పాలన జరిగేట్లు చూసే క్రమంలో ముఖ్యమంత్రితో సమన్వయంతో పని చేస్తానని చెప్పారు. తన నియామకాన్ని త్రిపుర రాష్ట్రం పట్ల ప్రధానికి ఉన్న శ్రద్ధకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎన్నికలు లేకున్నా తరచూ త్రిపురకు వస్తారని గుర్తు చేశారు. తెలంగాణ గవర్నర్‌గా వెళ్లినప్పటికీ, తాను పుట్టిన త్రిపురకు సాయం చేయాల్సి వస్తే ముందుంటానని చెప్పారు. జిష్ణుదేవ్‌వర్మ గత ఏడాది త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ప్రస్తుత గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలకు వెళ్లే ముందు రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సీఎం భేటీ అయ్యారు. రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఆయన త్వరలో అక్కడ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో సీఎం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

రాధాకృష్ణన్‌కు వీడ్కోలు

తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రాధాకృష్ణన్‌కు రాజ్‌భవన్ అధికారులు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న గవర్నర్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. విధి నిర్వహణలో తనకు సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా రాజ్‌భవన్ ఆవరణలోని అమ్మవారి ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



30వేల మంది టీచర్లతో 2న సీఎం భేటీ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదోన్నతులు పొందిన దాదాపు 30 వేల మంది ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 2న సమావేశం కానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఆ సమావేశం జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం టెలి కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, టీచర్ల సంఖ్యకు అనుగుణంగా సమావేశానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెయిన్ ప్రూఫ్ టెంటు వేయాలని అధికారులను సూచించారు.

వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్‌పై కసరత్తు

- రూ.3500 కోట్లతో 145 కిలోమీటర్ల మేర నిర్మాణం
- అసెంబ్లీలో సీఎంను కలిసిన రైల్వే సీఈ సుబ్రహ్మణ్యన్

పరిగి/కొడంగల్/హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ నిర్మాణంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై రైల్వే శాఖ చీఫ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యన్, సీఎంవో కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనతోపాటు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణిక రెడ్డి తదితరులు సోమవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చించారు. వికారాబాద్ నుంచి పరిగి మీదుగా కొడంగల్, మక్తల్, కృష్ణ వరకు ఏర్పాటు కానున్న రైల్వే లైన్ రూట్ మ్యాప్‌ను రైల్వే అధికారులు సీఎంకు చూపించారు. సుమారుగా 145 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రైల్వే లైన్‌కు రూ.3500కోట్ల వ్యయం అవుతుందని వివరించారు. రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి.. పలు సూచనలు చేసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.


వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ రూట్ మ్యాప్‌పై సూచనలు ఇస్తున్న సీఎం

యాదాద్రి ప్లాంట్‌లో 15 వేల కోట్ల దోపిడీ!

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చినప్పుడు తమ వాదనలు వినిపిస్తే వాళ్ల నిజాయితీ బయటకు వచ్చేది. అక్కడికి వెళ్లకుండా ఆ కమిషనే వద్దు అని కోర్టుకు వెళ్లారు. హైకోర్టు వారి వాదనను తిరస్కరించింది. సుప్రీంకోర్టుకు వెళితే విచారణ కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది. కమిషన్ చైర్మన్ పట్ల అభ్యంతరాలు ఉంటే వ్యక్తిని మార్చేందుకు ప్రభుత్వాన్ని సూచించింది. ఈ రోజు సాయంత్రంలోగా కొత్త చైర్మన్‌ను నియమిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

రూ.వేల కోట్ల కుంభకోణం జరిగింది...

జార్ఖండ్‌లో 2400 మెగావాట్ల పవర్ ప్రాజెక్టుకు టెండర్ పిలిస్తే... కొరియన్ కంపెనీ, బీహెచ్‌ఈఎల్, ఇంకో కంపెనీ టెండర్‌లో పాల్గొన్నాయని, తెలంగాణలో అంచనాలకు ప్రభుత్వం బీహెచ్‌ఈఎల్‌కు కాంట్రాక్ట్ ఇచ్చిన రోజే జార్ఖండ్ ప్రభుత్వం సూపర్ క్రిటికల్ టెండర్ పిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదే బీహెచ్‌ఈఎల్ 18% తక్కువకు టెండర్ కోట్ చేసి అక్కడ పని దక్కించుకుందని పేర్కొన్నారు. 18% తక్కువకు తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉండగా 4 వేల మెగావాట్ల విద్యుత్ పవర్ ప్రాజెక్టును బీహెచ్‌ఈఎల్‌కు అప్పజెప్పారని అన్నారు. రెండున్నరేళ్లలో తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉన్నందున బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చామన్నారని, కానీ.. టెండరు ఇచ్చి తొమ్మిదేళ్లు అయినా ఇప్పటి వరకు ఉత్పత్తి మొదలు కాలేదని గుర్తు చేశారు. "ఆనాడు రూ.7 కోట్లకు ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఒప్పందం చేస్తే.. ఇవ్వాళ రూ.10 కోట్లకు అంచనా పెరిగింది. కొన్ని వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగింది. బీహెచ్‌ఈఎల్‌కు విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యమే ఉంది. సివిల్ వర్క్స్ బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్ వర్క్(బీఓపీ)ను మిగతా కాంట్రాక్టర్లకు ఇస్తారు. ఇప్పటివరకు దేశంలో జరిగింది ఇదే. కానీ, బీహెచ్‌ఈఎల్ నుంచి బీఆర్ఎస్ నేతల బినామీలు, బంధువులు సివిల్ వర్క్స్‌ను కాంట్రాక్ట్ తీసుకున్నారు. దీంతో వేల కోట్ల రూపాయల మోసం జరిగింది. చివరకు కంకర, ఇసుక, వాచ్‌మెన్‌ల వరకు పార్టీ నాయకులకు, పార్టీ ఫిరాయించిన వారికి అప్పజెప్పారు" అని రేవంత్ ధ్వజమెత్తారు.

ఇండియా బుల్స్‌తో అవినీతి ఒప్పందం..

"గుజరాత్‌కు చెందిన ఇండియాబుల్ అనే కంపెనీ భద్రాద్రిలో సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో వెయ్యి మెగావాట్లకు పర్చేజ్ అగ్రిమెంట్ బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చింది. ఆ తర్వాత 2011లో కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది. 2013లోగా దేశంలో ఉన్న అన్ని సబ్‌క్రిటికల్ పవర్ ప్రాజెక్టుల్ని, సూపర్ క్రిటికల్‌కి మార్చుకోవాలని చెప్పింది. ఆ సమయంలో బీహెచ్‌ఈఎల్‌కు కట్టిన డబ్బులు ఇవ్వాలని ఇండియాబుల్ అడిగితే.. అగ్రిమెంట్ అయినందున మెషినరీ ఏర్పాటు చేశామని చెప్పింది. ఎవరికైనా మాకు అప్పజెప్పి పైసలు తీసుకోమని చెప్పింది. కమీషన్లకు కక్కుర్తిపడి ఇండియా బుల్ నుంచి వెయ్యికోట్లు మెక్కి కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీని మేం కొనుగోలు చేస్తామని వెళ్లి ఒప్పందాలు చేసుకున్నారు. వీళ్లు బీహెచ్‌ఈఎల్‌కు డబ్బులు ఇస్తే బీహెచ్‌ఈఎల్ ఇండియాబుల్‌కు డబ్బు చెల్లింపులు చేసింది. ఇండియాబుల్స్‌కు, వీరికి మధ్య జరిగిన అవినీతి లావాదేవీల్లో భాగంగానే వీళ్లు బీహెచ్‌ఈఎల్ దగ్గర కెళ్లి కాలం చెల్లిన టెక్నాలజీని తెచ్చుకున్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు ఇవ్వాల్టికి నీళ్లు వస్తే మునుగుతోంది. పర్యావరణ అనుమతి తీసుకోకపోవడంతో ఎన్జీటీ 16 మంది అధికారుల్ని విచారించాలని ఆదేశించింది. వీళ్లు చేసిన తప్పుడు పనికి రిటైర్ అయిన అధికారులు బిచ్చమెత్తుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భద్రాద్రి ఆరున్నర కోట్లకు ఒక మెగావాట్ ఉత్పత్తి చేయాల్సింది రూ.10 కోట్లకు అంచనా పెరిగింది. వెయ్యి మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు రూ.6వేల కోట్లతో పూర్తి చేయాల్సింది ఇవ్వాళ దాని అంచనా రూ.10 వేల కోట్లకు పెరిగింది. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన పని ఎనిమిదేళ్లు పట్టింది. యాదాద్రినీ ఇదే తరహాలో బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చి.. సివిల్ వర్క్స్ బినామీలకు ఇచ్చి వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు. వారి కోరిక మేరకు విచారణ కమిషన్‌కు ఆదేశించాం.



చర్లపల్లి జైలు జీవితం వారికి అనుభవం: జగదీశ్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. "సీఎం ఎందుకు అంతలా ఆవేశపడ్డారో? ఎందుకు జైలు జీవితం గుర్తు చేసుకుంటున్నారో? చర్లపల్లి జైలు జీవితం వారికి అనుభవం కాబట్టి మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటున్నట్లున్నాడు. నాకు కూడా చంచల్‌గూడ జైలు గుర్తుంది. తెలంగాణ ఉద్యమంలో జైలుకెళ్లిన. ఆయనకు చర్లపల్లే గుర్తుకు ఉంటది" అని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో సీఎం రేవంత్ జోక్యం చేసుకుంటూ, "సూర్యాపేట రైస్ మిల్లులో మిల్లర్లు పట్టుకుని ఎవరిని చెట్టుకు కట్టేశారో చిన్న పిల్లల్ని అడిగినా చెబుతారు" అని అన్నారు.



కమిషన్ పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్న సమయంలో అర్ధమై దొరికిపోయామని, జైలుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని కమిషన్ మీద ఆరోపణలు చేసి కోర్టుకు వెళ్లారు. రూ.40 వేల కోట్ల మీద 18% అంటే దాదాపుగా రూ.8 వేల నుంచి రూ.9 వేల కోట్లు తెలంగాణ విద్యుత్ శాఖకు నష్టం వచ్చింది" అని సీఎం వివరించారు.

అప్పటి పరిస్థితుల వల్లే బీహెచ్‌ఈఎల్‌తో ఒప్పందం: జగదీశ్‌రెడ్డి

2017 నాటికి పూర్తయ్యే ప్రాజెక్టుల్ని సబ్ క్రిటికల్‌లో పూర్తి చేయాలని కేంద్రం చెప్పిందని, ఆ నాడు మనకున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా అత్యవసర పరిస్థితుల్లో బీహెచ్‌ఈఎల్‌ను పిలిచి నాటి సీఎం వారితో మాట్లాడారని జగదీశ్‌రెడ్డి తెలిపారు. "సూపర్ క్రిటికల్ అయితే ఐదారేళ్లు పట్టొచ్చు.. మేం తక్కువలో తక్కువ అంటే నాలుగేళ్లలో పూర్తి చేస్తామని బీహెచ్‌ఈఎల్ వాళ్లు చెప్పారు. 270 ఇన్‌టూ ఫోర్ మెషినరీ సిద్ధంగా ఉందని సివిల్ వర్క్స్ చేసుకుంటే ఇక్కడ బిగించుకుని రెండేళ్లలో పని పూర్తిచేస్తామని చెప్పారు. ఆ తర్వాత ఎన్జీటీ కేసు, కరోనా ఇతర కారణాల వల్ల ఆలస్యమైంది. సబ్‌క్రిటికల్, సూపర్ క్రిటికల్ పేరుతో చేస్తున్న ప్రచారం సరైంది కాదు. యాదాద్రి, భద్రాద్రి బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చామంటున్నారు. కొత్తగూడెంను కూడా బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చాం. దానిపై మాట్లాడటం లేదు. బీహెచ్‌ఈఎల్ నుంచి పనులు తీసుకున్న కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు ఎవరో నాకు తెలియదు. బీహెచ్‌ఈఎల్‌కు కాకుండా అదానీకి ఇవ్వాలన్నది మీ ఆలోచన. మీరు అధికారంలోకి వచ్చి 8 నెలలు అయింది. కరెంట్ పోయిందని హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే... కేసులు నమోదు చేసి బెదిరిస్తున్నారు. వారి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా కరెంట్ సమస్యలపై మాట్లాడారు. ఆయనపైనా కేసులు పెడతారా? కోర్టులో జడ్జి, పీపీపై నమ్మకం లేకపోతే సాధారణ వ్యక్తి కూడా వారిని మార్చుకునే అవకాశం ఉంది. అలాగే విద్యుత్ కమిషన్‌పై కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. వీళ్లు సుప్రీంకోర్టును తప్పుబడుతున్నారా?" అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

కోర్టు నిర్ణయాల్ని తప్పుదోవ పట్టించేలా...

కోర్టును, కోర్టు నిర్ణయాల్ని తప్పుదోవ పట్టించేలా సభలో మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. చైర్మన్‌ను మార్చి విచారణ కొనసాగించాలని సుప్రీంకోర్టు చెప్పడంతో ఏం చేయాలో తోచక ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. "భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు 2017లో రూ.7290 కోట్ల 60 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. 2015లో ఒప్పందం చేసుకుని 2017లో పూర్తి చేస్తామన్నారు. అత్యవసరం ఉంది కాబట్టి సబ్‌క్రిటికల్‌తో ముందుకెళ్తున్నామన్నారు. 2022లో పూర్తయింది. రెండేళ్లలో పూర్తి కావాల్సింది ఏడేళ్ల పట్టింది. రూ.7290 కోట్లతో పూర్తి చేస్తామన్న ప్రాజెక్టు రూ.10,515 కోట్లకు పెరిగింది. దాదాపుగా 45% అంచనాలుపెంచారు. మెగావాట్‌కు 9కోట్ల 73 లక్షలు పడ్డది. వేల కోట్ల రూపాయలు మింగి. విద్యుత్ సంస్థలపై భారం మోపి 81 వేల కోట్ల రూపాయల అప్పునకు కారణమయ్యారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కూడా బీహెచ్‌ఈఎల్‌తో ఒప్పందం చేసినప్పుడు 25వేల 99 కోట్ల రూపాయలకు ఒప్పందం చేశారు. 2015లో ఒప్పందం చేసి 2021లో పూర్తి కావాల్సి ఉంది. 2024 ఇంకా పూర్తి కాలేదు. ఇంకా రెండేళ్ల సమయం పడుతుంది. 45 రోజులు వృధా చేయదల్చుకోలేదని బీహెచ్‌ఈఎల్‌కు టెండర్ ఇచ్చారు. 25 వేల కోట్లతో జరిగిన ఒప్పందం 34 వేల 542 కోట్లకు పెరిగింది. ఇంకా పూర్తి కాలేదు కాబట్టి 40 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. 15 వేల కోట్ల రూపాయలు అంచనాలు పెంచి దోచుకున్నారు. ఈ రోజు ఒక్క మెగావాట్‌కు యాదాద్రికి 8 కోట్ల 64 లక్షలు అయింది. ఇది పెరిగి 10 కోట్లకు చేరే అవకాశం ఉంది. భద్రాద్రి 9 కోట్ల 73 లక్షల మెగావాట్లు అయింది. మెగావాట్‌కు రెండున్నర కోట్లు అంచనా పెరిగిందంటే రెండున్నర వేల కోట్ల రూపాయలు భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో విఎంగింది ఎవరో లెక్కతేల్చేందుకే కమిషన్ ఏర్పాటు చేశాం. 2015లో చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు 2023-24లో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనను చూపించి తప్పించుకుంటున్నారు" అని సీఎం అన్నారు.

అందుకే హైదరాబాద్ విశ్వనగరంగా అవతరించింది...

"వాళ్లేదో తెలంగాణకు విద్యుత్ వెలుగులు తెచ్చినట్లు, తద్వారా తెలంగాణ ధగధగ మెరుస్తున్నట్లు ఇంకా ఎంత కాలం ఊదరగొడతారు? ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోపెట్టుబడులు తేవాలని, ఆనాటి ఉమ్మడి రాష్ట్రానికి ఆదాయం పెరగాలని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 24 గంటల విద్యుత్ ఈ ప్రాంతంలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వచ్చిన తర్వాత దాన్ని ఇంకా విస్తరించి ఐటీ రంగానికి, హైదరాబాద్‌కు ఒక్కక్షణం విద్యుత్ కోత ఉండరాదని తీసుకున్న నిర్ణయం వల్ల నిరంతర విద్యుత్‌తో ఐటీ, ఫార్మా, హోటల్ ఇండస్ట్రీలు అన్నీ నగరానికి వచ్చాయి. ఈ నగరంలో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగురోడ్డు, హైటెక్ సిటీ రావడం వల్ల హైదరాబాద్ విశ్వనగరంగా అవతరించింది" రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ నాడు తెలంగాణకు వస్తున్న అత్యధిక ఆదాయం ఆనాడు కాంగ్రెస్ పార్టీ యూపీఏ-1, యూపీఏ-2 తీసుకున్న నిర్ణయాల వల్ల ఈ నగరానికి ఆదాయం పెరిగిందన్నారు.

పదవులకోసం పెదవులు మూసుకున్నారు....

'పదవుల కోసం పెదవులు మూసుకున్నవారు మీరు' అని బీఆర్ఎస్ సభ్యులనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "రాజశేఖర్‌రెడ్డి మంత్రి పదవి ఇస్తే ఊడిగం చేసింది మీరు. చంద్రబాబు నాయుడు మంత్రి పదవులు ఇస్తే ఊడిగం చేసింది మీరు. తెలంగాణ బిల్లు వచ్చినప్పుడు 53 నిమిషాలు తెలంగాణ రాష్ట్రం ఎందుకు కావాలనేది ఇదే సభలో నేను మాట్లాడిన. తెలుగుదేశంలో ఉన్న నేను తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడిన. చంద్రశేఖర్‌రావు పార్లమెంట్‌లో ఎంత సమయం మాట్లాడింది రికార్డులు చూస్తే తెలుస్తుంది. ఎవరో త్యాగాలు చేస్తే అధికారంలోకి వచ్చిన వీరు మమ్మల్నా తప్పుబట్టేది? ఫాంహౌస్‌లు కట్టుకుంది మీరు, నిబంధనలు ఉల్లంఘించింది మీరు. బయట పెట్టినందుకు డిటెన్షన్ సెల్‌లో పెట్టారు. విద్యుత్ మీద ఎంత తక్కువ మాట్లాడితే మీకు అంత మంచిది. కావాలంటే ప్రత్యేకంగా పదేళ్ల పరిపాలన మీద రాత్రి, పగలు చర్చకు మేం సిద్ధం. మీరు అబద్ధాలు చెప్పడం ఆపకపోతే, నేను నిజాలు చెప్తా" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు విభజన నియమావళి ప్రకారం ఆస్తులు, అప్పులు జనాభా దామాషా ప్రకారం తెలంగాణకు 42%, ఆంధ్రప్రదేశ్ 58% ఆస్తులు, అప్పులు పంపకాలు జరిగాయని సీఎం గుర్తు చేశారు. "విద్యుత్తు ప్రాజెక్టులు ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందో అవి ఆ ప్రాంతానికే ఇచ్చే విధానం చట్టంలో ఉంది. ఈ విధానం వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుందని, సరిదిద్దాలని నాటి తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులు ఆ నాడు కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి దగ్గరికెళ్లారు. ఆయన సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి నచ్చజెప్పి రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత స్పీకింగ్ ఆర్డర్ ఇప్పించారు. విభజన చట్టంలో లేని రాజ్యాంగంలోలేని ఒక్క తెలంగాణ రాష్ట్రానికి మినహాయింపు ఇచ్చారు. ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం చూస్తే 36% తెలంగాణకు 64% ఏపీకి ఉండే. జైపాల్ రెడ్డి తీవ్రమైన కృషి చేషితో తెలంగాణను చీకట్ల నుంచి కాపాడారు" సీఎం పేర్కొన్నారు.

వాళ్లంటే కొత్తవాళ్లు.. మీరు కూడానా?

అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, జగదీశ్‌రెడ్డి, విజయుడు స్పీకర్ వెల్ దగ్గరకు వెళ్లారు. స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్.. సభా మర్యాదలు కాపాడాలంటూ వారికి సూచించారు. ఈక్రమంలో అక్కడున్న జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి.. వాళ్లంటే సభకు కొత్త వాళ్లు, మీరు కూడా వెల్ వరకు రావడమేంటని స్పీకర్ ప్రశ్నించారు.

ప్రశాంత్‌రెడ్డితో శ్రీధర్‌బాబు ముచ్చట

మధ్యాహ్నం వరకు హాట్‌హాట్‌గా జరిగిన సభా పర్వం.. ఒంటిగంట తరువాత సభలో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు.. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సీటు వద్దకు వెళ్లి, ఆ సీటులో కూర్చొని ఆయనతో కాసేపు ముచ్చటించారు. మరో సందర్భంలో వేముల ప్రశాంత్‌రెడ్డి.. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు సీట్ల వద్దకు వెళ్లి ముచ్చటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా మంత్రి పొన్నం పక్కన కూర్చొని కొద్దిసేపు మాట్లాడారు.

పొన్నం అన్నా ఏంటి సంగతులు!

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. పలువురు మంత్రులతో సరదాగా మాట్లాడారు. శ్రీధర్‌బాబుతో మాట్లాడి వస్తున్న క్రమంలో పొన్నంను చూసి.. అన్నా ఏంటి సంగతులు అంటూ ఆరా తీశారు. పొన్నంను మరో సీటు దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడారు. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బయటకు వెళ్తూ మల్లారెడ్డితో మాట్లాడి వెళ్లారు. మరోవైపు, బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ సీటు వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడారు.

స్పీకర్ దగ్గరకెళ్లి.. చెవిలో ఓ మాట చెప్పి..

సభలో చర్చ జరుగుతున్న సమయంలో మాజీ మంత్రి కేటీఆర్.. స్పీకర్ దగ్గరకు వెళ్లి ఆయనతో మాట్లాడారు. చాలా గోప్యంగా స్పీకర్ చెవిలో చెప్పారు. ఆ వెంటనే శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుతోనూ కేటీఆర్ మాట్లాడారు.

పొంగులేటి ఇటు రా.. కోరం ఏదో చెప్తున్నాడు!

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తుండగా.. అదే సమయానికి అటువైపుగా వెళ్తున్న మంత్రి పొంగులేటిని గమనించిన తుమ్మల.. "పొంగులేటి ఇటురా.. కనకయ్య ఏదో చెప్తున్నాడు" అంటూ పిలిచారు. ఇద్దరూ కుర్చీలో కూర్చొని ఎమ్మెల్యే కనకయ్యతో మాట్లాడారు.

నేడు రెండో విడత రుణ మాఫీ!

లక్ష-లక్షన్నర మధ్య రుణాలు మాఫీ.. ఏడు లక్షల మంది రైతులకు లబ్ధి.. వీరి ఖాతాలకు 6,500 కోట్ల నగదు బదిలీ

అసెంబ్లీలో చెక్కులు పంపిణీ చేయనున్న సీఎం

హైదరాబాద్, జులై 29 (ఆంధ్రజ్యోతి): రెండో విడత రుణమాఫీకి ముహూర్తం ఖరారైంది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రెండో విడత రుణమాఫీ నగదు బదిలీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. అసెంబ్లీ ఆవరణలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదే సమయంలో వివిధ జిల్లా కలెక్టరేట్లలో ఆ జిల్లా కలెక్టర్లు రైతులకు చెక్కులు పంపిణీ చేస్తారు. లక్షన్నర లోపు బకాయిలు ఉన్న సుమారు 7 లక్షల మంది రైతులకు మంగళవారం రూ.6,500 కోట్లు విడుదల చేయనున్నారు. లక్ష రూపాయల వరకు ఈ నెల 18 న రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. లక్షన్నర కేటగిరీలో ఉన్న రైతులకు ఈ నెలాఖరు లోపు రుణమాఫీ చేస్తామని అప్పుడే ప్రకటించింది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణ చేపట్టింది. ఈ నెల 15న జీవో నెంబరు- 567 జారీ చేసే నాటికే రూ.10 వేల కోట్లు సర్దుబాటు చేసింది. తొలి విడతలో 11.50 లక్షల మంది రైతులకు రూ.6,099 కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులకు తోడుగా ఈనెల 23 న రూ.3 వేల కోట్లు రిజర్వు బ్యాంకు నుంచి అప్పు తీసుకుంది. దీంతో ఖజానాలో రూ.7 వేల కోట్ల వరకు పోగయ్యాయి. రెండో విడతకు ఈ నిధులు సరిపోతాయనే ఉద్దేశంతో మంగళవారం పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్‌లో డేటా ప్రాసెసింగ్ సమాచారం ప్రకారం... లక్ష, లక్షన్నర మధ్య అప్పున్న రైతులు సుమారు 7 లక్షల మంది ఉన్నారు. వారికి రూ.6,500 కోట్లు సరిపోతాయని అంచనా వేశారు. రూ.6,500 కోట్లకు సంబంధించిన బిల్లులను సోమవారం సాయంత్రం ట్రెజరీకి సమర్పించారు. వ్యవసాయ శాఖ ప్రొసీడింగ్స్‌ను కూడా జారీ చేసింది. రైతులు, వారి ఖాతాలు, జమచేసే నిధుల వివరాలను ట్రెజరీకి అందజేసింది. మంగళవారం ఉదయానికి సర్వం సిద్ధం చేసి.. 11.45 నుంచి 12 గంటల మధ్య లాంఛనంగా నగదు బదిలీ ప్రారంభిస్తారు. కొంతమంది రైతులను అసెంబ్లీకి పిలిపిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వారికి డమ్మీ చెక్కులు పంపిణీ చేస్తారు. అదే సమయంలో జిల్లా కేంద్రాల్లో ఉన్న కలెక్టర్ కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్లు రైతులకు రుణమాఫీ చెక్కులను పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మరోవైపు కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రుణమాఫీ లబ్ధిదారులు, రైతులు, పార్టీ కార్యకర్తలతో సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో విడతలో అర్హులైన రైతుల జాబితాను మంగళవారం ఉదయమే వ్యవసాయ శాఖ వెల్లడించనుంది. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల రైతులకు రూ. 6,099 కోట్లు విడుదల చేయగా... 11.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,014 కోట్లు జమ అయ్యాయి. సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ.84.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఆర్‌బీఐ సూచించిన వివరాల మేరకు సాంకేతిక సమస్యలు సరిచేసి.. ఆర్‌బీఐ నుంచి నిధులు వెనక్కిరాగానే తిరిగి ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఇక వాణిజ్య బ్యాంకులకు అనుసంధానంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(సీడెడ్ సొసైటీలకు) సంబంధించిన రైతుల రుణ ఖాతాలపై తనిఖీలు పూర్తి చేశారు. ఈ నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మంగళవారం తర్వాత రెండు విడతల్లో కలిపి 18.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.12,600కోట్లను రుణమాఫీ కింద జమచేసినట్లు అవుతుంది. మూడో విడతలో లక్షన్నర నుంచి రెండు లక్షల మధ్య అప్పున్న రైతులకు ఆగస్టు నెలలో రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి సభలో తాజాగా ప్రకటించారు. మూడో విడతలో రైతుల సంఖ్య, అవసరమయ్యే నిధులురెండో విడతకు రెట్టింపు ఉండే అవకాశాలున్నాయి.



రుణమాఫీ కార్యక్రమం.. రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): లక్షన్నర రూపాయల వరకు ఉన్న రుణాలను మాఫీచేసే కార్యక్రమాన్ని మంగళవారం శాసనసభ ప్రాంగణంలో సీఎం రేవంత్ చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్న అన్ని రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయటానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో రూ. లక్ష వరకు జరిగిన రుణమాఫీలో సందేహాలు ఉన్న రైతులు, అక్కడ ఉన్న అధికారులు, బ్యాంకర్లతో నివృత్తి చేసుకోవాలని, ఆ తర్వాత లక్షన్నర వరకు జరిగే రుణమాఫీ కార్యక్రమాన్ని వీక్షించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు జరిగింది రుణమాఫీ కాదని, వడ్డీ మాఫీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కానీ తమది చేతల ప్రభుత్వమని, ఇప్పటికే రుణమాఫీలో రెండో విడతకు చేరుకున్నామని, వచ్చే నెలలో 2 లక్షల వరకు కూడా మాఫీ చేస్తామని పేర్కొన్నారు.



సభకే రానప్పుడు.. విపక్ష నేతగా ఎందుకు?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఒకరికి ఇవ్వొచ్చుగా!
- అధికారం ఉన్నప్పుడు రాజును అనుకున్నారు
- ఐఏఎస్‌లతోనూ కాళ్లు మొక్కించుకున్నారు
- విద్యుత్తు రంగంపై బాధ్యతలేని నిర్ణయాలు
- కేసీఆర్‌పై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విమర్శలు
- మీకు కేసీఆర్ అవసరంలేదు.. మేమే ఎక్కువ
- ఒకేరోజు 19 పద్దులపై చర్చ సాధ్యమా?: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. శాసనసభకే రానప్పుడు.. ప్రధాన ప్రతిపక్ష నేతగా బాధ్యతలెందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యుల్లోనే ఎవరో ఒకరికి ఆ అవకాశం ఇవ్వొచ్చు కదా! అని అన్నారు. సోమవారం శాసనసభలో డిమాండ్లపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "పదేళ్ల మీ స్థాయి (బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల) ఏంటో అందరికీ తెలుసు. సీఎం మీకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. నేను రాజును, నా తర్వాత నా కొడుకు రాజు అవుతాడు అనుకున్నాడు. రాష్ట్రాన్ని రాజులాగా, దేశంలో తెలంగాణ భాగం కాదన్నట్లుగా పాలించాడు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మంత్రులు, ఎంపీలతోపాటు ఐఏఎస్‌లతోనూ కాళ్లు మొక్కించుకున్నాడు" అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలో ఓట్లన్నీ బీజేపీకి వేయించారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌తో తక్కువ ధర కే ఒప్పందం చేసుకున్నా.. చెల్లింపులు చేయకపోవడం వంటి కారణాలతో ఆ రాష్ట్రం కరెంట్ ఆగిపోయిందని తెలిపారు. పైగా ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంట్ కొంటామని కారిడార్ బుక్ చేసుకొని, కరెంట్ తెచ్చుకోకున్నా.. చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్తు రంగంలో బాధ్యతారాహిత్యంతో నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. దేశంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినప్పటికీ సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ప్లాంట్ కట్టారని విమర్శించారు. దేశంలో పవర్ ప్లాంట్లన్నీ బొగ్గు గనుల ఉదరభాగంలో కడతారని, కానీ.. దామరచర్లలో యాదాద్రి ప్లాంట్ నిర్మాణం మాత్రం బొగ్గు గనులకు 250 కిలోమీటర్ల దూరంలో చేపడుతున్నారని అన్నారు. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్‌ల పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించారని, ఈ ప్లాంట్‌లలో సబ్ కాంట్రాక్టులన్నీ కూడా తమ వారికే కట్టబెట్టారని ఆరోపించారు. రామగుండంలో 4వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఎన్టీపీసీ తన సొంత నిధులతో కడుతుండగా.. ప్రభుత్వం మాత్రం అప్పులు చేసి, తప్పుడు నిర్ణయాలతో ప్లాంట్‌ల నిర్మాణం చేపట్టిందని విమర్శించారు. కరెంట్ తీసుకుంటారా? లేదా? అని ఎన్టీపీసీ నాలుగు దఫాలుగా లేఖలు రాసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పదేళ్ల పాలనలో ఇళ్లపై నుంచి వైర్లు కూడా మార్చలేదని, హైదరాబాద్‌లో తమ బంధువు కూడా కరెంట్ షాక్‌తో చనిపోయారని విచారం వ్యక్తం చేశారు.

కేసీఆర్ అవసరం లేదు.. మేమే ఎక్కువ

"శాసనసభలో మీతో చర్చించడానికి కేసీఆర్ అవసరంలేదు.. మీకు మేమే ఎక్కువ" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి.. అధికారపక్ష సభ్యులనుద్దేశించి అన్నారు. పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ, "కరెంట్ తీసుకుంటారా? లేదా? అని ఎన్టీపీసీ 4 నెలలుగా లేఖలు రాస్తోంది. అధికారంలో ఉన్నది మీరే. ఇంకా అధికారంలోకి వచ్చామనే భావన మీలో కలగడం లేదు. ఛత్తీస్‌గఢ్ కరెంట్ యూనిట్‌కు రూ.3.90కే వస్తే.. ఎన్టీపీసీ కరెంట్‌కు రూ.5.60 అవుతాయి. ఒక ప్రభుత్వరంగ సంస్థ మరో ప్రభుత్వరంగ సంస్థతో ఒప్పందం చేసుకున్నా, నామినేషన్‌పై పనులు అప్పగించినా నష్టాలేముంటాయి?" అని ప్రశ్నించారు. రైతుల మోటార్లకు మీటర్లు పెడితే రూ.30 వేల కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పినా తాము వినకుండా.. ఆ మొత్తాన్ని వదులుకున్నామని చెప్పారు. ఉదయ్ ఒప్పంద పత్రాలు చూపించి... ఏదో కొలంబస్, వాస్కోడిగామాలాగా సీఎం వ్యవహరించారని మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు తప్ప.. మిగిలిన వినియోగదారులకు మీటర్లు పెట్టడమే ఉదయ్ ఒప్పందంలో ఉందని తెలిపారు. విషయాన్ని దాచిపెట్టి, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికే ఉదయ్ ఒప్పందం వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సహా 27 రాష్ట్రాలు ఉదయ్ ఒప్పందంలో చేరిన తర్వాత తాము చేరామని పేర్కొన్నారు. 2014కు ముందే కరెంట్ లైన్ల కింద ఇళ్లు కట్టుకున్నారని, 2014 తర్వాత కట్టకుండా అడ్డుకున్నామని తెలిపారు. 2014కు ముందు తెలంగాణ విద్యుత్ స్థాపిత సామర్థ్యం 7778 మెగావాట్లుగా ఉంటే.. గత పదేళ్లలో 19 వేల మెగావాట్లకు చేరిందన్నారు. 2014కు ముందు రోజువారీ వినియోగం 128 మిలియన్ యూనిట్లు ఉంటే.. 298 మిలియన్ యూనిట్లకు చేర్చామన్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేశామని, అప్పులు చేయకుండానే ఇంత వృద్ధి సాధ్యమవుతుందా? అని ప్రశ్నించారు. అంతకుముందు పద్దుల పుస్తకాలు అందకపోవడంపై స్పందిస్తూ, "ఒకే రోజు 19 పద్దులపై చర్చ చేయడం ప్రజాస్వామ్యమా? మేమేం మాట్లాడాలో మాకే అర్థం కావడం లేదు. తెల్లవారుజామున 4:30 గంటలకు పద్దుల పుస్తకం పంపించి, చర్చించాలని కోరితే ఎలా?" అని జగదీశ్‌రెడ్డి ఆక్షేపించారు.



టు-లెట్ కోసం క్యూఆర్ కోడ్

» కూకట్‌పల్లిలో ఇంటి గేటుకు తగిలించిన యజమాని

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ యుగంలో అందరూ స్మార్ట్‌గా ఆలోచిస్తున్నారు. సాంకేతికతను మన నిత్యకృత్యాలకు ఆపాదిస్తున్నారు. ఓ ఇంటి యజమాని కూడా ఇలాగే ఆలోచించారు కాబోలు తన ఇంటి గేటుకు క్యూ ఆర్ కోడ్ ఉన్న బోర్డును వేలాడదీశారు. సాధారణంగా ఇళ్లు అద్దెకు ఇవ్వాలంటే ఎవరైనా .. ముందు గేటుకు టు-లెట్ బోర్డు పెట్టి దాని మీద ఫోన్ నంబర్ రాస్తారు. ఇక్కడ మాత్రం అద్దెకు దిగాలనుకునే వారు ముందు కోడ్‌ను స్కాన్ చేసి.. అందులో అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిందే. పూర్తి పేరు, విద్యార్హత, ఎక్కడ పనిచేస్తున్నారు ? ఎంత మంది ఉంటారు? హైదరాబాద్ వచ్చి ఎన్నాళ్లవుతుంది ? ఇలా అన్ని వివరాలు తెలియజేయాలి. అప్పుడే యజమాని అద్దెకు ఇవ్వాలా లేదా అన్నది నిర్ణయించుకుంటారు. వారంరోజులుగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భువన విజయం గ్రౌండ్ సమీపంలో ఆ ఇంటి గేటుకు తగిలించిన స్కానర్‌ను స్థానికులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇది వింతగా అనిపించినా భవిష్యత్తులో అద్దెకు ఇచ్చే ఓనర్లు నిశ్చింతగా ఉండవచ్చని పోలీసులు సైతం అంగీకరిస్తున్నారు.

భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయుడు జైపాల్‌రెడ్డి

» బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం సమసమాజాన్ని ఆకాంక్షించిన వ్యక్తి కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి అని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ కొనియాడారు. సోమవారం హైదరాబాద్‌లో "సామాజిక న్యాయం- ఎస్.జైపాల్‌రెడ్డి" అంశంపై నిర్వహించిన సదస్సుకు కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలి కమిషన్ నివేదికతో వీపీ సింగ్ ప్రభుత్వం బీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన సమయంలో కేంద్ర మంత్రిగా జైపాల్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. భవిష్యత్తు తరాలకు ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే దేశం వేగంగా ప్రగతి సాధిస్తుందని జైపాల్‌రెడ్డి భావించేవారని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి తెలిపారు.

కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పేరిట మోసం

» ఆరేళ్ల ఫీజులు, హాస్టల్‌కు ఒకేసారి వసూలు

» కానీ.. ఒక్క ఏడాదికే చెల్లించిన ఏజెంట్

శ్రీకాకుళం క్రైం, జూలై 29: కజకిస్థాన్‌లోని యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువు కోసం ఫీజుల రూపంలో ఓ ఘనుడు వైద్యవిద్యార్థుల తల్లిదండ్రుల వద్ద రూ.లక్షల్లో గుంజేశాడు. ఆ డబ్బులు యూనివర్సిటీకి సక్రమంగా చెల్లించక పోవడంతో విద్యార్థులు.. దేశంకాని దేశంలో పడరాని పాట్లు పడ్డారు. కరీంనగర్‌కు చెందిన గంగాధర్ హరీష్.. శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపాన యాతపేటలో 2022లో జీబీఎస్ ఇంటర్నేషనల్ అనే కార్యాలయాన్ని ప్రారంభించాడు. 8 మంది విద్యార్థులకు కజకిస్థాన్‌లోని ఓ మెడికల్ యూనివర్సిటీలో మెడిసిన్ సీట్లు ఇప్పిస్తానని నమ్మించాడు. ఆరేళ్లకు ఫీజు, హాస్టల్, భోజన సౌకర్యాల నిమిత్తం ఒక్కొక్కరి వద్ద రూ.28 లక్షల నుంచి రూ.48 లక్షల చొప్పున రూ.2కోట్లకుపైగా వసూలు చేశాడు. ఆ 8 మంది విద్యార్థులను కజకిస్థాన్‌లోని కళాశాలలో చేర్పించి.. ఒక ఏడాదికి ఫీజులు, వసతి, భోజనానికి నగదు చెల్లించాడు. కానీ.. రెండో ఏడాది నుంచి ఫీజులు చెల్లించలేదు. దీంతో విద్యార్థులను హాస్టల్ నుంచి వెళ్లగొట్టారు. దీనిపై విద్యార్థులు గంగాధర్‌ను నిలదీయగా.. ఆయన బెదిరింపులతోపాటు దాడులకు పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని విద్యార్థులు.. తల్లిదండ్రులకు వివరించారు. కజకిస్థాన్ పోలీసులతో పాటు ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశారు. తర్వాత వారంతా స్వదేశానికి తిరిగి వచ్చేశారు. గంగాధర్ తమ వద్ద ముందుగానే ఫీజు డబ్బులు వసూలు చేసి తమను మోసం చేశాడంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీకాకుళం ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

నాగర్‌కర్నూల్‌లో పాన్‌గల్ ఎస్‌ఐ వీరంగం

» ద్విచక్ర వాహనదారుడిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 29: వనపర్తి జిల్లా పాన్‌గల్ ఎస్‌ఐ కల్యాణ్ రావు ఓ ద్విచక్ర వాహనదారుడిపై తీవ్రంగా దాడి చేశాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పాన్‌గల్ ఎస్‌ఐ కల్యాణ్‌రావు ఆదివారం రాత్రి తన వాహనంలో హౌసింగ్‌బోర్డు నుంచి పట్టణంలోకి వస్తున్నారు. అదే సమయంలో వస్త్ర దుకాణం నిర్వాహకుడు మిడిదొడ్డి రంజిత్ బైక్‌పై ఎస్‌ఐ వాహనానికి ఎదురుగా వెళ్లాడు. దాంతో వాహనానికి ఎదురుగా ఎందుకు వచ్చావంటూ సివిల్ దుస్తుల్లో ఉన్న ఎస్‌ఐ అతణ్ని ప్రశ్నించాడు. ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో ఎస్‌ఐ అతడిపై పిడుగుద్దులతో విరుచుకుపడ్డాడు. ఆ సమయంలో ఎస్‌ఐ మెడలోని బంగారు గొలుసు తెగిపడింది. తన బంగారు గొలుసు దొంగిలిస్తున్నావంటూ ఆవేశంతో బూటు కాలితో రంజిత్‌ను తన్ని గాయపర్చాడు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఈ సంఘటనపై సీఐ కనకయ్యను వివరణ కోరగా, ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కాళోజీ హెల్త్‌వర్సిటీకి కొత్త వీసీ ఎన్నడో?

» వీసీ ఎంపికలో తీవ్ర జాప్యం..ఆ పోస్టుకు 35 దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ నూతన ఉపకులపతి (వీసీ) పోస్టు నియామక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వైద్య విద్య అడ్మిషన్ల ప్రక్రియ ముంచుకొస్తున్నా వీసీ నియామక ప్రక్రియ మాత్రం నిదానంగా సాగుతోంది. వీసీ పోస్టు కోసం తుది గడువునాటికి 35వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. వీటిని సెర్చ్ కమిటీ స్ర్కూట్నీ చేసి మూడు పేర్లను ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. ఆ తర్వాత అది ముఖ్యమంత్రి వద్దకు వెళ్తుంది. అనంతరం గవర్నర్ వద్దకు చేరుతుంది. ఆ మూడు పేర్లలో ఒకరి పేరును గవర్నర్ ఎంపిక చేస్తారు. అయితే ఇంతవరకు దరఖాస్తుల వడపోత కార్యక్రమమే జరగలేదని సమాచారం. మరోవైపు కొద్దిరోజుల్లో వైద్య విద్య అడ్మిషన్లు మొదలుకాబోతున్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ ముంచుకొస్తుంటే వీసీ నియామక ప్రక్రియ మాత్రం చాలా నిదానంగా సాగుతోంది.

తెలంగాణలో హత్య... మృతదేహాన్ని బైక్‌పై తీసుకొచ్చిన సోదరులు

సి.బెళగల్: ఆస్తి తగాదాలతో తెలంగాణలో సొంత అన్నను హతమార్చి సరిహద్దున ఉన్న కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో సోదరులు మృతదేహాన్ని పడేశారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దదన్వాడ గ్రామానికి చెందిన గోకారి కుమారుడు శేషిరెడ్డి(55)ను అతడి సోదరులు నాగిరెడ్డి, మహేశ్‌లు హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై ఆంధ్ర సరిహద్దులోని సి.బెళగల్ మండలంలోని కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పడేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.


వాణిజ్య పన్నుల స్కామ్ సీఐడీ చేతికి..

(మొదటి పేజీ తరువాయి)

సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ(ఐజీఎస్టీ)కి సంబంధించి రూ.1400 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీసీఎస్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. ఇది వందల కోట్ల వ్యవహారం కాదని, మొత్తం స్కామ్ రూ.వేల కోట్లలో ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. అందుకే సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించింది.

ఐఐటీ-హైదరాబాద్ పాత్ర ఏంటి?

జీఎస్టీలో అక్రమాలను గుర్తించడానికి రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సాంకేతిక సహకారం కోసం ఐఐటీ-హైదరాబాద్‌ను సర్వీసు ప్రొవైడర్‌గా నియవించుకుంది. రిటర్నుల దాఖలు, పన్ను చెల్లింపులను పరిశీలించడానికి ఈ సర్వీసు ప్రొవైడర్ 'స్ర్కూటినీ మాడ్యూల్స్'ను అభివృద్ధి చేసింది. కానీ.. ఇక్కడి డీలర్లు 'జీఎస్టీఆర్-3బి' రిటర్నులను దాఖలు చేయకపోయినా.. ఈ స్ర్కూటినీ మాడ్యూల్ గుర్తించలేకపోయింది. వాణిజ్య పన్నుల శాఖ 2023 డిసెంబరు 26న ఐఐటీ-హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహించిన దర్యాప్తులో ఇది నిజమని తేలింది. ఐజీఎస్టీ రిటర్నుల ఫైలింగ్‌ను గుర్తించకుండా ఉండడానికి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు ఆ అధికారి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దాంతో పాటు ఐఐటీ-హైదరాబాద్‌లోని ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వాణిజ్య పన్నుల శాఖ స్ర్కూటినీ వ్యవహారాలను చూస్తుందని వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగానే.. కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్, ప్లియాంటో సంస్థను వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి వివరణ కోరారు. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడానికి సూచనలిచ్చామని కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ అంగీకరించినట్లు సీసీఎస్ పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఇద్దరు అధికారులతో పాటు సోమేశ్‌కుమార్ 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకుని, తరచూ సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకునేవారని గుర్తించింది. సోమేశ్ ఇచ్చే సమాచారంతోనే ఆ ఇద్దరు అధికారులు ఐఐటీ-హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబుతో మాట్లాడేవారని తేలింది. ఇలా వీరి సూచనల మేరకు 75 సంస్థలకు సంబంధించిన ఐటీ రిటర్నుల సమాచారం తెలియకుండా చేశారని గుర్తించింది. తద్వారా ఐటీసీ క్లెయిమ్‌లకు వీలు కల్పించారని, ఇందులో రూ.1400 కోట్ల వరకు ఐటీసీ సొమ్మును అడ్డదారుల్లో క్లెయిమ్ చేసుకున్నారని గుర్తించారు. ఒక్క తెలంగాణ బేవరెజెస్ కార్పొరేషన్‌కు సంబంధించినదే రూ.1000 కోట్ల వరకు ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు గుర్తించారు. మరో 11 సంస్థలకు సంబంధించి రూ.400 కోట్ల ఐటీసీ సొమ్మును క్లెయిమ్ చేసినట్లు తేలింది. సీఐడీతో మరింత లోతుగా దర్యాప్తు చేయిస్తే.. ఈ కుంభకోణంలో మరిన్ని మోసాలు బయటపడతాయని ప్రభుత్వం నిర్ణయించి, ఆ మేరకు ఆదేశాలిచ్చింది.



1000 కోట్ల జీఎస్టీ నిందితుడు.. నోరు విప్పితే బూతులు

» అదనపు కమిషనర్ విశ్వేశ్వరరావు తీరు

» విచారణ బృందం నిర్ధారణ.. సీఎం వద్ద ఫైలు..త్వరలో చర్యలు!

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని మహిళా అధికారుల పట్ల ఆ శాఖ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు అసభ్య పదజాలంతో విరుచుకుపడడం వాస్తవమేనని 'విచారణాధికారుల బృందం' తేల్చింది. ఈ మేరకు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక సీఎం రేవంత్ వద్దకు చేరింది. సీఎం త్వరలోనే ఆ అధికారిపై తగిన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. వాణిజ్య పన్నుల శాఖలోని కింది స్థాయి మహిళా అధికారుల పట్ల కాశీవిశ్వేశ్వరరావు అసభ్య పదజాలాన్ని వాడారని, తీవ్ర వేధింపులకు గురి చేశారని ఆరోపణలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ బూతుల వ్యవహారం గత ఏడాది డిసెంబరు నెలలో ప్రకంపనలను సృష్టించింది. ఆయన ప్రవర్తనకు విసిగిపోయిన మహిళా అధికారులు వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల సంఘం కూడా 2023 డిసెంబరు 12న కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా కాశీవిశ్వేశ్వరరావుపై కమిషనర్ టీకే శ్రీదేవి అదనపు కమిషనర్లు జయకామేశ్వరి, సునీత, ఫణీంద్రరెడ్డితో విచారణ జరిపించారు. ఈ బృందం గత ఏడాది డిసెంబరు 29న బాధిత అధికారుల నుంచి వివరాలు, సాక్ష్యాలను సేకరించి.. ప్రాథమిక నివేదికను అందజేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న సమగ్ర నివేదికను సమర్పించింది. ప్రస్తుతం ఈ నివేదిక వాణిజ్య పన్నుల శాఖ నుంచి సచివాలయంలోని ముఖ్యమంత్రి పేషీకి వెళ్లింది. సీఎం దీనిని పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలుస్తోంది. కాశీవిశ్వేశ్వరరావు మహిళా అధికారుల పట్ల వాడిన అసభ్య పదజాలం వాస్తవమేనని విచారణ బృందం తన సమగ్ర నివేదికలో స్పష్టం చేసింది. మహిళా అధికారుల పట్ల ఆయన... 'అది', 'ఇది', 'దీని సంగతి' వంటి పదాలను వాడారని తేల్చింది. మహిళా అధికారులు ఏదైనా అధికారిక లేఖ రాసినా, ఫోన్ మెసేజ్ పెట్టినా.. 'లవ్ లెటర్' రాశావేంటి అంటూ సంబోధించేవారని విచారణ బృందానికి బాధితులు వివరించినట్లు తెలిసింది. పనితనం బాగా లేదన్న కారణంతో మహిళా అధికారులపై చర్యలు తీసుకుంటామంటూ బెదిరించేవారని, మానసిక ఆందోళనకు గురి చేసేవారని ఆ నివేదిక తెలిపింది. కింది స్థాయి అధికారులను కులాల పేర్లతో.. 'గొల్లది', 'రెడ్డిది'.. అంటూ సంబోధించేవారని పేర్కొంది. ఈ విషయమై శాఖలోని జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులను విచారించామని, అవసరమైన సాక్ష్యాలను సేకరించామని, కాశీవిశ్వేశ్వరరావు వాడిన పదాలు అసభ్యంగా ఉన్నాయని విచారణ బృందం నివేదికలో వివరించింది.



అనారోగ్యంతో ఉన్న తల్లిని రోడ్డుపై వదిలేసి..

» కన్నకొడుకు నిర్వాకం.. ఆకలిదప్పులతో రెండ్రోజులు ఫుట్‌పాత్‌పైనే

» ఆస్పత్రిలో మృతి.. తుదిశ్వాస వరకూ కొడుకు గురించే ఆలోచన

బోయిన్‌పల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తల్లి.. అతడికి బరువైంది. అనారోగ్యానికి గురైతే ఆస్పత్రిలో చేర్పించి.. చికిత్స చేయాల్సింది పోయి.. అత్యంత నిర్దయగా రోడ్డు మీద పడేసి వెళ్లాడు! అయినా ఆమె ప్రాణం ఆ కొడుకు కోసమే తల్లడిల్లింది. కొడుకును చూడాలని ఉందంటూనే కన్ను మూసింది. మానవతావాదులను కన్నీరు పెట్టించేలా ఉన్న ఈ ఘటన బోయిన్‌పల్లి పరిధిలో జరిగింది. సీఐ లక్ష్మీనారాయణరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్ ఫిష్ మార్కెట్ వద్ద శ్యామల (60), ఆమె కుమారుడు అరవింద్ నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 5న శ్యామలను అరవింద్ బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో ఎంఎంఆర్ గార్డెన్ వద్ద ఫుట్‌పాత్‌పై వదిలేసి.. ఇప్పుడే వస్తానంటూ ఆమెకు చెప్పి వెళ్లిపోయాడు. రెండ్రోజులుగా ఆకలితో అలమటిస్తూ కుమారుడు వస్తాడని ఎదురుచూస్తూ.. చివరకు ఆ ఫుట్‌పాత్‌పైనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులొచ్చి 108లో ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మూడురోజుల క్రితం కొద్దిగా ఆమె కోలుకోగా పోలీసులు వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. తాను చనిపోయేలోపు ఒక్కసారైనా కొడుకును చూడాలని ఉందని ఆమె చెప్పింది. అరవింద్ కోసం పోలీసులు ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతిచెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ అస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

ప్రైవేటు స్కూళ్లకే మొగ్గు!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేసరికి ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల అడ్మిషన్లు తగ్గి ప్రైవేట్‌లో పెరిగాయి. ఆ ఏడాదిలో సర్కారు బడుల్లో 28,80,809 మంది, ప్రైవేట్ స్కూళ్లలో 30,17,877 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ ఏడాదిలో ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలు 1.37 లక్షలకు పైగా ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు మరింత తగ్గి 26,36,630 ఉండగా.. ప్రైవేట్‌లో 34,05,430 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరిన విద్యార్థులతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో 7 లక్షలకు పైగా ఎక్కువగా మంది చేరారు. ఇది ప్రైవేటు స్కూళ్లకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.

- ఇక పాఠశాల విద్యకు కేటాయిస్తున్న నిధుల్లో గత ఐదేళ్లలో ఒక్కసారే కేటాయింపులకన్నా ఎక్కువ ఖర్చు చేశారు. మిగతా నాలుగేళ్లలో కేటాయింపుల కంటే వ్యయం తక్కువుంది. 2019-20లో కేటాయింపుల కన్నా ఎక్కువ వ్యయం చేయగా.. తర్వాతి ఏడాది నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు కేటాయింపులకన్నా తక్కువ వ్యయం చేశారు.
- సైనిక పాఠశాలలు, జాతీయ సంస్థల్లో చదువుతున్న తెలంగాణ విద్యార్థులకు రూ.170 లక్షల ఉపకార వేతనాలను చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కోరుకొండ, కలికిరి, ఆర్ఐఎంసీ డెహ్రాడూన్, కొడుగు (కర్ణాటక), చంద్రాపూర్ (మహరాష్ట్ర), తిలైయ (ఝార్ఖండ్), అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్), బీజాపూర్ (కర్ణాటక), పురీలియా (పశ్చిమ బెంగాల్), మణిపూర్, భువనేశ్వర్, సతారా (మహారాష్ట్ర), అమరావతి నగర్ (తమిళనాడు)వంటి పాఠశాలల్లో చదివే సుమారు 298మంది తెలంగాణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్టు స్పష్టం చేసింది.
- ఆదర్శ పాఠశాలల్లో 1,053 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 194 ఆదర్శ పాఠశాలుండగా.. వీటిలో 1,21,346 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలల్లో 3,880 బోధన పోస్టులుండగా, ప్రస్తుతం 2,827 మంది పనిచేస్తున్నారు. 1,053 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- గ్రామ పంచాయతీల్లో పబ్లిక్ రీడింగ్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇందులో పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయగా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ప్రతి జిల్లా గ్రంథాలయాల్లో ఎయిర్ కండీషనింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది.
- రాష్ట్రంలో 15ఏళ్లు దాటిన వారిలో సుమారు 53 లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాల్సి ఉందని ప్రభుత్వం పేర్కొంది. వివిధ కారణాలతో పఢ్‌నా, లిఖ్ నా అభియాన్, నవ భారత అక్షరాస్యత కార్యక్రమం (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం)లను అమలు చేయలేకపోయినట్టు తెలిపింది.



మూడేళ్లలో పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు

సంవత్సరం	ప్రభుత్వ స్కూళ్లు	ప్రైవేట్ స్కూళ్లు	మొత్తం
2021-22	30,78,189	28,67,895	59,46,084
2022-23	28,80,809	30,17,877	58,98,686
2023-24	26,36,630	34,05,430	60,42,060

ఐదేళ్లలో పాఠశాల విద్యకు కేటాయింపులు.. వ్యయాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపు	వ్యయం
2019-20	7,781.57	9,196.96
2020-21	9,486.59	8,688.55
2021-22	10,205.40	8,999.27
2022-23	12,528.51	11,115.01
2023-24	14,488.25	14,333.88

చిన్నారుల పాత ఆధార్‌తో సిమ్ కార్డులు

» నకిలీ ఆధార్ కార్డులతోనూ!.. సైబర్ నేరగాళ్ల నిర్వాకం

» సిమ్ సబ్‌స్ర్కిప్షన్ ఫ్రాడ్స్‌తో ఏటా 3.6 లక్షల కోట్ల నష్టం

» టీజీ సీఎస్‌బీ, ఐఎస్‌బీ సంయుక్త అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఫొటోలతో ఉన్న కాలంచెల్లిన ఆధార్ కార్డులతో.. సైబర్ నేరగాళ్లు సిమ్ కార్డులు తీసుకుంటున్నారు. ఆ తర్వాత వాటితో రకరకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. "టెలికామ్ సిమ్ సబ్‌స్ర్కిప్షన్ ఫ్రాడ్స్-గ్లోబల్ పాలసీ ట్రెండ్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ రికమండేషన్స్" పేరిట రూపొందించిన ఈ అధ్యయన నివేదికను టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఐఎస్‌బీ ప్రొఫెసర్లతో కలిసి విడుదల చేశారు. సైబర్ నేరాల్లో సిమ్ కార్డు మోసాలు పెరుగుతున్నాయని, వీటిని అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అధ్యయనం ప్రకారం.. సిమ్‌కార్డుల రిజిస్ట్రేషన్ సమయంలో భారతీయ వినియోగదారుల్లో 64.5 శాతం మంది.. డిజిటల్ కేవైసీ (నో యువర్ కస్టమర్)ని ఉపయోగిస్తున్నారని, ఆ సమయంలో ఆధార్‌ను గుర్తింపు పత్రంగా చూపుతున్నారని తేలింది. అలాగే.. సిమ్ రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చే ప్రత్యామ్నాయ ఫోన్ నంబర్లలో 89 శాతం మేర నంబర్లు ఆధార్‌తో అనుసంధానమై లేవని గుర్తించారు. చాలా సందర్భాల్లో ఆ నంబర్లు ఇతర నేరగాళ్ల నంబర్లని కూడా ఈ అధ్యయనంలో వెల్లడైనట్టు వివరించారు. ఇలా మోసపూరితంగా సిమ్‌కార్డులు తీసుకున్నాక.. వాటిని భారీగా వాడేసి, డబ్బులు కట్టకుండా వదిలేస్తున్నారని.. రకరకాల నేరాలకు పాల్పడుతున్నారని అధ్యయనంలో తేలింది. నంబర్ వాడేసి డబ్బులు కట్టకుండా వదిలేస్తే దాన్ని 'సిమ్‌కార్డ్ సబ్‌స్ర్కిప్షన్ ఫ్రాడ్' అంటారు. ఈ తరహా మోసాల వల్ల ఏటా టెలికం రంగానికి రూ.3.6 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు.

అధ్యయనం ఇలా


ఈ అధ్యయనంలో భాగంగా.. తెలంగాణవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల్లో పేర్కొన్న ఫోన్ నంబర్లకు సంబంధించి మొత్తం 1,600 సీఏఎఫ్‌ల (కస్టమర్ అక్విజిషన్ ఫామ్స్) వివరాలను సేకరించారు. వాటిలో.. సైబర్ నేరగాళ్లు వినియోగించిన ఫోన్ నంబర్లను కృత్రిమ మేధ మాడ్యూల్స్ సాయంతో రియల్ టైంలో విశ్లేషించి.. వినియోగదారుడి వివరాల వెరిఫికేషన్‌లో చాలా లోపాలు ఉన్నట్టు తేల్చారు. ఓటీపీ అథెంటికేషన్‌లోనూ లోపాలు ఉన్నట్టు వెల్లడించారు. ప్రజలు తమ సిమ్‌కార్డులను పోగొట్టుకున్నా, అవి చోరీకి గురైనా వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని శిఖాగోయల్ సూచించారు. ఈ నివేదిక రూపకల్పనలో ఆపరేషన్స్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, నిజామాబాద్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవర్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ డాటా సైన్స్ ప్రొఫెసర్లు మనీశ్ గంగ్వార్, డా.శ్రుతిమంత్రిలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలు

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రైతుల పాస్‌పుస్తకాలపై కేవలం రాష్ట్ర రాజముద్ర, క్యూఆర్ కోడ్ ఉండనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో జగన్ ఫొటోలున్న పాసుపుస్తకాల జారీని ఎన్నికల కమిషన్ నిలిపివేసిన విషయం తెలిసిందే.! కూటమి ప్రభుత్వం ఆ పుస్తకాలను వెనక్కి తీసుకుంటామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులకు కొత్తగా రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని నిర్ణయించింది. ఈ పాసు పుస్తకాలపై రైతుల సమగ్ర వివరాలు తెలియజేసే క్యూఆర్ కోడ్‌ను ముద్రించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఆ కోడ్‌ను స్కాన్‌చేస్తే రైతుల భూముల వివరాలు, సరిహద్దులు, లోకేషన్, ఇతర వివరాలను తెలుసుకోవచ్చు. జగన్ బొమ్మలున్న పుస్తకాలను రీకాల్ చేసి, వాటి స్థానంలో రాజముద్ర, క్యూఆర్ కోడ్ ఉన్న పుస్తకాలను అందజేస్తారు. కాగా.. జగన్‌కు ఉన్న ప్రచార పిచ్చితో రాష్ట్ర ఖజానా గుల్ల అయినట్లు ప్రభుత్వం గుర్తించింది. రూ.700 కోట్ల ప్రజాధనాన్ని తగలబెట్టి, కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా భూముల సమగ్ర సర్వే పేరుతో గ్రానైట్ రాళ్లను తెప్పించారని నిర్ధారించింది. వాటిపై జగన్ పేరు, ఆయన తండ్రి పేరును చెక్కించుకున్నారని నిగ్గుతేల్చింది. సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సందర్భంగా.. సర్వేరాళ్లు, పాస్‌పుస్తకాలపై కీలక చర్చ జరిగింది. జగన్ ప్రచార పిచ్చిపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ రాళ్లపైన పేర్లను చెరిపించాలన్నా.. కోట్లు ఖర్చయ్యే పరిస్థితి నెలకొనడంతో.. ప్రత్యామ్నాయం చూడాలని చెప్పినట్లు తెలిసింది.

ఏపీలో పేదలకు స్థలాల జాక్‌పాట్!

గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు.. కొత్త లబ్ధిదారులకు మాత్రమే.. రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీలో పేదలకు అక్కడి సర్కారు శుభవార్త చెప్పింది. వారికి గ్రామాల్లో అయితే 3 సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత జగన్ ప్రభుత్వం గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు చొప్పున ఇచ్చి ఊరూవాడా డబ్బా కొట్టుకుంది. ఇప్పుడు చంద్రబాబు సర్కారు దానికి రెట్టింపు ఇవ్వాలని నిశ్చయించడం విశేషం. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష జరిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. అర్హులైన నిరుపేదలందరికీ 2029 కల్లా శాశ్వత గృహ వసతి కల్పించాలని లక్ష్యం విధించారు. రానున్న వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాల్లో కేంద్ర పథకాల ఆసరాతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు, జర్నలిస్టులకు సరసమైన ధరలకే ఇళ్లు నిర్మించాలని నిర్దేశించారు. దీనికి తగినట్లుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సీఎం సమీక్ష తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇకపై కొత్త లబ్ధిదారులకు గ్రామాల్లో 3 సెంట్లు స్థలం ఇవ్వాలని, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత సర్కారు ఇళ్ల పట్టాల కోసం భూసేకరణ జరిపి లేఅవుట్లు వేయని భూముల్లో ఇళ్లస్థలాలు పొందని పేదలకు కూడా 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని నిశ్చయించాం. జగన్ ప్రభుత్వం ఎన్టీఆర్ ఇళ్ల లబ్ధిదారుల విషయంలో పక్షపాతంతో వ్యవహరించి పూర్తయిన ఇళ్లకు కూడా చెల్లింపులు చేయలేదు. ఇటువంటి బాధిత లబ్ధిదారులకు వెంటనే చెల్లింపులు జరపాలని సీఎం ఆదేశించారు' అని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● మంగళవారం 30 జూలై 2024

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి టీజీపీఎస్సీ నోటిఫికేషన్

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదోతరగతి(2025 జులై టర్మ్) ప్రవేశాలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జూలై 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష

మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 200 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి టీజీపీఎస్సీ చిరునామాకు పంపించాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్, నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నాంపల్లి, హైదరాబాద్ - 500001
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 1
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** rimc.gov.in, tspsc.gov.in



అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ



హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తి చేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

క్లాట్ ప్రిపరేషన్

ఏయే పుస్తకాలు చదవాలి?

చక్కటి వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్నవారు న్యాయవాద వృత్తిలో బాగా రాణిస్తారు. ప్రస్తుత ప్రపంచీకరణ, పోటీతత్వంతో 'న్యాయవాద వృత్తి' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి రూపాంతరం చెందింది. సామాజికంగా, పారిశ్రామికంగా చోటు చేసుకుంటున్న మార్పుల ఫలితంగా పేటెంట్ హక్కుల పర్యవేక్షణ సంస్థలు, కాపీరైట్ సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్‌జీఓలు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 'లా' గ్రాడ్యుయేట్లను నియమించుకుంటున్నాయి. నేడు ప్రతీ కంపెనీలో 'లా' విభాగం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు 'లా' లో విభిన్న కోర్సులను నిర్వహిస్తున్నాయి. వీటిల్లో ప్రవేశానికి వీలు కల్పించే క్లాట్(కామన్ లా అడ్మిషన్ టెస్ట్) ఒకటి. తాజాగా క్లాట్-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష విధానం, ప్రిపరేషన్ స్ట్రాటజీ, చదవాల్సిన పుస్తకాలు తదితర తెలుసుకుందాం.

జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో సీట్లను క్లాట్ స్కోరు ద్వారా భర్తీచేస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణలో నల్సార్(హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో(విశాఖపట్నం) దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం కూడా ఉన్నాయి. క్లాట్-2025ని డిసెంబరు 1న నిర్వహిస్తున్నారు. దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబరు 15. నోటిఫికేషన్ పూర్తి సమాచారాన్ని www.consortiumofnlus.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

పరీక్ష విధానం-సన్నద్ధత

అండర్‌గ్రాడ్యుయేషన్

ఈ విభాగం కోసం నిర్వహించే పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. మొత్తం మార్కులు 120. నెగిటివ్ మార్కింగ్ ఉంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే 0.25 మార్కు కోత విధిస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ లీగల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ఇంగ్లీష్

తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం ఇది. గ్రామర్, ఇంగ్లీష్ భాషపై ప్రాథమిక అవగాహన ఉంటే ఈ విభాగంలో చక్కని స్కోర్ చేయవచ్చు. కాంప్రెహెన్షన్‌లో మంచి మార్కులకు వొకాబులరీపై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లీష్‌లో కేవలం వ్యాకరణమే కాకుండా పదాల వాడుక, సాధన మీద పట్టు ఉండాలి. తద్వారా ప్రశ్నలకు సులువుగా జవాబులను గుర్తించే సామర్థ్యం లభిస్తుంది. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. ముఖ్యంగా నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో గ్రామర్, వొకాబులరీ, కాంప్రెహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

చదవాల్సిన పుస్తకాలు: వర్డ్ పవర్ మేడ్ నార్మన్ లూయిస్; ఆబ్జెక్టివ్ జనరల్ ఇంగ్లీష్-ఆర్.ఎస్.అగర్వాల్; హైస్కూల్ గ్రామర్ రెన్ అండ్ మార్టిన్.

జీకే అండ్ కరెంట్ అఫైర్స్

కరెంట్ ఈవెంట్స్‌పై అభ్యర్థుల అవగాహనను పరీక్షించేలా ఇందులో ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, మార్పులు, కొత్త చట్టాలు, కేసులు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అంతేకాకుండా భారత దేశ చరిత్ర, రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలూ ఎదురవుతాయి. అందువల్ల జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టిపెట్టాలి. రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అవగాహన పెంచుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్య సంఘటనలు, సదస్సుల గురించి తెలుసుకోవాలి.

చదవాల్సిన పుస్తకాలు: మనోరమ ఇయర్ బుక్, ఇండియా ఇయర్ బుక్, సీఎస్ఆర్ ఇయర్ బుక్ సీఎస్ఆర్ జీకే, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలతోపాటు దిన పత్రికలు రోజూ చదవడం అలవాటు చేసుకోవాలి.

లీగల్ రీజనింగ్

అభ్యర్థుల్లో న్యాయపరమైన దృక్పథాన్ని; ఒక అంశం, వివాదం పట్ల సహేతుక ఆలోచన, నిర్ణయం వెలిబుచ్చే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఒక వివాదాన్ని పరిష్కరించే క్రమంలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. చట్టాలు, న్యాయ వ్యవస్థకు సంబంధించి ఇటీవలి పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

చదవాల్సిన పుస్తకాలు: యూనివర్సల్ ఎల్ఎల్‌బీ ఎంట్రెన్స్ గైడ్, లీగల్ ఆప్టిట్యూడ్- ఎ.పి.భరద్వాజ్. లీగల్ ఆప్టిట్యూడ్-ఆర్‌కే గుప్తా.

లాజికల్ రీజనింగ్

అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారితంగా, అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఈ మేరకు సిలాజిజమ్, కోడింగ్, డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

చదవాల్సిన పుస్తకాలు: వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్-ఆర్ఎస్ అగర్వాల్, అనలిటికల్ రీజనింగ్-ఎం.కె. పాండే.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్

ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు.

చదవాల్సిన పుస్తకాలు: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-ఆర్.ఎస్.అగర్వాల్; ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్-అర్హింత్.



పోస్ట్ గ్రాడ్యుయేషన్

ఈ పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. మొత్తం మార్కులు 120. నెగిటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్‌ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టోర్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో మంచి స్కోరు సాధించడానికి కింద పేర్కొన్న రెఫరెన్స్ బుక్స్ ఉపయోగపడతాయి.

1. **కాన్‌స్టిట్యూషనల్ లా:** ఇన్‌ట్రడక్షన్ టు ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా - డిడి బసు; కాన్‌స్టిట్యూషనల్ లా ఆఫ్ ఇండియా- డాక్టర్ జె.ఎన్.పాండే
2. **జ్యూరిస్‌ప్రుడెన్స్:** స్టడీస్ ఇన్ జ్యూరిస్‌ప్రుడెన్స్ అండ్ లీగల్ థియరీ- ఎన్.వి.పరాన్జపే; జ్యూరిస్‌ప్రుడెన్స్(లీగల్ థియరీ)- డాక్టర్ ఎస్.ఆర్.మైనేని; జ్యూరిస్‌ప్రుడెన్స్(కొశ్చన్స్ అండ్ ఆన్సర్స్)- డాక్టర్ రేగ సూర్యారావు
3. **లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా:** లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లాస్ - ఎస్.ఎన్.మిశ్రా; ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్ లాస్- ఎస్.సి. శ్రీవాత్సవ
4. **లా ఆఫ్ కాంట్రాక్ట్:** ద ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్, 1872 - యూనివర్సల్ లా పబ్లిషింగ్; కాంట్రాక్ట్-1, కాంట్రాక్ట్-2- ఆర్.కె.బంగియా
5. **టోర్ట్స్: లా ఆఫ్ టోర్ట్స్:** ఆర్.కె.బంగియా
6. **అడ్మినిస్ట్రేటివ్ లా:** సింఘాల్ లా పబ్లికేషన్స్- క్రిషన్ కేశవ్; లెక్చర్స్ ఆన్ అడ్మినిస్ట్రేటివ్ లా- డాక్టర్ రేగా సూర్యారావు
7. **ఎన్విరాన్‌మెంట్ లా:** ఎన్విరాన్‌మెంటల్ లాస్ బేర్ యాక్ట్ విత్ అమెండమెంట్స్ బై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా; ఎన్విరాన్‌మెంటల్ లా - డాక్టర్ నిష్ఠా జైశ్వాల్, డాక్టర్ పీ.ఎస్.జైశ్వాల్
8. **ఫ్యామిలీ లా:** మోడర్న్ హిందూ లా- డాక్టర్ పరాస్ దివాన్
9. **కంపెనీ లా:** కార్పొరేట్ లాస్- రీనా చద్దా; కార్పొరేట్ లాస్ - ట్యాక్స్‌మన్
10. **క్రిమినల్ లా:** క్రిమినల్ ప్రొసీజర్- ఆర్.వి.కేల్కర్; ద కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ - ఎస్.ఎన్.మిశ్రా
11. **ప్రాపర్టీ లా:** ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ - డాక్టర్ ఆర్.కె.సిన్హా; టెక్స్ట్ బుక్ ఆన్ ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ - డాక్టర్ అవతార్ సింగ్, డాక్టర్ హర్‌ప్రీత్ కౌర్.
12. **పబ్లిక్ ఇంటర్నేషనల్ లా:** పబ్లిక్ ఇంటర్నేషనల్ లాస్ - డాక్టర్ ఎస్.ఆర్.మైనేని
13. **ట్యాక్స్ లా:** డైరెక్ట్ ట్యాక్సెస్ రెడీ రికోనర్ - వినోద్ కె. సింఘానియా
14. **ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్:** లా రిలేటింగ్ టు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్- వి.కె.అహూజ

నిజాయితీకి పరీక్ష



ఒక ఊరిలో రాజారావు అనే పెద్ద వ్యాపారి ఉండేవాడు. అతని వద్ద ధనయ్య అనే నౌకరు పని చేస్తూ ఉండేవాడు అతనికి ఎంత జీతం ఇచ్చి, మంచిగా చూసుకున్నా, ఇంకా అసంతృప్తిగా ఉంటూ, ఎప్పుడు ఇనప్పెట్టె తాళాలు దొరుకుతాయా అందులో డబ్బు అంతా తీసుకుని పారిపోదామా అని వేచి చూసేవాడు యజమాని ఇంట్లో చిన్న చిన్న దొంగతనాలు కూడా చేసేవాడు. రాజారావు భార్య ధనయ్యను గమనించి అతని గురించి భర్తకు చెప్పే సమయం కోసం చూస్తోంది. ఈలోగా ఒక రోజు ధనయ్య రాజారావుతో 'అయ్యా నేనిక్కడ పని మానేసి, వెళ్లిపోతాను. నేనెంత నమ్మకంగా పని చేసినా, మీరు నన్ను నమ్మడం లేదు అన్నాడు ఆ మాటలకు రాజారావు 'అదేమిటి ధనయ్యా? నీకు ఈ ఇంట్లో కావలసినంత నమ్మకం, స్వేచ్ఛ ఉన్నాయి, నా ఇనప్పెట్టె తాళాలు కూడా నేను దాచి పెట్టలేదు. అదిగో ఆ గోడకే తగిలించి ఉన్నాయి. ఇంకా నిన్ను నమ్మక పోవడం ఏమిటి? అన్నాడు. అది విన్న ధనయ్య వెంటనే ఏం లాభం అండి? ఆ తాళం చెవితో పెట్టె తెరుచుకోవడం లేదు అని నోరుజారి, వెంటనే నాలిక కరుచుకున్నాడు. అపుడు రాజారావు' నీ బుద్ధి గురించి నా భార్య చెబుతున్నా నేను ఇన్ని రోజులు నమ్మలేదు నీకు నీ జీతం ఇస్తున్నాను. ఏమైనా కావాలంటే నన్ను అడగాలి కానీ పెట్టె తాళాలతో నీకేం పనయ్యా? నీ గురించి ఇప్పటికైనా బయట పడింది. నీకు రావలసిన డబ్బు తీసుకుని వెంటనే వెళ్లిపో, నిన్ను పనిలో నుంచి తీసేస్తున్నాను' అన్నాడు రాజారావు దురాశ వలన మంచి ఉద్యోగం పోయిందే అని తరువాత విచారించాడు ధనయ్య.

10 తేడాలను గుర్తించండి?



సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 370

	5		2	4	
3					
2					
					5
					6
	3	4		1	

సుడోకు - 369 సమాధానం

5	3	1	2	6	4
4	6	2	5	3	1
6	5	3	4	1	2
2	1	4	6	5	3
1	4	5	3	2	6
3	2	6	1	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.